తెలుగు భాషా సమితి బహుమతి నందిన గ్రంథం

కవిత్రయము

రచయిత

నండూరి రామ కృష్ణమాచార్య

ప్రకాశకులు

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు,

సికింద్రాబాదు–500 003

ఫోను : 7817397

సంస్కృతాంధ్ర రామాయణములలో యుద్ధ పద్ధతులు

పరిశోధకుడు

చేరాల వేంకట లక్ష్మీనరసింహారావు



పర్యవేక్షకులు

ఆచార్య నేతి అనంతరామశాస్త్రి, ఎం.ఏ., పిహెచ్.డి.,

తిరుమల-తిరుపతి దేవస్థానము వారి
ఆర్థిక సహాయముచే ప్రచురింపబడినది

ఎం.ఫిల్. పట్టము కొఱకై నాగార్జున విశ్వవిద్యాలయమునకు
సమర్పించిన లఘు సిద్ధాంత వ్యాసము

ఆగస్టు, 1999

తెలుగు భాషా సమితి బహుమతి నందిన గ్రంథం

కవిత్రయము

నన్నయ - తిక్కన - ఎఱ్ఱన

రచయిత

నండూరి రామ కృష్ణమాచార్య

ప్రకాశకులు

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు - 500 003,

ఫోను : 7817397.

వెల : రూ॥ 60/-

ఈ పుస్తకము శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సాహాయ్యముచే ముద్రించబడినది.

The book is printed with the financial aid by Sri Tirumala Tirupati Devasthanam.

రచన : నందూరి రామ కృష్ణమాచార్య
Author : Nanduri Rama Krishnamacharya

First Edition : 1954, Fourth Edition : 2002

వెల రూ॥ **60/- Price Rs. 60/-**

ప్రచురణ: డా॥ నందూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం
Dr. Nanduri Rama Krishnamacharya Sahitya Peetam
420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు - **500 003,**
ఫోను : **7817397.**
P.G. Road, Jawahar Nagar, Secunderabad- 500 003.
Copies : 1000 ప్రతులు : **1000**

ముద్రణ ***Printing***

బాల్‌రెడ్డి ప్రెస్ **Balreddy Press**

1-4-140, కళాసి గూడ, సికింద్రాబాదు - **500 003.**
Kalasiguda, Secunderabad.
ఫోను : **7813343, [illegible]**

కవిత్రయము పునర్ముద్రణ పీఠిక

నేనీ కావ్యం 1954 లో వ్రాసి ప్రచురించి గురుదేవులు పూజ్యుడు పింగళి లక్ష్మీకాంతంగారి అంకిత మిచ్చి యున్నాను.

ఈ గ్రంథం కవిత్రయమునకు "తెలుగు బాషా సమితి" వారి బహుమతి లబించినది. 1955లో హైదరాబాదులో అప్పటి రాష్ట్రపతి డా॥ రాజేంద్ర ప్రసాద్ గారి హస్తములనుండి బహుమతి నందుకున్నాను.

ఈ బహుళాంధ్రోక్తిమయ ప్రపంచములో .– ప్రాతః స్మరణీయమైన కవులు :– నన్నయ–తిక్కన–ఎఱ్ఱన. ఆంధ్ర మహా భారత కర్తలు అగుటచే వీరిని లోకము కవిత్రయముగా గుర్తించి యుండవచ్చును.

కవిత్రయము కేవలం కవులు మాత్రమేగాదు.

సమకాలీన చరిత్రలో కవిత్రయం నిర్వహించిన పాత్రలు గణణీయమైనవి. నన్నయ, రాజరాజ నరేంద్రునకు అనుంగు భక్తుడు మాత్రమే గాదు. తూర్పు చాణుక్య సామ్రాజ్యంలో నన్నయ "పాత్రుడు" ఆనాడు సంధి విగ్రహ పాత్రుడు అనబడిన రాయబారి "పాత్రుడు".

తూర్పు చాళుక్యులకు చోళులకు గల రాజకీయ సంబంధం చరిత్ర విదితం. మూడు తరాలుగా తూర్పు చాళుక్య రాజ కుమారులు చోళరాజ కన్యకలను వివాహము చేసుకున్నారు. చోళుల గొడుగు నీడ తూర్పు చాళుక్య రాజులను కాపాడింది. అయితే– కొప్పం యుద్ధంలో చోళుల పరాజయం రాజనీతిని చేసినది. తలక్రిందులు చేసినది. కొప్పం యుద్ధంలో చోళులకు పశ్చిమ చాళుక్య ప్రభువు ఓడించ గల్గెను.

ఈ పుస్తకము శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సాహాయ్యముచే ముద్రించబడినది.

The book is printed with the financial aid by Sri Tirumala Tirupati Devasthanam.

రచన : నండూరి రామ కృష్ణమాచార్య
Author : Nanduri Rama Krishnamacharya

First Edition : 1954, Fourth Edition : 2002

వెల రూ॥ **60/- Price Rs. 60/-**

ప్రచురణ: డా॥ నండూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం
Dr. Nanduri Rama Krishnamacharya Sahitya Peetam
420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు - 500 003,
ఫోను : 7817397.
P.G. Road, Jawahar Nagar, Secunderabad- 500 003.
Copies : 1000 ప్రతులు : 1000

ముద్రణ *Printing*
బాల్‌రెడ్డి ప్రెస్ **Balreddy Press**
1-4-140, కళాసి గూడ, సికింద్రాబాదు - 500 003.
Kalasiguda, Secunderabad.
ఫోను : 7813431, 7818595

కవిత్రయము పునర్ముద్రణ పీఠిక

నేనీ కావ్యం 1954 లో వ్రాసి ప్రచురించి గురుదేవులు పూజ్యుడు పింగళి లక్ష్మీకాంతంగారి అంకిత మిచ్చి యున్నాను.

ఈ గ్రంథం కవిత్రయమునకు "తెలుగు బాషా సమితి" వారి బహుమతి లభించినది. 1955లో హైదరాబాదులో అప్పటి రాష్ట్రపతి డా॥ రాజేంద్ర ప్రసాద్ గారి హస్తములనుండి బహుమతి నందుకున్నాను.

ఈ బహుళాంధ్రోక్తిమయ ప్రపంచములో – ప్రాతః స్మరణీయమైన కవులు :– నన్నయ–తిక్కన–ఎఱ్ఱన. ఆంధ్ర మహా భారత కర్తలు అగుటచే వీరిని లోకము కవిత్రయముగా గుర్తించి యుండవచ్చును.

కవిత్రయము కేవలం కవులు మాత్రమేగాదు.

సమకాలీన చరిత్రలో కవిత్రయం నిర్వహించిన పాత్రలు గణనీయమైనవి. నన్నయ, రాజరాజ నరేంద్రునకు అనుంగు భక్తుడు మాత్రమే గాదు. తూర్పు చాళుక్య సామ్రాజ్యంలో నన్నయ "పాత్రుడు" ఆనాడు సంధి విగ్రహ పాత్రుడు అనబడిన రాయబారి "పాత్రుడు".

తూర్పు చాళుక్యులకు చోళులకు గల రాజకీయ సంబంధం చరిత్ర విదితం. మూడు తరాలుగా తూర్పు చాళుక్య రాజ కుమారులు చోళరాజ కన్యకలను వివాహము చేసుకున్నారు. చోళుల గొడుగు నీడ తూర్పు చాళుక్య రాజులను కాపాడింది. అయితే– కొప్పం యుద్ధంలో చోళుల పరాజయం రాజనీతిని చేసినది. తలక్రిందులు చేసినది. కొప్పం యుద్ధంలో చోళులకు పశ్చిమ చాళుక్య ప్రభువు ఓడించ గల్గెను.

అప్పుడు తూర్పు చాళుక్య ప్రభువు – రాజ రాజ నరేంద్రుడు పశ్చిమ చాళుక్య ప్రభువుతో సంధి చేసుకో వలసి వచ్చింది. సంధి విగ్రహ పాత్రుడైన నన్నయ కవి – తూర్పు చాళుక్యులకు పశ్చిమ చాళుక్యులకు మధ్య "సంధి" కుదిర్చినాడు. నన్నయకు సహాధ్యాయి అయిన నారాయణ భట్టు – వాణస నారాయణ భట్టు – రాజ మహేంద్ర వరంలో జగదేక మల్ల పశ్చిమ చాళుక్య చక్రవర్తి రాయబారిగా ఉన్నారు. ఆనాడు "ముగ్గురు" నారాయణ భట్టులు కనిపించుచున్నారు.

(1) జగదేక ముల్లుకకుం ప్రధాని = కుపమ తండ్రి – (ద్రాక్షారామ శిలా శాసనం)

(2) నన్నయ్య భట్టు సహాధ్యాయుడు ఆంధ్రభారత రచన సహకారి – ఆంధ్రభారతము

(3) నందంపూడి అగ్రహార గ్రహీత – నారాయణ భట్టు.

పై ముప్పురు – "నారాయణులు" ఒక్కరే

– గ్రంధకర్త

కవిత్రయము

న న్న య

నన్నయ భట్టు మహాకవి ఆంధ్రసారస్వత ప్రపంచమున వెలసిన తొలికావ్యము మహాభారతము నారంభించిన ఆదికవి. ఆది సభా పర్వములను నారణ్యపర్వమున జతుర్థాశ్వాసమునఁ గొంతవరకు నన్నయ రచించెను. మిగిలిన పదునైదు పర్వములు తిక్కన యారణ్యపర్వశేషమును ఎఱ్ఱాప్రగడ రచించిరి. కవిత్రయమని పేరొందిన నన్నయ తిక్కన ఎఱ్ఱన మహాకవు లాంధ్రవాఙ్మయ జగత్తులోఁ బ్రాతఃస్మరణీయపాదులైన సాహిత్య త్రిమూర్తులు.

నన్నయ భట్టు రాజరాజనరేంద్రుని యాస్థాన కవి. రాజ రాజనరేంద్రుడు క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దిమధ్యమున దెలుగు దేశము నేలిన చాళుక్యసమ్రాట్టు. చాళుక్యులు తొలుత "వేగి", తరువాత రాజమహేంద్రవరమును రాజధానిగ జేసికొనిజ తెలుగు నాడు నేలినారు. ఆ కాలమున 'వేగివిషయము' 'ఆంధ్రదేశము' చాళుక్యరాజ్యము నించుమించుగ నేకార్థద్యోతకములైనవి.

''మును మార్గకవిత దేశం
బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బున జన చాళుక్యరాజు మొదలుగఁ బలువుర్.''

ఇది కుమారసంభవకావ్యపీఠికలో నన్నెచోడకవి ప్రవచనము. దేశికవితను దేషభాషను బ్రోత్సహించి యాంధ్రవిషయమునఁ దెనుగును నిలుపుటకు ప్రయత్నించిన వారు చాళుక్య చక్రవర్తులు. అంతకుఁ బూర్వము తెలుగు భాష యెట్టి స్థితిలో నున్నది ? అసలు తెనుగు భాష ఎప్పుడు పుట్టినది చెప్పుట కష్టము. కాని, తెనుగునకుఁ గావ్యగౌరవవము సభామర్యాద రాజపూజ్యత తొలుత కల్పించిన మహారాజులు చాళుక్యులు. పూర్వకాలమునఁ జరిత్రలో సంస్కృతప్రాకృతములే రాజ భాషలు. దేశ భాషకు క్రమపరిణామ వికాసబద్ధములై కాలక్రమమున వికసించినవి. దేశ బాషకు దెనుగున కీ క్రమవికాసమునకు దోహదము కల్పించిన వారు చాళుక్యరాజులు.

ఆ కాలమున రాజాస్థానములందు విద్వత్పరిషత్తు లుండెడివి. కవులు రచించిన కావ్యముల విద్వత్పరిషత్తు లామోదించుట, ముద్రణ సౌకర్యము లేని కాలమున రాజు గ్రంథములకు ప్రతులు వ్రాయించుట ఆ నాటి సారస్వత.సంప్రదాయము. తమిళ దేశమున నా కాలమున సంఘములో గల వని శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు ప్రవచించియున్నారు. నన్నయ మహాభారత పీఠికలో,

"పరమ వివేక సౌరభ విభాసిత సద్గుణ పుంజ వారిజో
త్కర రుచిరంబులై సకల గమ్య సుతీర్థములై మహామనో
హర సుచరిత్ర పావన వయఃపరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ముదం బొనరం గొనియాడి వేడుకన్."

అని సారస్వతపారిషదుల నభినందించినాడు. ప్రకరణాంతరమున మహాభారతప్రశక్తి నుగ్గడించుచు "ఉత్తమ సభాసేవ్యంబ"ని వర్ణించినాడు. ఆస్థాన విద్వత్పరిషత్ప్రముఖమున నన్నయ మహాకవి రాజరాజనరేంద్రునకు మహాభారతము నుపపాదించియుండును.

చాళుక్యరాజుల సారస్వతకృషి రాజరాజనరేంద్రుని కాలమునఁ బరాకాష్ఠ చెందినది. నన్నయ భట్ట మహాకవి తెలుగున తొలికావ్యమైన మహాభారతమును రచించుట కుపక్రమించెను. మహాభారతము తొలి కావ్యము, నన్నయ ఆదికవి యనినఁ దెనుగున నంతకుఁ బూర్వము. కవితా సృష్టి గాని కవులు గాని లే రని చెప్పుట గాదు. నన్నయకుఁ బూర్వమే చాళుక్యరాజశిలాశాసనములందుఁ దెలుగు పద్యములు కన్పించుచున్నవి. యుద్ధమల్లుని బెజవాడ శాసనము పంద్రంగుని యద్దంకిశాసనము ఉదాహరణములు. నన్నయ తరువాతి యుగమునఁ బాల్కురికి సోమన పదములు పాడుచు దీర్ఘయాత్రలు సలుపు సామాన్యజనులను వర్ణించెను. దీనిని బట్టి నన్నయకు బూర్వమే తెలుగున సారస్వత రచన లున్న వని తెలుగు కవులు కల రని చెప్పక తప్పదు. కాని, యా కవుల పేరులు గాని రచనలు గాని నేడు మన కుపలభ్యములు గావు. ఆ నాటి రచనలు నిబద్ధకావ్యములో

కావో నిష్కర్షగఁ జెప్ప లేము. నన్నయ తన్నుఁ గూర్చి, ''విపులశబ్దశాసనుడ'' ని చెప్పుకొనెను. ఆ కాలమున గల శబ్దజాలమును శాసించి విద్వదారాధ్యమైన సారస్వతసృష్టి సలిపిన తొలికవి నన్నయ.

రాజరాజనరేంద్రుడు ''నిజమహీప్రజఁ బ్రీతిఁ బెంచుచు బరమండలంబుల ధరణిపతుల నదిమి కప్పంబుల ముదముతోఁ గొనుచును బలిమి నీయని భూమివలయపతుల నుక్కడిగించుచుఁ దిక్కుల దన యాజ్ఞ వెలిగించిన'' చక్రవర్తి. 'వేఁగిదేశంబునకు నాయకరత్నమైన రాజమహేంద్రవరమున రమ్యభర్మహర్మ్యతలంబున మంత్రి పురోహిత సేనాపతి దండనాయక దౌవారిక మహా ప్రధానానంతసామంత విలాసినీపరివృతుండై, యపార శబ్దశాస్త్ర పారగులైన వైయాకరణులును భారత రామాయణాద్యనేక పురాణేతిహాసచాతురీధురీణులైన పౌరాణికులును మృదుమధురరస భావభాసురనవార్థవచనరచనావిశారదులైన మహాకవులును వివిధ తర్క విగాహి తసమస్తశాస్త్రసాగరపారగరీయఃప్రతిభులైన తార్కికులును సైణికగాయకులును నాదిగాఁ గలుగు విద్వజ్జనంబులు పరివేష్టించి కొలువ విద్యావిలాసగోష్ఠి నొకనాడు.

తన కులబ్రాహ్మణు ననురక్తు నవిరళ
జపహోమ తత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది
నానా పురాణ విజ్ఞాన నిరతుడైన

నన్నపార్యు' మహాభారతము దెనుగున వినిర్మింపు మని యభ్యర్థించెను.

కృష్ణద్వైపాయనముని సంస్కృతమున మహాభారతమును రచించెను. "బహుభాషల బహువిధముల బహుజనములవలన" భారతవృత్తము బహుభంగుల వినిపించుచున్న దని రాజ రాజ నరేంద్రుడు నన్నయతో బలుకును.

నన్నయకు బూర్వమే కన్నడమున, మలయాళమున, తమిళమున భారతములు గలవు. పంపకవి రచించిన కన్నడ మహాభారతము 'అరికేసరి' యను మహారాజున కంకితము. కవి, అరికేసరికి నర్జునునకు నభేదము గల్పించెను. ద్రౌపది యర్జునునకు మాత్రమే భార్య. మూలవిశిష్టములైన స్వతంత్రకల్పనలతో గన్నడభారతము యథామాతృకము గాదు. ప్రత్యేకముగ మహాభారతము తెలుగువారి సొత్తు. తెలుగు భారతమునకు వచ్చిన కీర్తి తక్కిన దేశభాషలలోని భారతములకు రాలేదు. తమిళ కంబరామాయణము, హిందీ తులసీదాసరామాయణము ప్రఖ్యాతములు. మళయాళమున గూడ 'ఎజొత్తచ్చన్' కవి వ్రాసిన రామాయణమున కున్న కీర్తి యతని భారతమునకు లేదు. తెనుగు భారతమే వ్యాసభారతమున కత్యంతసన్నిహితమై తుల్య ప్రాధాన్యము సంపాదించుకొన్నది. దీనికి కారణము భారత తత్త్వము నవగతము చేసికొనిన మహానుభావులగు నన్నయ తిక్కన మహాకవుల చేతిలో దెలుగు భారతము పడుటయే. ఈ విషయమునఁ దెలుగు వారు మిక్కిలి యదృష్టవంతులు. రాజరాజనరేంద్రుడు నన్నయ మహాకవిని "కృష్ణద్వైపాయన మునివృషభాభిహిత మహాభారతబద్ధనిరూపితార్థ

మేర్పడ దెనుగున విరచింపు మధికధీయుక్తి మెయిన్'' అని వ్యాసప్రోక్త మహాభారతమునకుఁ దెనుగు రూపము కోరుకొనును.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని
 యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రం బని
 కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వలక్షసంగ్రహ మని
 యైతిహాసికు లితిహాస మనియు
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
 యం బని మహి గొనియాడుచుండ
వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండ జేసె భారతమ్ము''

అని నన్నయ వ్యాసమహాభారతమును బ్రశంసించెను. ఆ ప్రశంస తెలుగు భారతమునకు గూడ యథాక్షరముగ నన్వయించును.

మహాభారతము పంచమవేదము. విజ్ఞానసర్వస్వము. తెలుగు వారిని ధర్మవీరులుగు లోకోత్తరపురుషులుగ దిద్ది మహా సామ్రాజ్యమును నెలకొల్పుట రాజరాజనరేంద్రుని యభిమతము. మహాకవి నన్నయ భారతసంహితను వ్రాసి యీ ప్రబోధమునే తెలుగువారి కందిచ్చెను. తెలుగు దేశమున విజ్ఞాన వికాసమునకు దోహదము కల్పించుట యేలికయైన రాజరాజనరేంద్రుని యుత్తమ

కర్తవ్యము. భాధ్యత. విద్యాప్రభోద మనిన నక్షరాస్యత యని పూర్వికుల యభిప్రాయమము గాదు. ఆనాడు విశ్వవిజ్ఞానకోశమ్మైన మహాభారతమును దెలుగున నిర్మించుటకంటె విద్యాప్రబోధ మేమున్నది ? అందుచే విశ్వశ్రేయమును గాక్షించి నన్నయభట్టు, "తెనుంగునన్ మహాభారతసంహితారచనబంధురు డయ్యె"ను.

ఆధ్యాత్మిక ప్రభోదమునకుఁ దత్త్వవిద్యోపదేశమునుకు మహా భారతము మనను ముందు పేర్కొన వలసిన గ్రంథము. ఉపనిషత్సారముగను బ్రహ్మవిద్యోపదేశముగను బేరొందిన శ్రీమద్ భగవద్గీత మహాభారతములోనిదే. ఏనాడో కురుక్షేత్రమునఁ బరమపురుషుడు పూరించిన పాంచజన్యశంఖారావము గీతానాదముగ దరంగితమ్మై నేటికిని భారతీయుల సహృదయములలోఁ బ్రతిధ్వనించుచున్నది. జీవితసమరమున నరుడు విజయుడై కర్మవీరు డగుటకు నింతకంటె నమృతసందేశ మేమున్నది ? హృ దయదౌర్బల్యము, కర్తవ్యదర్శనము నణంచినప్పుడు సర్వధర్మములను బరిత్యజించి గీతాపురుషుని శరణన్నచో విజయద్వారము వివృతము గాదా ? భారత పుత్రులు నిర్వీర్యులైపోకుండ సదా కర్మవీరులుగ ధర్మశీలురుగ నీ గీతనాదమే పురికొల్ప గలదు. గీతామృతము భారతీయ సంస్కృతి కజరామరమ్మైన నిత్య యౌవనము నొసంగు చున్నది. జీవిత మొక కర్మక్షేత్రము. ఆత్మకు మరణము లేదు. ఆత్మను నీరు తడుప లేదు. నిప్పు కాల్ప లేదు. ఆత్మ సనాతనము, అనంతము ! ద్వంద్వబద్ధమ్మైన ప్రాణికోటి కెంతటి యశాసందేశము !!!

మహాభారతము బహుపురాణ సముచ్చయము. కురువంశముయొక్క యితిహాసము మహాపురాణమైనది. పురాణము చరిత్రకంటె భిన్నము కావచ్చును. చారిత్రకసత్యము సర్వదా సాపేక్షికమైన సత్యము. ఏదో యొకచోట - నొక స్థలమున నొక కాలములో మాత్రమే యధార్థము. కాని పౌరాణిక సత్యము దేశకాలపాత్రాతీతమై నిరవధికమై నిర్వికల్పమైన సత్యము. నిత్యనూతనము. సదా సనాతనము. అమృతమథనము వృత్రాసుర సంహారము నిట్టి సత్యములే. ఉపాఖ్యానములు అవాంతర గాథలు, గీతలు, మానవజీవితశిల్పములోని యనేక చిత్రములను సంతర్గర్భితముగ నర్థవాదరూపమునఁ బ్రదర్శించుటకొఱకే కల్పింప బడినవి. ఇవి వ్యావహారిక సత్యములు కానంత మాత్రమున యధార్థములు కాక పోవు. భారతములోని నీతులు విశ్వజనీనములు, భూలోకమున కవతరించిన మానవునకు స్వర్గారోహణమునకు దారి చూపుచున్న మహాభారతము సార్వకాలిక మానవచరిత్ర. ఈ పరమ సత్యమును సంపూర్ణముగ సాక్షాత్కరింపజేసికొనిన ఋషి కల్పుడు నన్నయ మహాకవి యాంధ్రమహాభారతము నారంభించిన ఆదికవి.

నన్నయభట్టు మహాకవికి, మహాభారతమున నతని సహాధ్యాయి నారాయణభట్టు తోడు వడెను.

పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా
రాయణు నట్లు వాణస ధరామర వంశ విభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుడున్ దన కిష్టుడున్ సహా
ధ్యాయుడునైన వా డభిమతస్థితి దోడయి నిర్వహింపగన్

నారాయణభట్టు కూతురు శాసనము దక్షారామమున గలదు. రాజరాజనరేంద్రుడు నారాయణభట్టునకు "నందంపూడి" యగ్రహారమును దాన మొసంగెను. ఈ శాసన రచయిత నన్నయ. లేఖకుడు గండాచార్యుడు. అందు నారాయణభట్టును గూర్చి కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్రబాషలయందు కవిరాజశేఖరు డని కవీభవజ్రాంకుశ మనియు, సరస్వతీకర్ణావతంస మనియు నష్టాదశావధారణచక్రవర్తి యనియు, బ్రశంస గలదు. నందంపూడి నేటి కోనసీమలో నమలాపురమును సమీపమున నున్న చిన్న గ్రామము.

నన్నయ భట్టునకు నారాయణభట్టు భారతాంధ్రీకరణమున జేసిన సాహాయ్య స్వరూప నిరూపణమున వాఙ్మయరంగమున బండితులలో నేకవాక్యత కుదరలేదు. కొందఱు నన్నయ నారాయణభట్టులు జంటకవులై భారతమును వ్రాసిరని ద్వైకర్తృకత్వము నూహించుచున్నారు. మఱికొందఱు లాంఛనప్రాయముగ సహాధ్యాయుడైన మిత్రునకుఁ బ్రేమతో నన్నయ సమర్పించిన కవితాభివాదముగఁ బై పద్యమును స్వీకరించుచున్నారు. విప్రతిపన్నములైన రెండు వాదములును సత్యదూరములే. నిత్యసత్యవచనుడు నవిరళ జపహోమతత్పరుడు నైన నన్నయమహాకవి సుస్పష్టముగ ద్వైకర్తృకత్వము సత్యమైనచో జాటియుండెడివాడు. నన్నయ ప్రయోగించిన ఉపమానము "పాయక పాకశాసనానికి భారతఘోరణంబునందు నారాయణు నట్లు" – మిక్కిలి యర్థవంతము. మహాభారత యుద్ధమున శ్రీకృష్ణుడు వీరుడయ్యును జక్రమున జేత బట్ట నట్లు శపథ మొనరించెను. కాని సారథ్యము

వహించెను. అట్లే నారాయణభట్టు కవి యయ్యు భారతరచనమున ఘంటమును బట్ట లే దని చెప్పక తప్పదు.

మహాభారతము నాంధ్రీకరించుటలో ననేక సమస్య లిమిడియున్నవి. మహాభారతము పంచమవేదము. సంహితను దేశ భాషలలోని కనువదించుటకు నాడు పండితప్రాతికూల్యము నెదుర్కొనవలసి యుండెనని కొందఱి యూహ. అప్పటికే యితర "దేశభాషల"లో భారతము లున్నవి. రాజరాజనరేంద్రుడు భారతమున దెనిగింప బ్రార్థించెను. ఇక బండిత ప్రాతికూల్య మంతగ బరిగణింపదగినది గాదు.

మహాభారతాంధ్రీకరణ మనిన కేవలము కవిత చెప్పుట కాదు. తెనుగు భాష కది శైశవము. ఆ విషయ మా నాటి వారు గూడ గ్రహించినదే. తెనుగున మహాభారతమును వ్రాయుటలో మూలము నెంత వర కనుసరింప వలెను ? సంస్కృత ఛందస్సులకు దేశీయమైన ఛందస్సుల కెంతవరకు, నేవిధముగ బొత్తు సంధింపవలెను ? మూలములోని యుపాఖ్యానముల నెట్లనువదింపవలెను. మూలములో విడువ దగిన వెవ్వి ? విస్తరింప దగిన వెవ్వి ? సంక్షేపింప దగిన వెవ్వి? సంస్కృతభారతమున లేకపోయినను దేశములో వ్యాప్తిలో నున్న భారతకథావిషయములు పరిగ్రాహ్యములా ? పరిత్యాజ్యములా? అసలు సంస్కృత భారతము భారతదేశమున భిన్నభిన్న పాఠములతో బ్రచారమున నున్నది? ఏ ప్రతి ననుసరింపవలెను? ఏ పాఠములు పాఠాంతరములు స్వీకార్యములు ? ఇతర దేశభాషలలో నింతకు ముందు భారతమును రచించిన కవు లీ సమస్యల నెట్లు పరిష్కరించిరి

? ఈ విషయముల ననుశీలించి నిర్ణయించుటకు దన కిప్పుడు సహోధ్యాయుడు నష్టాదశభాషావధారణచక్రవర్తి యగు నారాయణభట్టు తోడయి నిర్వహించుట యవశ్యవాంఛనీయము. కావున నాంధ్ర మహాభారతమునఁ గవిత చెప్పినది నన్నయ. కావ్యశిల్పమునందు సాహాయ్య మొనర్చినది నారాయణభట్టని నిర్ణయింప వచ్చును.

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకవితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచనబంధురుడయ్యె జగద్ధితంబుగన్."

ఇందు 'ప్రసన్నకథాకవితార్థయుక్తి,' 'అక్షరరమ్యత' 'భారతసంహిత' 'జగద్ధితము' అను ప్రయోగములు కవిహృదయమును స్వయంవ్యక్తము చేయు నర్థవంతమైన పదగుంఫనములు.

ప్రసన్నకథాకవితార్థయుక్తి నన్నయ నుత్తమకథకునిగఁ జేసినది. దానిని కవీంద్రులు కథాకథనశిల్పజ్ఞులు మెచ్చుకోగలరు. అక్షరరమ్యతను నితరులుగూడ నాదరించెదరు. ఈ "ఇతరు" లెవ్వరు? "అక్షరరమ్యత" యన నేమి ?

నన్నయ్యకు నర్థముమీద, నంతకంటె శబ్దముమీద, నిష్ఠ గలదు. నన్నయ నాదబ్రహ్మోపాసకుడు, రమణీయార్థ ప్రతిపాదకములైన శబ్దములు, వాని కూర్పు, గురు లఘువుల యానుపూర్వీమాత్రమే గాక, 'ఏతదుచ్చారణ'ను గూడ నన్నయ యుపాసించెను. దీనినే "అక్షరరమ్యత" యని పలికెను. అక్షర రమ్యత

సర్వజనైకవేద్యము. శబ్దార్థములకు నతీతము. కవీంద్రులతోపాటితరులుగూడ నాదరింపగలరు. ఇతరు లనిన 'బామరులు మొదలగు వారు. అందు దెనుగు రానివారినిగూడ' జేర్చ వచ్చును.

అక్షరసమ్మేళనమువలన జనించు నాదముపై నన్నయకు గల నిష్ఠ కచదేవయాని ఘట్టములో నా మహాకవి కవితాహృదయము చీల్చికొని స్వయంవ్యక్త మగుచున్నది. ఆ సందర్భమున

విగతజీవుడై పడి వున్న వేదమూర్తి
యతని చేత సంజీవితుడై పెలింగె;
దనుజమంత్రి యుచ్చారణదక్షుచేత
నభిహితం బగు శబ్దంబు నట్ల పోలె.

మృతుడైన వేదమూర్తి శుక్రు డుచ్చారణదక్షుచే నభిహితమైన శబ్ధము వలె దిరిగి సంజీవితుడైనాడు. ఈ యర్థమునే భంగ్యంతరమునఁ బ్రతిపాదించిన నుచ్చారణదక్షుడు కాని వాడుచ్చరించిన శబ్దము మృతప్రాయము. ఉచ్చారణదక్షుడు వేరు. సంగీతవిద్వాంసుడు వేరు. సంస్కృత మహాభారతములో లేని యీ యుపమానము నన్నయ కవి హృదయమునుండియే వెల్లి విరిసినది. ఉచ్చాదరణదక్షుడు కానివాడు నన్నయ మహాభారతమును బఠించుటకు ననధికారి. తెనుగున నన్నయ మహాభారత ''సంహిత''ను రచించెను. సంహిత యని నొక్కి చెప్పుటలో వేదములకు గల స్వరప్రాధాన్యము గుర్తింపదగినది. ఎంతటి సంగీతసాహిత్యపండితుడైనను, 'ఉచ్చాదరణదక్షత' యను నీ

మృతశబ్దసంజీవనీవిద్య నెఱుగనివాడు నన్నయ భారతము పఠించిన సంపూర్ణరసాస్వాదన సలుపలేడు. నన్నయ సారస్వత జగత్తులో మృతసంజీవనీవిద్యామహితుడగు శబ్దశాసనుడు.

"పద్యకవిత నర్థగాంభీర్యము కొఱవడకుండ గద్యమున వినిర్మించుట యసాధ్యము" అను సారస్వతవిమర్శకు నన్నయ కవిత యంతయు నుదాహరణప్రాయమే. కవి విప్పారిన దివ్యచక్షువుతో నతిలోకసౌందర్య రసానుభూతిని దర్శించి ప్రదర్శించును. అందుచే వేదఋషులు తొలివేగు బోకలలో మంత్రద్రష్టలైనారు. అర్షకవులు ద్రష్టలు. భారతము "సంహిత" నన్నయ కావ్యర్షి, కవి యనిర్వచనీయమైన సౌందర్యమును నతిలోకమైన యనుభూతిని వాగ్రూపమున బ్రతిపాదించును. వాగగోచరమైన కవితానుభూతిని భౌతికనేత్రముల కందని సౌందర్యములను వాక్కులో నుపాదించుటయే స్వవచోవ్యాఘాతమైన ప్రతిపాదన కావచ్చునుగాని కవితాప్రపంచమున స్వయంవ్యక్తమైన విచిత్ర విరోధాభాసము. నన్నయ మహాకవి వాఙ్మయములోఁ బదములు చెప్పలేని భావములను గవితారూపమున నిర్వచించుట అక్షర రమ్యత మూలమున సాధించెను. శబ్దమునకుఁ గవిభావమును వ్యక్తీకరించు శక్తి లేకపోవుటచేతనే కవిత ఛందోరూపమున నభివ్యక్త మగుచున్నది. నన్నయ మహాకవి చంధస్సును, ఛందస్సుకంటె నతీతమైన నాదమును దన పద్యశిల్పమున నుపయోగించి శబ్దములు చెప్పలేని యనుభవైకవేద్యమైన భావములను మనోజ్ఞముగ గానము సల్పియున్నాడు. గంగ, మానవ కన్యకయై ప్రతీపనృపాలుని చేరిన సన్నివేశ ముదాహరణగ స్వీకరింప వచ్చును –

గంగ నిజాంగదీప్తు లెసగం జనుదెంచి లతాంగి సంగతో
త్తుంగ పయోధర ద్వితయ తోయరుహానన చారునేత్ర ది
వ్యాంగనయై ప్రతీపవసుధాధిపు శాల విశాల దక్షిణో
త్సంగమునందు మన్మథవశంబున నుండెఁ గరంబు లీలతోన్.

ఆంధ్రకవితాగానమునకు మృదంగ వ్యాపారమును నిర్వహించునట్లు ఛందస్సు - యతిప్రాసలనుఁ బ్రయోగించు నొరవడి తరువాతి పురుషాంతరములకు నన్నయమహాకవి ప్రసాదించెను. బిందుపూర్వక కగారప్రాసము జలతరంగిణి వలె మ్రోగుచున్న యీ పద్యమున యతిప్రాసలు, పదములు చెప్పలేని యద్భుతభావము నెట్లు సుగవ్య మొనరించుచున్నదో రసజ్ఞ హృదయములకు స్వయంవిదితము. సంస్కృతకవిత్వమున నిట్టి పద్యరచనాశిల్పము మృగ్యము. నన్నయ మహాకవి యొరవడిగా దిద్దిన పద్యశిల్పమే తెలుగు మహాభారతమునందు విశిష్టమై నందు, దేశభాషలందు దెనుగును లెస్సగ నొనరించినది.

శ్రీకృష్ణుడు ధర్మరాజునకుఁ బదునాలుగు వేల మత్తేభములను రాజసూయయాగమున బహుమానముగ నొసంగి నట్లు దుర్యోధనుడు తండ్రికి నివేదించును.

మందిత సూర్యరశ్మి రుచిమన్మణిహార చయంబుతోఁ గట
స్యంది సుగంధి దానజల సంపద నొప్పెడు వాని దేవకీ
నందనుఁ డిచ్చెఁ బ్రీతిఁ బదు నాలుగు వేల గజంబులన్ జనా
నందనకీర్తియైన యమనాథతనూజున కిష్టమిత్రుడై.

పదునాలుగు వేల మత్తేభములు కను చూపు మేర కంద కుండc గదలి వచ్చుచున్నవి. ఆ మత్తేభములు అలంకృతములు. హారములలో ననేకమణులలో 'బ్రతిఫలించు సూర్యరశ్మి, సూర్య కాంతిని మందితము చేయుచున్నది. 'మందితసూర్యరశ్మిరుచిమన్మణిహారచయంబుతో' – 'కటస్యందిసుగంధిదానజలసంపద నొప్పెడు వాని' – ఈ దీర్ఘమాసములు నేత దుచ్చారణవలన బుట్టు నాదము, బిందుపూర్వక దకారప్రాసప్రయోగ పౌనఃపున్యము మత్తేభయూథముల గంభీరమందగమనమును స్ఫురింపజేయును. ఉచ్చారణదక్షుడు' నన్నయ 'మహాకవి రచించిన యీ పద్యమునుc బఠించినచో తెనుగు రాని వాడు కూడ కదలి వచ్చెడి యేనుగుల గంభీరయానమున మ్రోగుచున్న చిరుగంటల మృదులయాన్విత నాదమునుగూడ గుర్తింప గలడు. కవీంద్రులు ప్రసన్నకథాకవితార్థయుక్తి నాదరింప గలరు. మహాభారతము వంటి మహా గాథలో నాద్యంతముల నందుకొని యంతర్వాహినిగc బ్రవహించు వస్త్వైక్యము, కథాశిల్పము, ననురూపమ్మైన ఛందస్సు, వ్యుత్పత్తి-ప్రతిభ, యేవంగుణవిశేషణవిశిష్టత యంతయుc బ్రసన్న కథాకవితార్థయుక్తి. అంత మాత్రమే గాక, శబ్దార్థములకు ఛందస్సునకు నతీతమ్మైన నాదముచే ననుభవైకవేద్యమ్మైన భావములను వ్యక్తీకరించు కవితాశిల్పమును సృష్టించిన కవులను విశ్వసాహిత్య ప్రపంచమున వ్రేళ్ళపై లెక్కింప వచ్చును. అట్టి మహాకవులలో నన్నయ మేరుపూస. ఆంధ్రభారతము తెలుగుల సారస్వత వేదము.

దుశ్శాసనుడు ద్రౌపది వలువ లొలిచినప్పుడు భీముని ప్రతిజ్ఞాపద్యము.

కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుడై ద్రౌపది నిట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ ని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదించు నుగ్రాకృతిన్.

ఈ పద్యమున ''కురువృద్ధల్-గురువృద్ధబాంధవులు -మదోద్ధురుడై'' - ఇత్యాదిసమాసములు ద్విరుక్త ధకార ప్రయోగపౌనః పున్యము భీముని రౌద్రాకృతిని పఠితల మనోనేత్రమునకు సాక్షాత్కరింపఁ జేయుటయే గాక గదాదండ ప్రహరణ నినాదము వినిపించు చున్నట్లున్నది. తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ నిర్ఝర ముర్వీపతి'' - సమానము నుచ్చరించుచుండ, భీముడు పండ్లు పటపటఁ గొఱికి నట్లు ధ్వనించును. ఈ పద్యములో నే పదమునకు నిఘంటువు లిట్టి యర్థమును జెప్ప కున్నను, నుచ్చారణవలన జనించు నాదమువలన నిది యంతయు స్వయంవ్యక్త మగును.

నన్నయ నోటఁ దెలుగు పదములు సంస్కృతసమాసములు నిష్టార్థపదవ్యవచ్ఛిన్నములై యధోచితముగ వికసించును. నన్నయ నానారుచిరార్థసూక్తినిధి. ఈ మహాకవి కావ్యమున ముక్తాహారకర్పూరసాంద్రపరాగప్రసరంబులు శరజ్జ్యోత్స్నాధవళ కాంతిరేఖాపంక్తులు వికసన్నవ కైరవ గంధబంధురోదార సమీర సౌరభములు, నవ్యనవనీత సమానరుచిర రచనావిన్యాసములు, నుత్తుంగతరంగఘట్టిత చలద్వేలావనైలావలీవలీలుంగ లవంగసంగత

లతాలాస్యంబులు, హరినీల వినీల విగ్రహోరాల వైద్యుత రుచులు, నాంధ్రవాగ్విషయంబును దేజోమయం బొనర్చినవి.

వసంతోదయ మ్పైనది. నన్నయ లయగ్రాహివృత్తములలో నామని శోభ వర్ణించెను.

'కమ్మని లతాంతములకు మ్మొనసి వచ్చు
మధుపమ్ముల సంగీతనినదమ్ము లెసగెం జూ
తమ్ముల లసత్కిసలయమ్ముల
సుగంధవకులమ్ములను నానుచు ముదమ్మొనర వాచా
మధురమ్మగుచు వీచె ననిశమ్ము సుమనోభా
రమ్ముల నశోకనికరమ్ములను
జంపక చయమ్ములను గింశుక వనమ్ములును నొప్పెన్.

చందన తమాల తరులందు
నగరుద్రుమములందు గదళీవనములందు లవలీమా
కంద తరు షండములయందు
ననిమీలదరవింద సరసీవనములందు వనరాజీ
కందళిత పుష్పమకరందరసముం దగులుచుం
దనువు సౌరభము నొంది జనచిత్తా
నందముగఁ బ్రోషితుల డెందము లలందురగ
మందమలయానిల మమందగతి వీచెన్.

అట్టి 'సర్వభూత సమ్మోహనం బయిన వసంతసమయంబున మాద్రీదేవినిగూర్చి నన్నయ చెప్పిన పద్యము.

చారు సువర్ణహాసి నవచంపక భూషయు సిందువార ము
క్తా రమణీయయున్ వకుళదామ వతంసయునై యపూర్వ శృం
గార విలాసలీల యెసగం దన ముందట నున్న మాద్రి నం
భోరుహనేత్ర జూచి కురుపుంగవు డంగజరాగమత్తుడై.

నన్నయ సంస్కృతసమాసములలో ననిర్వచనీయమైన వసంతశోభ తొలుకాడు చుండును.

కృష్ణద్వైపాయనుడు, పుత్రశోకార్త యైన తల్లి సత్యవతితో

మతి దలపగ సంసారం
బతిచంచల మెండమావు లట్టుల సంపత్
ప్రతతు లతిక్షణికంబులు
గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్.

మూలమున వ్యాసుడు 'పృథివీ గతయౌవనా' అనిన నన్నయభట్టు 'గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్'-అని స్వతంత్రించి పలికెను. ఇట్టి విశ్వజనీనమైన యుదాత్తసత్యమును వక్కాణించుటకు గవి మార్కండేయునివంటి చిరంజీవియై కల్పకల్పాంతరములు చూచిన వాడు కావలె. లేదా త్రికాలాబాధితమైన దివ్యదర్శనము గలవాడైన గావలె. వ్యాసుడు సమస్తపృథివినిగూర్చి యాకాశముకంటె నున్నతమైన భావమును పచింప, నన్నయ మహాకవి యనంతకాలము నధిగమించు సుభాషితమును ప్రవచించెను. నన్నయ మహాభారతము సంస్కృత మూలమున కంధప్రాయమైన యనువాదము గాదు. యథామాతృకమైన యథోచితానుసరణము.

ఈ యొరవడియే తిక్కన మహాకవి పాటించుటచే, నాంధ్రభారతము స్వతంత్రకావ్యమైనది.

నన్నయభట్టు మహాకవికి మాతృభూమియైన తెలుగు దేశముపైఁ గల యభిమానమున కర్జునుని తీర్థయాత్రాఘట్టము నిదర్శనము. అర్జునుడు తీర్థయాత్రల సేవించుచు దెలుగు దేశము చేరెను.

దక్షిణగంగ నాఁ దద్దయు నొప్పిన
 గోదావరియు జగదాది యైన
భీమేశ్వరంబును బెడ గగు చున్న శ్రీ
 పర్వతంబును-జూచి యుర్విలోన
ననఘమై శిష్టాగ్రహారభూయిష్టమై
 ధరణీసురోత్తమాధ్వరవిధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేగీదేశ
 విభవంబు జూచుచు విభుడు దక్షి
ణాంబురాశితీరంబున కరిగి దురిత
హారియైన కావేరీ మహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ
తార్థదానంబు జేసి కృతార్థు డగుచు.

శిష్టాగ్రహారభూయిష్టమైన వేగీదేశము నర్జును కాలమున గలదో లేదో గాని నన్నయ సమకాలీనమైన తన తెలుగు దేశమునే వర్ణించె ననుట నిర్వివాదము.

రైవతకాద్రికి యదువీరులు మహోత్సవార్థము పౌరజన ప్రధానసమేతముగా నేగిరి. ఈ యుత్సవము నన్నయ సమకాలీన సంఘ వృత్తమే.

పొలుపుగఁ బూసి కట్టి తొడి భూరివిభూతి ప్రకాశితంబుగా
గలయగ దత్పురీజనులు కాంస్య మృదంగ ముకుంద వేణు కా
హళ పటహ ధ్వనుల్ చెలగ నాటలు బాటలు నొప్ప నెల్ల వా
రలు జనిచేసి రర్చనలు రైవతకాద్రికి నుత్సవంబుతోన్.

అక్కడ "క్రొమ్ముడులందున పుష్పముల్ పయిం దొరగ నిదాఘ బిందు వితతుల్ చెదరన్ మదిరామదంబునం బరవశలయ్యి నింపెసగ బాడుచు దాళము గూడ మొట్టుచుం దరుణియ లొప్పనాడుట" జనములు మెచ్చుట; నన్నయ మహాకవి చూచిన తెలుగు తిరునాళ్ళ వర్ణనయే యతని భారతమున కెక్కినది. పౌరవరాజ్యసంవృద్ధిని వర్ణించు నప్పుడు నన్నయ మనస్సులో సమకాలీనచాళుక్యరాజ్యమే ప్రాతిపదికగా నిల్చెనని యూహింపవచ్చును.

అమలాచార పవిత్ర భూసురవరేణ్యాగార పుణ్యప్రదే
శములం దధ్యయనారవంబు విధివత్స్వాహా స్వధా స్వస్తి శ
బ్దములున్ మంగళ తూర్య ఘోషములు నుద్యత్కౌతుకాశీర్నినా
దములుఁ రమ్యతరంబు లయ్యె ధరణిం దద్రాజ్యసమ్పృద్ధితో.

ఆంధ్రసారస్వతమున నన్నయ కవిత తొలివేగుబోక. నన్నయ మహాకవి పదగుంఫనములలో నేటికి నా ప్రత్యూష తుషారకోమలత తొలుకాడు చుండును.

నన్నయ ప్రసన్న కథాకవితార్థయుక్తికి శకుంతలా గాథ మఱియొక నిదర్శనము. నన్నయ కాళిదాసమహాకవి కర్వాచీనుడు. సాహిత్యరంగమున నభిజ్ఞానశాకుంతల మప్పటికే స్థిరకీర్తి నార్జించియున్నది. శకుంతలాగాథ లోకములో యశోవ్యాప్తి నందుటకు గారణము వ్యాసభారతము గాదు. కాళిదాస మహాకవి యభిజ్ఞానశాకుంతలమే. నాటకీయమ్మైన కాళిదాస శాకుంతలాగాథ వ్యాసభారతమునకు భిన్నము. మనోహరమ్మైన కాళిదాస కల్పనము ప్రపంచము నంతటి నాకర్షించినది. పినవీరభద్రుడు శృంగారశాకుంతలమున గాళిదాస కథను గొంతవరకు స్వీకరించెను. కాని, నన్నయ ప్రసన్నకథాకవితార్థయుక్తితో, నాటకీయమ్మైన కాళిదాసవృత్తమును స్వీకరింపక వ్యాసప్రోక్తకథను మాత్రమే రచించెను. నన్నయ కాళిదాసశాకుంతలమును జదువలేదనుట సాహసము. కాని కాళిదాసు నన్నయను స్వీయపథకము నుండి తప్పింప లేకపోయెను.

మదనాతురుం డయిన దుష్యంతుడు శకుంతల యను రాగం బుపలక్షించి,

ఈ పల్కలాజినములకు,
నీ వన్యఫలాశనముల కీ విటప కుటీ
రావాసములకు నుచితమె
నీ విలసిత రూప కాంతి నిర్మల గుణముల్
ఈ మునిపల్లె నుండు టిది యేల ? కరం బనురాగ మొప్పగా
భామిని నాకు భార్య వయి భాసురలీల నశేషరాజ్య ల
క్ష్మీమహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనిందుతేందుపా
దామల తుంగహర్మ్యముల హారిహిరణ్మయకుట్టిమమ్ములన్.

అని యడుగును. ఆమెను గాంధర్వమున వివాహమై, రాజధానికి దరలిపోవును. శకుంతలకు భరతుడు కణ్వాశ్రమమున నుద్భవించి యుక్తవయస్కుడగును. అప్పుడు కణ్వ మహర్షి శకుంతలను భరతుని దుష్యంతుకడకు బుత్తెంచును. అచ్చట దన్ను నిరాకరించిన దుష్యంతమహారాజునకు శకుంతల నీతుల నుపదేశించును.

సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుగావ;
యెరుగు మెల్ల ధర్మంబుల కెందు బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.

అని నిత్యసత్యవచనుడైన నన్నయ శకుంతల దుష్యంతునితోఁ బలుకును. దుష్యంతుడు చలింప లేదు.

శకుంతల దుష్యంతునితో

"విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ యీ పుత్ర గా
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్రపరాగప్రసరంబు జందనము జంద్రజ్యోత్స్నయున్ బుత్రగా
త్రపరిష్వంగము నట్లు జీవులకు హృద్యంబే కడుఁ శీతమే"

అని యమహాకవముగఁ బల్కినది. ఆశ్రమవాస మందలి యమాయికపవిత్రత, యనుభవైకవేద్యమైన పుత్రప్రేమ, ప్రేమించిన పతియందలి నిష్కపటమైన లలనానిసర్గవిశ్వాసము రాశీభూతమై నన్నయ శకుంతలగా సాక్షాత్కరించును.

సత్యవతి, పుత్రుడైన పారాశర్యుని స్మరింపగలనే,

నీల గిరీంద్రశృంగమున నిర్మలమైన సువర్ణ వల్లరీ
జాలము వోని పింగళ విశాల జటాచయ మొప్పగా వచ
శ్శ్రీ లలితుండు వచ్చి నిలిచెన్ హరినీల వినీల విగ్రహో
రాళరుచుల్ వెలుంగగ బరాశరసూనుడు తల్లి ముందటన్

ఈ పద్యము పఠించిన రసజ్ఞుని మనోనేత్రము ముందు నేటికీ నట్లే పరాశరసూనుడు సాక్షాత్కరించును.

నన్నయ రచనలో నెడ నెడ ఋతువర్ణనములు మిక్కిలి మనోహరములు. పాండవులు గంధమాదనరపర్వతమును జేరినప్పుడు వర్షము కురిసెను.

కురిసెఁ బ్రచండవృష్టి ఘనఘోషము లెల్ల కెలంకులన్ భయం
కరములుఁ గాగ రాలె కరకాతతు లొప్పఁ దటిల్లతాళి వి
స్ఫురితముగాఁ బ్రపూర్ణజలపూరము లగ్గిరి కుంజభూరి ని
ర్ఝర తటినీ విశాల కటసాలచయంబు విమూలితంబుగన్

నహుషప్రశ్నల కుత్తరం బోసకి, ధర్మరాజు నిజాశ్రమమును జేరి నప్పుడు

ఖరకిరణతాపమున నురు
తరదవదాహమున శోషితములైన వనాం
తరతరుతతి కాప్యాయన
కరమై వర్షాగమంబు గడు బెడ గయ్యెన్

ఘనతరవై శతమం బొకొ
యనగ ఘనాగమతమిస్ర మవికలమ్మై క
ప్పిన జనులకు వస్తువిభా
వన మెుక్కొకయెడల గలిగె వైద్యుతరుచులన్.

దళిత నవీన కందళ కదంబ కదంబక కేతకీ రజో
మిళిత సుగంధ బంధుర సమీరణుడర్ల సఖుడూచుచుండగా
నులియుచు మెుల్లగుత్తులను నుయ్యెల లప్పుగ నెక్కి యూగెను
ల్లలదళినీకులంబు మృదులధ్వనిగీతము విస్తరించుచుఀ.

అరణ్యపర్వమందుఁ జతుర్థాశ్వాసమున నీ ఘట్టముననే నన్నయ రచన యాగిపోయినది. నన్నయ రచన యాగిపోవుటకుఁ గారణములను బండితులు పలువిధములుగా నూహించుచున్నారు. నన్నయమహాకవి నిర్యాణమే దీనికి హేతు వని కొందఱు, రాజరాజనరేంద్రుని యస్తమయమని మఱికొందఱు.

రాజరాజనరేంద్రుఁడు శకసంవత్సరములు 944, దుందుభి సంవత్సరామాంత భాద్రపద బహుళ విదియ గురువారము నాడుదయమున నుత్తరాభాద్రానక్షత్రయుక్త తులాలగ్నమందుఁ బట్టాభిషిక్తుఁ డయ్యెను. అది క్రీస్తుశకము 1022 ఆగష్టు 16 వ తేది. అంతకుముందే యతడు యువరాజుగ రాజ్యభారము వహించెను. రాజరాజు తండ్రి భూపమహేంద్ర. ముమ్మడిభీమ బిరుదాంకితుఁడైన విమలాదిత్యుఁడు. అతఁడు కుందవాదేవివలన రాజరాజనరేంద్రుని, మేడాంబవలన వీరవిజయాదిత్యుని పుత్రులుగఁ బడసెను. ఆ కాలమున దక్షిణాపథచరిత్ర ననుశీలించినచో గాని భారత

రచన మాగిపోవుటకుఁ గల కారణము లవగాహన చేసికొనుటకు వీలుండదు. విమలాదిత్యుఁడు, నతని పుత్రుఁడు రాజరాజు నతని పుత్రుఁడు కుళోత్తుంగుఁడు వరుసగా చోళరాజ పుత్రికల వివాహమాడిరి. వేంగీచోళమండలములు పరస్పర మైత్రితో నుండెను. విమలాదిత్యునకుఁ దరువాత రాజరాజునకుఁ గొంతకాలము వజ్జియప్రెగడ ప్రధాని; బేతన భట్టాస్థానకవిగఁ గన్పించుచున్నారు. విమలాదిత్యుడు రణస్థిపూండి గ్రామము సర్వకరపరిహారముగ వజ్జియప్రెగ్గడకు ధార వోసెను. ఆ దాన శాసనము బేతనభట్టుకవి వ్రాసెను. లేఖకుఁడు జొంతాచార్యుఁడు. రాజరాజనరేంద్రుని కోరుమిల్లి శాసనకవి బేతనభట్టు. లేఖకుఁడు గుండాచార్యుడు. రాజరాజు నందంపూడి శాసనకవి నన్నయభట్టు. లేఖకుఁడు గుండాచార్యుడు. అది క్రీస్తుశకము 1053 నవంబరు నాటిది. నారాయణభట్టునకు సోమగ్రహణకాలమున సర్వకర పరిహారముగ రాజరాజగ్రహారధాన మొసంగెను.

రాజరాజనరేంద్రునితోఁ జోళరాజ్యము తప్ప, నిరుగు పొరుగు రాజ్యములు శత్రుత్వము వహించియుండెను. కళింగాధిపతి మధుకామార్ణవుఁడు, కర్ణాటాధిపతి జగదేకమల్లుఁడు వేంగిపైఁ బగఁ బూనియుండిరి. రాజరాజనరేంద్రుని సోదరుఁడైన విజయాదిత్యుఁ డన్నపైఁ దిరుగుఁబాటు లేవదీసెను. కలిదిండి ప్రాంతమునఁ గర్ణాటరాజసాహాయ్యము నందిన విజయాదిత్యునకుఁ జోళరాజసైన్యసాహాయ్య మందిన రాజరాజునకు ఘోర యుద్ధము జరిగినది. బేనతభట్టు యుద్ధమును గన్నులకు గట్టినట్లు వర్ణించెను. అది సమయుద్ధము, ఇట్లనేక యుద్ధములు సమయుద్ధములుగాఁ

బరిణమించి చివరకు రాజరాజు కొల్లిపాక యుద్ధమున విజయాదిత్యుని సంపూర్ణముగ నోడింపగల్గెను.

రాజరాజు సంపూర్ణవిజయుమును సాధించిన పిమ్మట, కలిదిండిలో రాజరాజేశ్వరాలయుములను పేరున రెండు శివాయతనములను నిర్మించెను. అందు బలినైవేద్య నృత్యసంగీతమంగళఖండ స్ఫుటితనవకర్మలకొఱకును, వేదాధ్యయనశాస్త్రశ్రోతలకు నధ్యాపకులకుఁ బంచసత్రములు, నేబది యిద్దరు వేశ్యలకు, బ్రాహ్మణ వైశ్యశూద్రశతములకు వసతులను గల్పించి, కలిదిండి కడపట్టు ఆరవకూరు గ్రామములను దాన మొనర్చెను.

తరువాత కొంతకాలమువరకు దక్షిణాపథరాజ్యములు ప్రశాంతి వహించినవి. కాని, యీప్రశాంతి చాల కాలము నిలువలేదు. నాటి దక్షిణాపథచరిత్రలో మిక్కిలి ప్రాముఖ్యము వహించినది కొప్పము యుద్ధము. అంతకుముందు చోళ కర్ణాటరాజ్యము లనేక యుద్ధముల నొనరించినవి. జయలక్ష్మి యుభయ రాజ్యములమధ్య నూయెల యూపుగా వినోదించినది. కాని కొప్పము యుద్ధమున త్రైలోక్యమల్లుని సామంతుఁడు దడిగ దేవుఁడు చోళచక్రవర్తి రాజాధిరాజు శిరమును ఖండించి తన యేలికకుఁ గానుకగా నొసఁగెను. రాజాధిరాజు తమ్ముఁడు రాజేంద్ర దేవుఁడాహవరంగమును విడిచి పారిపోయెను.

రాజేంద్రదేవుఁడు రాజరాజనరేంద్రుని పట్టమహిషి యమ్మంగదేవి సోదరుఁడు. అతనికి వియ్యంకుఁడు. వేంగీ చోళ

రాజ్యములకుఁ గల సన్నిహితసంబంధమునుబట్టి కొప్పము యుద్ధము రాజరాజనరేంద్రునిపై నెట్టి పరిణామప్రభావమును వహించెనో!! రాజరాజనరేంద్రునకు కొప్పముయుద్ధము కురుక్షేత్రమును మహాభారతయుద్ధమును స్మరణకుఁ దెచ్చియుండును. ఆ కొప్పము యుద్ధకాలము క్రీస్తుశకము 1053 వ సంవత్సరము.

నన్నయభట్టు రాజరాజనరేంద్రుని ప్రతాపము నాంధ్ర మహాభారతమున నాశ్వాసాద్యంతపద్యములలో మనోజ్ఞముగ నభివర్ణించెను. ఈ మహాయుద్ధము లన్నిటిలో గడిదేరిన వీరుఁడుగాఁ బ్రసిద్ధి కెక్కిన రాజరాజనరేంద్రుఁడే యాంధ్రబారత కృతిభర్త. నన్నయమహాకవి రాజరాజనరేంద్రుని, 'ఘోరాజిముఖోపలబ్ధవిజయప్రమదాశ్రిత బాహుదండ! నిస్తేజితవైరి వీర ! దండితాహితవీర! పరగండభైరవ! వైరివేదండగండవిదారి ఘోరాతరాసిభాసిభుజార్గళ! వీరోగ్రాజివిజయా! ఇత్యాదిసంబోధనలచే మన్నించెను.

రాజరాజనరేంద్రుఁడు, నన్నయభట్టుమహాకవి భారతమును శ్రీ జయవిభాసివినమ్రరాజన్యకిరీటమణివిరాజితపాదాంభోజుఁడు. నానావనినాథకిరీటతటీవిలసద్రత్న సంఘటితపదకమలుఁడు. గంధ సింధురహయశిక్షారూఢుఁడు. ఘోరారిమదకుంభికుంభవిదారణ దారుణకృపాణదక్షిణహస్తుఁడు.

ఆంధ్రమహాభారతమును నన్నయ యీ మహాయుద్ధముల తరువాత, ననగా క్రీస్తుశకము 1053 సంవత్సరము ప్రాంతమున నారంభించెనని యూహింపవచ్చును. నారాయణభట్టునకు నందంపూడి యగ్రహారము క్రీస్తుశకము 1053 సంవత్సరముననే

లభించుటగూడ నీయూహకుఁ దోడ్పడుచున్నది. నారాయణభట్టు నన్నయకు సహాధ్యాయి. అతని కూతురు దక్షారామ శాసనకాలము శక 977, క్రీ॥శ॥ 1055 సంవత్సరమున నారాయణ భట్టు చక్రవర్తి త్రైలోక్యమల్లదేవర ప్రధానిగఁ బేర్కొనఁబడెను. అతఁడు కంచెన సోమయాజి పౌత్రుడు. అకలంక శంకనామాత్య పుత్రుడు.

త్రైలోక్యమల్లదేవునకుఁ జోళ వేంగీప్రభువులకుమధ్యఁ గల వైరము చరిత్రప్రసిద్ధము. అట్లయినచో త్రైలోక్యమల్లదేవుని ప్రధాని నారాయణభట్టున కెట్లు రాజరాజనరేంద్రుఁడు నందంపూడి యగ్రహారము దాన మొసగెనో యాతఁడెట్లు రాజనరేంద్రునాస్థానము చేరెనో చరిత్ర యింకను విప్పలేకున్న చిక్కు ముడి. నన్నయ నందంపూడి శాసనమున నారాయణభట్టు వైదుష్యము పొగడి 'జగదుపకరణుఁడని' యతని స్తుతించెను. నారాయణభట్టు వాఙ్మయధురంధరుఁడై నన్నయకు, రాజనీతిజ్ఞుడై రాజరాజునకుఁ దోడ్పడి యుండును. నన్నయకు భారతరచనమున రాజరాజునకు త్రైలోక్యమల్లదేవునకు కొప్పమున యుద్ధము జరిగిన తర్వాత నారాయణభట్టు సంధి కుదిర్చి రాజరాజనరేంద్రుని యాస్థానమునఁ జేరి యతని మన్ననల నంది యుండవచ్చునను. ఈ సంధి ప్రయత్నములో రాజరాజనరేంద్రుఁడు నన్నయభట్టు వలన నతని సహాధ్యాయిలైన నారాయణభట్టు సాహాయ్యమును సంపాదించియుండవచ్చును. కొప్పము యుద్ధము తరువాత, రాజనరేంద్రునకు సంధి తప్ప గత్యంతరము లేదు.

అప్పుడు నన్నయభట్టు మహాకవి త్రైలోక్యమల్లుని ప్రధాని నారాయణభట్టు తనసహాధ్యాయి కావున నతని మూలమున నీ సంధి

కుదిర్చియుండును. అందుచేతనే నారాయణభట్టు కూతురు కుసుమ తండ్రిని ప్రత్యక్షముగ దక్షారామమున 'త్రైలోక్యమల్లదేవర' ప్రధానిగఁ బేర్కొనఁ గలిగెను. నన్నయ, మహాకవి మాత్రమే గాడు. కావుననే నన్నయ, భారత పీఠికలోఁ దన్నుఁగూర్చి

"తన కుల బ్రాహ్మణు .... 'పాత్రు'..... 'లోకజ్ఞు'..." అని చెప్పుకొనెను.

'పాత్రు' శబ్దప్రయోగమున కొకవిశేషార్థ మున్నది. ఆ కాలమున రాజాస్థానముల సంధివిగ్రహపాత్రు లనెడి యుద్యోగులుండెడివారు. వీరు నేటి రాయబారులవంటివారు. నన్నయ రాయబారియై త్రైలోక్యమల్లదేవర యాస్థానమున కరిగి యచ్చటఁ దన సహాధ్యాయుఁడు నారాయణభట్టే యొక ప్రధాని గావున సంధి గుదిర్చెనని యూహింపవచ్చును. పురుషాంతరముల తరబడి మహాయుద్ధముల నొనర్చిన వేంగీ కర్ణాటరాజ్యములకు నడుమ సంధిరాయబారము జయప్రదముగా నడిపిన నన్నయ లోకజ్ఞుఁడు. "సత్రృతిభాభియోగ్యుఁడు" అని వినుతి కెక్కుటలో నతిశయోక్తి లేదు.

నన్నయ నెరపిన యీ రాయబారమునకు దక్షిణాపథ చరిత్రలో రావలసిన కీర్తి రాలేదు. దీనికిఁ గారణ మాసంధి చాల కాలము నిలువకజ పోవుటయే గావచ్చును.

నన్నయ రాయబారము జయప్రద మగుటకుఁ గారణము "వానసధరామరవంశవిభూషణుండు నారాయణభట్టు". వాణస వంశస్థులు కర్ణాటరాజాస్థానమున ప్రధానులు. అందు వాణసవంశస్థుఁడైన మధుసూదనయ్య

"కుంతలరాజ్యలక్ష్మీలతాపసంతుఁడు. దుర్మంత్రి మంత్రనిరతరిపు నృపాలలక్ష్మీ సమాకర్షణైక మంత్రము. చాళుక్యరాజ్యభారధౌరేయుఁడు. సార్వభౌమరాజనియోగరాజాధ్యక్షుఁడు, చాళుక్యచక్రేశ్వర ప్రసాదాసాదితయువరాజ పదవీవిరాజితుఁడు." "చక్రవర్తి త్రైలోక్యమల్లదేవుని ప్రధాని" సహాధ్యాయుఁడు నైన నారాయణభట్టు సాహాయ్యమున నన్నయ రాజరాజ నరేంద్రుని రాయబారియై త్రైలోక్యమల్లదేవుని యాస్థానమును జేరి యుభయరాజ్యములకుఁ సంధి యొనర్చెను. ఆగర్భవైరులగు రాజులకు నడుమ కుదిర్చిన సంధి యది. ఇది నన్నయ 'లోకజ్ఞత'కు, దురదృష్టవశమునఁ జరిత్ర మరచిన యుజ్జ్వల నిదర్శనము. కావుననే, నన్నయ సంధిసంధాతయైన నారాయణ భట్టును "అనుష్ఠితజగదుపకరణుఁడని, సాక్షాన్నారాయణుఁ డని ప్రశంసించెను. అతఁడు చక్రవర్తి త్రైలోక్యమల్లదేవుని ప్రధానిగ, రాయబారిగనే రాజరాజనరేంద్రుని యాస్థానమును జేరెను. అతఁడు ప్రధానిమాత్రమే గాదు, వాఙ్మయధురంధరుఁడు. రాజరాజనరేంద్రుడు వేంగిప్రభువు మాత్రమే గాఁడు. "రాజమహేంద్ర కవీంద్ర సమాజసురక్ష్మాజము." నారాయణభట్టు రాజనరేంద్రుని యాస్థానమునకు వచ్చినప్పుడు కవీంద్రసమాజ మతనికి మనస్స్వాగతమిచ్చినది. అష్టాదశావధారణచక్రవర్తి నారాయణభట్టు, మహా కవి నన్నయ, కవీంద్రసురక్ష్మాజము రాజరాజనరేంద్రుని సమాగమమాంధ్రవాఙ్మయమునకు మహోదయము. ఆ మహోదయమున సంస్కృతమహాభారతము తెనుఁగున కవతరించినది.

రాజమహేంద్రకవీంద్రసమాజసురక్ష్మాజ మ్పైన రాజరాజ నరేంద్రుని యాదేశమున నన్నయమహాకవి భారతము నారంభించెనే గాని ముగింపలేకపోయెను. దీనికిఁ గారణ మానాటి కల్లోల రాజకీయస్థితిగతులే యని యూహింప వచ్చును.

ఈ సంధి చిరకాలము నిలువలేదు. త్రైలోక్యమల్లుఁడు, మరల దిగ్విజయము సలుపఁ దలచి కాంచీపురిపై దండెత్తెనని బిల్హణకవి రచనవలనఁ దెలియు చున్నది. ఈ దండయాత్రకు జిగీషయే కారణము. అతని రెండవ కుమారుడు కుమారవిక్రమాదిత్యుఁడు వేంగిపై దాడివెడలెను. అతఁడు తొలదొల్త చక్రకూటము ముట్టడించెను. రాజరాజనరేంద్రుఁడు తనపుత్రుఁడైన కులోత్తుంగుని చక్రకూటమునకుఁ బంపి తాను కర్ణాటసేనాని మధుసూదనునిపైన కెత్తి వెళ్ళెను. ఈ సంఘటనలు క్రీస్తుశకము **1058** సంవత్సరప్రాంతము నాటివి.

ఇదే సమయ మని రాజరాజనరేంద్రుని సవతి తమ్ముడు విజయాదిత్యదేవుఁడు పశ్చిమ చాళుక్యులతోఁ జేరి రాజమహేంద్రవరము నాక్రమించెను. రాజరాజనరేంద్రుఁడు కర్ణాటసేనలతోఁ బోరాడుచు యుద్ధమున వీరస్వర్గ మలంకరించెను. యువరాజు చక్రకూటప్రాంతమున నల్లాడవలసి వచ్చెను.

ఇట్టి కల్లోలస్థితిలో నారాయణభట్టు స్థితి చరిత్ర కందని విషయము. నన్నయభట్టుకూడ చేలికవెంటఁబోయి యుద్ధమున మరణించెనో-తెలియదు. లోకజ్ఞుఁడు మిత్రుఁడునైన నన్నయ రాజరాజు నధిగమించియుండవచ్చును. నన్నయ భారతమున చివరి

పద్యము శరత్కాలవర్ణనము. ఈ పద్యానుశీలనమున, నన్నయ తాను తిరిగివచ్చుట యసంభవ మని గుర్తించి, చిట్ట చివరి పద్యమున నింక నాంధ్రభారతపర్వములు ''పరపూరితంబులై'' వెలయు నని చెప్పినట్లు దోచును.

శారదరాత్రు లుజ్జ్వల లసత్తరహారకహారపంక్తులన్
జారుతరంబు రుచిపూరము లంబరపూతంబులై.

ఇందు, ''కర్పూరపరాగపాండురుచిపూరములు-అంబర పూరితంబులై'' యనుట ప్రకరణానుబద్ధమైన యర్థము. అట్లుగాక, కర్పూర పరాగ పాండు రుచిపూరములన్, ''పరపూరితంబులై''యను పదగుంఫనము చివరి మాటగ విరిచి స్వీకరించిన, మహాకవి నన్నయయే భవితవ్యమునే యందట్లు పొందుపరచినట్లు గోచరించును. నన్నయ చివరిమాట, ''పరపూరితంబులై''- 'యితరులచే పూరింపఁబడినవై' యని నిష్కర్షగఁ జెప్పె ననుట పండితులు సందర్భమునుండి వాక్యములను విడదీసి విరిచి చెప్పెడి యర్థమని కొందఱు పూర్వపక్షమును నెలకొల్పవచ్చును. కాని నన్నయ మహాకవి వాక్యము యాదృచ్ఛిక నిరర్థక ప్రయోగముకాఁజాలదు.

''ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోనుధావతే'' ఋషుల పలుకును అర్థ మనుసరించు నను భవభూతిమహాకవి వాక్యము చిరస్మరణీయము.

కవిత్రయము

తిక్కన

నన్నయ మహాకవి యారంభించిన మహాభారతము సుమారు రెండు శతాబ్దుల తరువాత తిక్కనమహాకవి యావిర్భావమువరకు నసంపూర్తిగ నిలిచిపోయినది. నన్నయ తరువాత రెండు శతాబ్దులలోఁ దెలుఁగు దేశమునఁ గవులే పుట్టలేదా ? మహాభారత మేల యసంపూర్తిగ నుండిపోయినది ? ఈ ప్రశ్నలకు సమాధానము నన్వేషింపవలెను. నన్నయకుఁ దిక్కనకు మధ్యకాలమునఁ దెలుఁగున కవు లెందఱో గలరు. నన్నెచోడుఁడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుఁడు మున్నగు మహాకవు లందఱీ మధ్యకాలమున వెలసినవారే. వీ రందఱు భారత మేల పూరింప దొరకొన లేదు ? దీని కనేక కారణములు గలవు. వీరు శివకవులు. శైవులలో నతివాదులు వీరశైవులు. వీరశైవుల మతావేశము, భవికవుల దర్శనస్పర్శనాదులు పరిహరించునంతవఱకుఁ బోయెను.

"భవి కృతారంభసంభవధ్యాననియచు
భవి నిరీక్షణరసపాకవితాన
భవి హస్తగతఫలపత్రశాకాది
భవి గృహక్షేత్రాంఘ్రిపథనవర్జితుండ;
భవి జనదర్శనస్పర్శనాలాప
వివిధదానాదానవిషయదూరగుఁడ."

అని పాల్కురికి సోమనాథకవి పండితారాధ్యచరిత్రలోఁ జెప్పుకొనెను. నాటి సమాజములో వీరశైవులు గొప్ప విప్లవమును నెలకొల్పినట్టే. నాటి సారస్వతములో శైవకవులు గొప్ప పరివర్తనము సంఘటించిరి.

శివకవు లందఱు వీరశైవులు గాకపోవచ్చును. కాని వారందఱు సారస్వతమునఁ జాల సమానధర్మములు గలవారు. శివపారమ్యప్రబోధము, శివభక్తి, యందఱికుఁ బ్రధానసూత్రములు. వీరిదృష్టిలో మతము ప్రధానము. సారస్వతము గౌణము. వీరు మతప్రబోధమునకే సారస్వతసృష్టికిఁ బూనుకొనిరి. తెలుఁగువారికిఁ దెలుఁగు భాషలో శివభక్తిప్రాధాన్యము, శైవమత ప్రాశస్త్యము బోధించుటయే వారి సంకల్పము. కావున వారి కావ్యములు స్వమతస్థాపన పరమతఖండనలతో నిండిపోయి సార్వజనీనములు గాలేకపోయినవి. వీరి గ్రంథముల, నుత్తమోత్తమకవిత యని చెప్పఁదగిన మహోదారభావములు నుత్కృష్ట సృష్టి యనిపించు సన్నివేశములు నెన్నియో కలవు. కాని సాహితీలోకములో వీరికి రావలసిన కీర్తి రాలేదు. చారిత్రకముగ వీరు నన్నయ తిక్కన మహాకవులమధ్యనున్నారు. ఇటు చంద్రాస్తమయము, అటు సూర్యోదయమునకు మధ్య, శుక్రుని యలఁతి యలతి కాంతులెంత నిసర్గరమణీయములైనను లోకము చక్కగా దర్శింపలేదు.

శివకవులు సారస్వతమునకుఁ జేసిన సేవ, "జాను తెనుఁగు"నకు "దేశికవిత"కు, వారు కల్పించిన ప్రాముఖ్యము. స్వతంత్రమైన యీ సారస్వతోద్యమమే వారిని నన్నయనుండి వేరు చేసినది. శివకవులు భారతరచనకు దూరమైరి.

"మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బున జన చాళుక్యరాజు మొదలుగఁ బలువుర్."

అని నన్నెచోడుఁడు దేశికవితను వివరించెను. నన్నె చోడుని కాలములో నాంధ్రసాహితీలోకములో, "మార్గ" "దేశి" యను భిన్నవాదములు గన్పించుచున్నవి. 'మార్గ' 'దేశి' పదములు సంగీతనాట్యపరముగ నలంకారగ్రంథములోఁ గన్పించుచున్నవి. "మార్గ దేశి విభాగేన సంగీతం ద్వివిధం మతం"-శాస్త్రబద్ధమైన సంగీతము 'మార్గ'; యథేష్టాచరణ, నియమరహితమైన సంగీతము 'దేశి'. అట్లే నృత్యనృత్తములు గూడ. కవితాపరముగఁగూడ నీ శబ్దముల కిట్లే యర్థవివరణము చెప్పుకొనవచ్చును. నన్నెచోడుఁడీ శబ్దముల నే యర్థమునఁ బ్రయోగించెను? ఈ ప్రశ్నకు సమాధానము చెప్పుటలోఁ బడిపంతులలో నేక వాక్యత కుదురుటలేదు. నన్నెచోడుఁడే.

"మార్గకుమార్గము దేశియ
మార్గము వదవంగఁ దమకు మది వదలక దు
ర్మార్గపదవర్తులనఁ దగు
మార్గవులం దలచ నలఁతి మహి సుకవులకున్"

అని వివరించెను.

"మార్గ సంస్కృత కవిత్వము; దేశి (తెలుఁగు) దేశ భాషాకవిత్వము" అని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు కుమారసంభవములో నర్థము వ్రాసియున్నారు. పూర్వోదాహృతమైన

చాళుక్యప్రశంసనుబట్టి నన్నెచోడుని దేశికవితాభిమానము నిర్వివాదాంశము. కాని 'దేశికవిత' యనిన దేశభాషా కవిత్వమని, యనగాఁ దెలుగు కవిత్వమని యర్థము చెప్పినచో చాళుక్యవాఙ్మయమునకు ధ్వజప్రాయమైన యాంధ్ర మహాభారతమునుగూర్చి గాని, తత్కర్తయైన నన్నయభట్టును గూర్చిగాని, నన్నెచోడుఁడు గాని, తక్కిన శివకవులు గాని, పూర్వకవి కావ్యప్రశంసాపూర్వకముగ నొక్క మాటయైనఁ బ్రసక్తి వచ్చినపుడుగూడఁ బలుకకుండుట వింతలలో వింత. లేక, శివకవులు నన్నయ భారతమును స్వచ్ఛదేశికవితగఁ బరిగణింప లేదా ?

నన్నెచోడుఁడు పొగడిన 'దేశి' చాళుక్యవాఙ్మయమేది ? చాళుక్యరాజశాసనములలో నన్నయకు ముందే తెలుఁగులోఁ బద్యరచన కన్పించుచున్నది. యుద్ధమల్లుని బెజవాడ శాసనము, పండ్రంగుని యద్దంకి శాసనము మున్నగునవి నిదర్శనములు. ఈ శాసనములలోఁ దరువోజలు, మధ్యాక్కరలు, సీసములు, నాటవెలదులు, తేటగీతులు కన్పించుచున్నవి. యతిప్రాసాత్మకమైన తెలుఁగు ఛందస్సు, సంస్కృతములోని ఛందస్సుకంటె విలక్షణమైనది. వీనిలో సంస్కృతగురుత్వమున కంటెఁ దెనుఁగుఁదనమే యెక్కువ. ఇవిగాక తుమ్మెద పదములు, వెన్నెల పదములు, రగడలు, ద్విపదలు మున్నగు పదవాఙ్మయ మెంతయో యుండెడి దని పండితారాధ్యచరిత్ర మున్నగు గ్రంథములవలన నూహింపవచ్చును. ఇట్టి వాఙ్మయ వికాసమంతయు "దేశి" శాఖకుఁ జెందినదే గాని "మార్గ" కవితావర్గమునకుఁ జేరినదిగాదు. చాళుక్యరాజ్యారంభమునుండి తెలుగు వాఙ్మయము క్రమపరిణామవికాసబద్ధమై యున్నది.

నన్నెచోడుని కుమారసంభవములోని చాళుక్యరాజుల దేశికవితా సేవా ప్రశంస యీ వాఙ్మయవికాసమున కంతటికి నన్వయింపవలెనేమో!

చాళుక్యులలోఁ జివరిరాజు రాజరాజనరేంద్రుఁడు. ఆ కాలమునాటికి నన్నయ మహాకవి మహాభారతరచనకుఁ బూనుకొనెను. నన్నయ మహాకవి ప్రయోగించిన భాష-సమకాలీన శాసనభాషతోఁ బోల్చి చూచినచో, "విపులశబ్దశాసనుఁడు"ను బిరుదునకు సార్థకత గోచరించును. నన్నయ ప్రయోగించిన భాషలోఁ జాలవఱకు సంస్కృతపదభ్యాదలు జాతీయపములు యథాతథముగఁ దెనుఁగులోఁ గనిపించును. నన్నయ వాడుకలోనున్న శబ్దజాలమును సంస్కరించి వాడినాఁడని చెప్పవచ్చును. సంస్కృత వ్యాకరణవిరోధప్రయోగములు శివకవుల కావ్యములలో నాటి శాసనములలోఁ గన్పించినట్లు, నన్నయ భారతమునఁ గన్పింపవు. నన్నయకాలములోని శాసనములందలి భాష యథాతథముగ గాక, సంస్కారరూపమున నన్నయ కావ్యమున గోచరించుచున్నది. నన్నయ సల్పిన యీ శబ్దసంస్కారమే యతనికి 'విపులశబ్దశాసనుఁడ'ను బిరుదును సంపాదించిపెట్టియుండును. నన్నయ భారతమున నితివృత్తము, భాష, ఛందస్సు, సంస్కృత ప్రభావమునకు లోఁబడినవే. నిర్ణీత నియమబద్ధమైన యతని సంస్కారపద్ధతి 'మార్గ' కవితయే యని శివకవుల మతము గావచ్చును. అందుచేతనే యాదికవియైనను నన్నయమహాకవిని శివకవులెవ్వరు స్మరింపలేదు. దేశభాషాకవితా ప్రపంచమున నగ్రగణ్యమైన నన్నయభారతమును శివకవులెల్లరు స్మరింపపోవుటకుఁ గారణము భిన్నసారస్వత దృక్పథముగూడ నని చెప్పవచ్చును.

సంఘమున నొక ప్రత్యేక మతమును వెలయించినట్లే శైవులు వాఙ్మయమునఁగూడ నొక స్వతంత్రసారస్వతోద్యమమును నెలకొల్పినారు. "గద్యపద్యసంస్కృతభూయిష్ఠ ప్రబంధ రచన, మానుగా సర్వసామాన్యంబు గాద"ని పాల్కురికి సోమనాథుని ప్రవచనము. ఈ మాట నన్నయ నెత్తిపొడుపు, తిక్కన తన తొలికావ్యమగు నుత్తరరామాయణమును నిర్వచనముగానే రచించెను.

"ప్రాసమ్మైనను యతిపై వడియ్యైన
దేసిగా నిలిపి యాదిప్రాసనియతిఁ
దప్పకుండగ ద్విపదలు రచియింతు"

ఇది పండితారాధ్యచరిత్ర యవతారికలో సోమనాథుని ప్రతిజ్ఞ. తెలుఁగు కవితకు ముఖ్యలక్షణములు యతిప్రాసలు. తెలుఁగు ఛందస్సునకు బ్రత్యేకత, నిర్ణీతగురులఘుపరంపరానుపూర్విసంకలిత మగు గణములు గాక మాత్రాబద్ధములగు గణములు. తెలుఁగు యతి సంస్కృతయతికంటె విశిష్టము. సోమనాథుఁడు 'ప్రాసము, యతి' 'దేసి'గా నిలిపి, యని యర్థవంతమైన వాక్యము ప్రయోగించెను. విరామపూర్వకమైన సంస్కృత యతిగాక వర్ణసాజాత్యపూర్వకమైన తెలుఁగు యతినే పాటింపవలెను. తెలుఁగునుడికారపు నిసర్గతను గుర్తించి తదనుగుణముగ వ్రాయుట 'దేశి'కవిత. 'దేశి'కవితాశాఖ సంస్కృత వాఙ్మయ మర్యాదకు లోఁబడదు. ప్రాసనియతి సంస్కృతవృత్తములలో లేదు, అది తెలుఁగు కవితకుఁ బ్రత్యేకభూషణము. నన్నయ సంస్కృతములోని ఛందస్సులను గ్రహించి వానికిఁ దెనుఁగు యతిప్రాసలు చేర్చి

భారతములో వాడెను. కాని శుద్ధదేశకవితావాదులగు సోమనాథాదుల కిది నచ్చలేదు. వారు శుద్ధదేశీయమ్మైన ఛందస్సులో ద్విపదలో వ్రాసినారు. మాత్రాగణబద్ధములైన పద్యములు జాతులు. "జాతులు మాత్రానుసంధానగణవినీతులు గాన" మాత్రాగణబద్ధమ్మైన ద్విపదలో శుద్ధదేశిగా కావ్యము లల్లెద నని సోమనాథుని ప్రతిజ్ఞ.

"ఉరుతర గద్యపద్యోక్తులకంటె
సరసమ్మై పరగిన జాను తెనుఁగు
చర్చించగా సర్వసామాన్య మగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కి దైవార"

"ఉరుతరగద్యపద్యోక్తులు"–నన్నయ వని గుర్తింపవచ్చును. శివకవుల కాలమున కవి సర్వసామాన్యము గాక పోయినవి. శివకవులు ప్రతిపాదించిన క్రొత్తసూత్రము "జానుతెనుఁగు." "సరలముగాఁగ భావములు జానుతెనుంగున నింపు పెంపుతోఁ బిరిఁగొన"–వ్రాయవలె నని కుమారసంభవ పీఠికలోని మాట. సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమున "జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు" అని ప్రతిపాదించినాఁడు. సోమనాథుడే వృషాధిప శతకమున జానుతెనుఁగున కుదాహరణ ప్రాయముగ వ్రాసిన పద్యము.

"బలు పొడ తోలు సీరయును బాప సరుల్ గిలుపారు కన్ను వె
న్నెల తల సేదు గుత్తుకయు నిండిన వేలుపుటేరు వల్గు పూ
సలు గల టేని లెంక వని జాను తెనుంగున విన్నవించెదన్
వలపు మదిన్ దలిర్ప బసవా బసవా బసవా వృషాధిపా!"

ఈ పద్యమునుబట్టి జాను దెనుఁగన నచ్చతెనుఁగని కొందఱర్థము తీయుచున్నారు. కాని, యీనిర్వచనమునకుఁ గుమార సంభవమేం గాక యా సోమనాథుని బసవపురాణము పండితారాధ్యచరిత్రములుగూడ నపవాదములే. నన్నెచోడుఁడు సోమనాథుఁడుగూడ వారి జాను తెనుఁగు కావ్యములలో సంస్కృత సమాసములు కుప్పతిప్పలుగఁ బ్రయోగించినారు. మఱికొందఱు జానుతెనుఁగునఁ దేట తెనుఁగని యర్థమునిచ్చుచున్నారు. 'జాను తెనుఁగు' 'తేట తెనుఁగు'-మాటల రెంటిని విడివిడిగా సోమనాథుఁడే ప్రయోగించినాఁడు. జాను తెనుఁగు తేట తెనుఁగు అనగా సులభముగా నర్థమగు తెనుఁగు-అని సూర్యరాయనిఘంటువులో వివరణము గలదు. కాని, శివకవుల జాను తెనుఁగు కావ్యములలో సులభగ్రాహ్యములు గాని సంస్కృత సమాసములే కాక, కన్నడభాషాపదములు శ్రుతిస్మృతివాక్యములు పెక్కులు గలవు.

శివకవులు వాడిన భాషకుఁ గొన్ని ప్రత్యేక ధర్మములు గలవు. వారి దృష్టిలోఁ దెనుఁగుభాషను శాసించుటకు సంస్కృతవ్యాకరణమునకు హక్కులేదు. తెలుగుభాషలో సహజసిద్ధముగ వాడుకలో నున్న పదములు సంస్కృత వ్యాకరణసమ్మతములు గాకపోయినను, శివకవులు కుప్పతిప్పలుగ వాడినారు.

"నల్లవో బసవన్న నందీశమూర్తి"
"నల్లవో బసవయ్య ముల్లోకవంద్య"
"కట్టితి సర్వాంగ కచ్చడం బనుచు"
"శ్రీమహాదేవుఁడన్నామంబు లున్న
వే మహి నెటువంటి యితరవేల్పులకు"

– బసవపురాణము

ఇట్లే "నిత్యపడి, పుడమీశ, భక్తకూటువల్లు, సద్భక్తసమూహి", ఆ కాలపు తెలుఁగు శాసనములలో, నంతకుముందు శాసనములలోఁ గూడ నిట్టిసమాసములు గానవచ్చుచున్నవి. శివకవుల ప్రయోగసరణి సమకాలీనశాసనములలోఁ గన్పించుటచే నట్టి పదము లాకాలమునఁ దెనుఁగు నాలుకలపై నలుఁగుచుండెడివని యూహింపవచ్చును. సహజసిద్ధముగఁ దెనుఁగువారు వాడు పదములు కావ్యములలో వాడుకొనవచ్చునని వారి యాశయము. జాను తెనుఁగన నిసర్గమైన తెనుఁగు. అందు సంస్కృతపదము లుండవచ్చును. ఆ సంస్కృతము సంస్కృతపు రీవితోఁగాక తెలుఁగునుడి ననుసరించి చేరును. శివకవులు నన్నయ "గద్యపద్యప్రబంధభూయిష్ఠరచన, యురుతరగద్య పద్యోక్తులు శబ్దశాసనవము"పైఁ బూర్వపక్షమును నెలకొల్పి, సర్వతంత్రస్వతంత్రమగు నూత్నసారస్వతోద్యమమును నెలకొల్పిరి. నన్నయ యారంభించిన యాంధ్రమహాభారత మసంపూర్ణముగ నిలిచిపోవలసి వచ్చినది.

శివకవులు ప్రతిపాదించిన సారస్వతోద్యమము సార్వజనీనము గాలేదు. సాహిత్యప్రపంచమున భిన్నవాదవములు చెలరేగినవి.

శైవయుగములోఁ జిట్టచివర నుద్భవించిన కావ్యము రంగనాథరామాయణము, రంగనాథరామాయణకర్త శివకవులను బూర్తిగ ననుసరింపలేదు. ఛందస్సు శుద్ధదేశి యగు ద్విపదయే గాని యితివృత్తము సంస్కృతరామాయణమే. భాషాప్రయోగ స్వాతంత్ర్యమును బట్టి చూచినను శివకవులవలె విశృంఖల విహారము సలుపలేదు. ఈ కావ్యము వీరశైవమత క్షీణదశను సంస్కృత సాహిత్య గౌరవపునరుద్ధరణాభిమానమును వ్యక్తము చేయుచున్నది. రంగనాథరామాయణము తిక్కన మహాయుగమునకు వేగుజుక్క. ఇట్టి స్థితిగతులలో నన్నయ యారంభించిన మహాభారతమును బూరింప సాహసించు మహాకవి లేకపోయెను. ఈ యుగమందే వేములవాడ భీమకవి సాహసించి భారతమును బూరింప సమకట్టియు విఫలుడై యుండవచ్చును. వేములవాడ భీమకవి విరాటపర్వమునుండి కొన్ని పద్యములు లక్షణగ్రంథములం దుదాహరింపఁ బడినవి. భారతమువంటి మహేతిహాసరచనకుఁ గవులందఱు నధికారులు కారు. అది యొక సామాన్యకవి కసాధ్యమైన పని. ఒక సారస్వతపరిషత్తు లేదా పరిషత్తువంటి యొక మహాకవి సాధింపవలసిన కర్తవ్యమది. రాజరాజనరేంద్రుని తరువాత వేంగీదేశమునకు వీరవిజయాదిత్యుఁడు పరిపాలకుఁ డయ్యెను. రాజరాజనరేంద్రుని యాశ్రయమునఁ బెంపొందిన 'రాజమహేంద్ర కవీంద్రసమాజమున'కు రాజాశ్రయము తప్పినది. ఇక వ్యక్తులెవ్వరు భారత రచనకుఁ దలపెట్టలేదు. అంతలో శివకవులు చెలరేగి, దేశికవిత, జాను తెనుఁగు వాదములతో నన్నయ భారత వాఙ్మయముపై దండెత్తిరి.

రెండు శతాబ్దుల తరువాత నెల్లూరు మండల ప్రభువైన మనుమ సిద్ధిరాజునకు మంత్రిత్వము నెరపిన తిక్కన మహా కవి తిరిగి మహాభారత రచనకుఁ బూనుకొనెను.

"అల్పాక్షరంబుల ననల్పార్థరచన", "జాను తెనుఁగు, దేశికవిత" "ద్విపదరచన" యను సిద్ధాంతరాద్ధాంతములే గాని వాని యంతస్తత్త్వ మెట్టిదో, యని యెంతవర కనుసరణీయములో చూపిన మహాకవిమాత్ర మంతవరకెవరు లేకపోయెను. అస లంతరార్థము గుర్తింపక, వృథావాగ్వివాదములలోఁబడిన సారస్వతోపాసకులందఱ నేకోన్ముఖము చేసి యన్ని వాదములలోఁగల సత్యమును సమన్వయించి చూపిన సారస్వతాచార్యుఁడు తిక్కన. నిజమున కుత్తమసాహిత్యగౌరవ మౌచిత్య పరిపాలన, భావనాపాటవము రసప్రతీతిపైనను, గావ్యమున కంగభూతములైన జాతీయమము పలుకుబడి నుడికారముపైనను నాధారపడియుండును. వీనిలో నే యేక దేశమునో గ్రహించి, ఛందస్సుపైననో, భాషపైననో యధికనిష్ఠ చూపిన కవికి సాహితీసృష్టిలో నేక దేశసిద్ధి మాత్రమే లభించును. అట్లుగాక పరిపూర్ణ సిద్ధి పొందిన మహాకవి తిక్కన. ఈ సత్యమునే తిక్కన తన తొలికావ్యమైన నిర్వచనోత్తరరామాయణపీఠికలో నాచార్యుఁడై కవితాలోకమున కుపదేశించినాఁడు. ఈ ప్రబోధము సమకాలీన సాహిత్యమీమాంసలపై విమర్శ, శివకవులు ప్రతిపాదించిన 'జానుతెనుఁగు, దేశికవిత, యల్పాక్షరంబుల ననల్పార్థ రచన' మన్నగు సిద్ధాంతములపై నిర్వచనోత్తరరామాయణ పీఠిక సాహిత్యసమీక్ష. అంతమాత్రమేగాదు. చిరానుభవముచేఁ దాను గళాధర్మము లని

గ్రహించిన సూత్రపతితిఁ దిక్కన యాంధ్రసారస్వతజగత్తునకు ప్రసాధించినాఁడు. నిర్వచనోత్తర రామాయణపీఠిక యొక్కటే తిక్కనకుఁ దెనుఁగులో నాలంకారికసంఘమున నగ్రగౌరవము నందింపఁగలదు. ఆనాడు తిక్కనకుఁ గవిగానే గాక కవితాశిల్పవేత్తగాగూడఁ బ్రఖ్యాతి గలదు. సమకాలీనసాహిత్యవాదములపై సుకుమారనిశితవిమర్శ. నిర్వచనోత్తరరామాయణపీఠిక యనను విషయమును, శివకవుల కావ్యపీఠికలు, తిక్కన కావ్యపీఠికతోఁ బోల్చి చూచినచో స్వయంవ్యక్తము కాగలదు.

''జాత్యముఁగాని నొప్పయిన సంస్కృత మెయ్యెడఁజొన్న, వాక్యసాం
గత్యము చేయుచో నయిన గద్యము తోడుగఁ జెప్పి పెట్ట దో
ర్గత్యము దోఁపఁ బ్రాసము ప్రకారము వేఱగు నక్షరంబులన్
శ్రుత్యనురూప మంచు నిడ సూరుల కివ్విధ మింపుఁ బెంపదే''

–నిర్వచనోత్తరరామాయణము

''జాత్యముఁ గాని నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్న''–అను ప్రతిజ్ఞ శివకవు లధిక్షేపించిన ''సంస్కృత భూయిష్ఠరచనకు సమాధానము''. వాక్యసాంగత్యము చేయుచో నయిన గద్యము తోడుగఁ జెప్పిపెట్ట''–అను వాక్యము శివకవుల 'ఆరూఢగద్య పద్యరచనకు' 'ఉరుతర గద్యపద్యోక్తులకుఁ' బ్రత్యుత్తరము. 'ప్రాసము ప్రకారము వేఱగు నక్షరంబుశ్రుత్యనురూపమంచు నిడ', అనునది శివకవుల నెత్తిపాడుపు.

'సర్వజ్ఞభక్తివిరహితు
డెవ్వఁడు నుత్కృష్టజాతుఁ డేటికిఁ గొఱయే.''

– శివతత్త్వసారము.

ప్రాసమున శివకవులు కతిపయహల్సామ్యమున్నసరిపడిరి.

అలవడ సంస్కృతశబ్దము
తెలుఁగు బడి విశేషణంబు తేట పడంగాఁ
బలుకు నెడ లింగవచనం
బులు భేదింపమికి మెచ్చు బుధజనము కృతిన్.

అని నిర్వచనోత్తరరామాయణపీఠికలోఁ దిక్కన పేర్కొనిన కావ్యదోషములు గూడ శివకవులపైనఁ బరోక్షవిమర్శయే. తిక్కన నిర్వచనోత్తరరామాయణపీఠికలో "పలుకుల పొందు లేక రసభంగము సేయుచుఁ బ్రాత వడ్డ మాటలఁదమ నేర్పుచూపి'' అని కుకవినింద సల్పినాఁడు. తిక్కన పదప్రయోగ కౌశల మొక లలిత కళ. ఈ కళావైదగ్ధ్యమున కతని రెండు కావ్యములు ఉదాహరణములే. తిక్కన 'రసభంగము' గర్హించి పదముల కూర్పుపైఁ దన యభిప్రాయము వెల్లడించెను.

"లలితపదహృద్యపద్యం
బులన కథార్థంబు ఘటితపూర్వాపరమై
యలఁతి యలఁతి తునియలు, గా
హళ సంధించిన విధమున నమరఁగ వలయున్''

అలఁతి యలఁతి తునియలు పూర్వాపరముగఁ గాహళ నిర్మించినట్లు పదములను బ్రయోగింపవలె నని తిక్కన యాదేశము. అటు ప్రాత వడ్డ మాటలు గాని, యిటు వ్యవహారమున నలిగిన మాట లన్నియు యథాతథముగఁ బ్రయోగార్హములని తిక్కన చెప్పలేదు. కవితార్థమును గంధవహుఁడు పుష్పదళంబుల సౌరభ మిచ్చు చందమున వికసింపఁ జేయ వలెనని తిక్కన యాశయము.

నిర్వచనోత్తరరామాయణకథ యయోధ్యవర్ణనముతో నారంభించుచున్నది. ఈ వర్ణనము సంస్కృతరామాయణములో లేదు. సంఘమునకు సారస్వతమునకును బింబ ప్రతిబింబభావము గలదు. సాంఘిక వాతావరణము సాహిత్యసృష్టికి రూపకల్పనలు దిద్దును. ఈ దృష్టితోఁ జూచినచో నిర్వచనోత్తరరామాయణములోఁ దిక్కననాటి యాంధ్రసాంఘికవృత్తముల నక్కడక్కడ ఛాయామాత్రముగ గుర్తింపవచ్చును.

తిక్కన యయోధ్యపురవర్ణన యొక యాదర్శప్రాయమైన యాంధ్రమహానగరవర్ణన. పదుమూడవ శతాబ్దిలో నాంధ్రదేశములో శత్రుదుర్భేద్యమైన యొక కోటను దిక్కన రామాయణ కాలమునాటి అయోధ్యాపురికిఁ జేర్చినాడు. ఆ విశాలపరిఖ, యున్నతవప్రగోపురములు, బహురత్నోత్కీర్ణ సాలభంజికలు, రత్నహర్మ్యరేఖలు, మత్తేభగర్జితస్ఫారరవంబులు బృంహితనాదములు. పవనజవనాశ్వములు–ఇవి యానాటి కోటలలోఁ దిరుగుచుఁ దిక్కన స్వయముగఁ జూచినవే. వాల్మీకి యొక్కముక్కగూడ సంస్కృతరామాయణమునఁ జెప్పలేదు. ఇంతేగాదు.

ముప్వంపు మేనుల జవ్వనంబుల కింపు
మిగిలిన చెయ్యిల మెఱుఁగు వెట్ట;
నల్లన మధురంపు సల్లాపరచనకు
లేఁత నవ్వున నునుఁ బూఁత పూయ;
నిడు వాలుఁ గను దోయి నినుపారు కాంతికిఁ
గలికి క్రేఁగన్నుల నలువు మిగుల;
లలితంబులగు చిత్తముల చతురతలకు
సరసంపు నడవడిఁ దెరలు పుచ్చ;
వెరవు గల్గి మనోభవు వీరరసము
నిరతముగ నేర్పు వాటించి కరువు గట్టి
పోసి చేసిన రూపుల పోల్కి వార
వనిత బొప్పుదు రప్పురవరము నందు.

వాల్మీకి దేవలోకములో రంభాదివేశ్యలను గూర్చి చెప్పినాడుగాని భూలోకములో వేశ్యలగూర్చి, యందులో నయోధ్యాపురీ వేశ్యలను గూర్చి ప్రస్తావింప లేదు. మొన్న మొన్నటి వర కాంధ్రదేశ మంతటఁ దిక్కన వర్ణించిన వేశ్యలుండెడివా రని వేఱుగఁ జెప్ప నక్కరలేదు.

ఘనసారకర్పూరపరిమళములు చందనగంధములు గాలి వీపులో గుబాళించు చుండెడివి. గంధవాహుని పరిమళములోఁ దిక్కన యానాటి విటుల రసికతను మనోజ్ఞముగ వర్ణించి నాఁడు. ఈ విటులు, సంస్కృత రామాయణమునందలి యయోధ్యలో, నేటి తెలుగునాట లేకున్నను, దిక్కననాడును, దర్వాత విద్యానగరవీథులలో గంధవహునితోఁ గలసి మెలసి తిరుగుచుండెడివా రనుట తథ్యము.

ఆ యువతు లుత్తరదేశ మందలి యయోధ్యాపుర వాసినులు కారు. ఆంధ్ర యువతులేనాడు మేలిముసుఁగు నెరుఁగరు. "పయ్యెద దూలించుట" యేనాటికి నేటికిఁ దెలుఁగు పడుచుల యనవరత శృంగారము. చందనగంధములు మైపూఁతలు నవతంసమంజరులు నాడు గలవు. ఆనాడు నెలతల చెక్కులమేఱుఁగు వింతగనవతంస మంజరుల్లు గాలిలోఁ గదలుచుండెను. "శుకపికసంకులత్వమున సుందరసాంద్రలతాంత పల్లవ ప్రకరబహుచ్ఛవిం బురవరంబు విహారవనంబు లొప్పు" నట. ఆ విహారవనము లలనాటి యయోధ్యలోఁ గలవో లేవో చెప్పలేము గాని, తిక్కననాటి తెలుఁగు రాజధానులలోఁ గలవని చెప్పవచ్చును.

ఉపవనములను వర్ణించునపుడు తిక్కన యుప్పొంగి రచించెను. మత్తాళి పుష్పితనవలతా పుంజము లోపల విహరించుచుండెడిది. ఉన్మదకలకంఠకుమారుఁడు సహకారపల్లవసమితి కదల్చుచుండెడివాఁడు. మందమారుతము లా పుష్పవనములలో విహరించుచుండెడివి. ఉద్యానవనములలో లతామండపము లుండెడివి. రాజాంతఃపురములలో నుద్యానవనము క్రీడారంగము. సీతారాముల వనవిహారవర్ణనమును మూలములోఁ గంటెఁ బెంచి తిక్కన వర్ణించుటబట్టి చూచిన నాంధ్రరాజుల రాణుల కేళీవిలాస విహారములకు నుద్యానవనములే యాటపట్టులని తెలియుచున్నది. ఇట్లే జలక్రీడలు. ఉపవనములలో జలక్రీడలకు సుందర తటాకము లుండెడివి.

సీతకు మూలములోఁ జెలికత్తెలు కన్పింపరు. నిర్వచనోత్తర రామాయణమున లెక్కకు మిక్కిలి చెలికత్తెలు గలరు. ఈ చెలికత్తియ

లందఱు తిక్కన మహాకవి సీతకు ధర్మముగ నొసగిన పరివారము గాదు. ఆ నాడు తెలుఁగు రాణులకు అంతఃపురవాసినులైన పరిచారికాబృందము లెక్కకు మించి యుండెడిది. అంతఃపురోద్యానవిహారజలక్రీడాదులు తిక్కన కాలమునాటి తెలుఁగు రాణులకు అంతఃపురవాసినులైన పరిచారికాబృందము లెక్కకు మించి యుండెడిది. అంతఃపురోద్యానవిహారజలక్రీడాదులు తిక్కన కాలమునాటి తెలుఁగు నేలనేగాక తరువాత విద్యానగర సామ్రాజ్యమునఁగూడఁగల యాచారములు. ఈ విషయము విద్యానగరము సందర్శించిన విదేశ యాత్రికుల వ్రాతలవలనఁ గూడఁ దెలియుచున్నది. తిక్కన పురవర్ణనము చదివిన తర్వాత ఓరుగల్లు కోటలోని నేటి శిథిలావశేషములను జూచినప్పుడు పఠిత స్వప్నములోఁజూచిన దానిని సరిపోల్చు కొనుచున్నట్లు విస్మితుఁడగును.

రామాయణములో కుబేరుని దూత రావణు సందర్శించుట గలదు. కుబేరుని దూత సభలో రావణునిజూచి ''జయ'' అని పలికినాడు. ఈ ఘట్టములో తిక్కన పంపిన దూత యక్షదూత కాడు. తెలుఁగు దూతయే. అతడు చనుదెంచి ముందఱ విభీషణుని జూచినాడు. విభీషణుడు 'వచ్చిన కార్యమారసి' 'దానవేశ్వరుని' 'చెచ్చెరగానిపించి' నాడు. ఎడ సేయక అప్పుడు దూత 'వినీతవేషుడై చొచ్చి', 'ధరాతలం బురము సోకగ నానతుడై' నాడు. దూతకు వినీతవేషము తిక్కన క్రొత్తగ వేసినదే. దూత రాజుగారి కంటె ముందు రాజ సోదరుని దర్శింపవలెను. అతఁడు దూతను రాజునకు సమర్పించును. దూత ధరాతలము సోకగ సాష్టాంగదండ

ప్రణామమాచరించి రాజుగారు చేసన్నతోఁ జూపినచోట నొదిగి కూర్చొనవలెను. ఇవి తిక్కన కాలము నాటి రాజాస్థాన మర్యాదలు.

మూలమున విష్ణుదేవునకు రాక్షసులకు మధ్య జరిగిన ఘోరయుద్ధములు కలవు. తిక్కన తెలుఁగుల నా యుద్ధములను వర్ణించినాఁడు. అందలి భటులు దేవతలును గారు రాక్షసులునుగారు. వారు

''కూలిన వారిఁ జూచి గొంకిన మెచ్చక మున్ను వెన్నుగా
నేలకుఁ జొచ్చువారుఁ నెయ్యిర కడ్డము వచ్చువారు ను
క్కీలయి నేర్పు లేక తమకించి పయిం బడి నొచ్చువారు మున్
వాలిన మచ్చరం బగుట వారణ సేయక వ్రచ్చువారునై''

పోరాడినారు. ఇట్టి వారు సంస్కృతమూలమున లేరు. ''ఉక్కీలయి నేర్పులేక తమకించి పయింబడి నొచ్చువారు''ను గలరట. శక్తి; యుక్తి; కత్తి, కలము తిక్కననాటి తెలుఁగు భూమిలో వియ్య మందినవి. యుక్తి లేని శక్తి, కత్తినెరుగని కలము నాటి వారికి నచ్చవు.

కుబేరుఁ డోడిపోయిన పిమ్మట యక్షులు చెల్లాచెదురై కాందిశీకులయిరి. ఓటమి విషయము సంస్కృతరామాయణమునఁ గలదు. గాని ''కాందిశీకుల'' వర్ణనము మాత్ర ముందుఁ గానరాదు. నిజమునకు కాందిశీకులయినది యక్షప్రజలు కాదు. తిక్కన కాలమునాటి రాజు లన్యరాజుల జయించి నప్పుడు విరోధిరాజధానులఁ దగుల పెట్టి, తదాశ్రితులఁ బారఁ ద్రోలు చుండెడివారని సమకాలీనశిలాశాసనములు సాక్ష్యము చెప్పుచున్నవి. ఒకవేళ శిలాశాసనములు లేకపోయినను మనమీ విషయమున చారిత్రకముగ

నంధకారసముద్రమున మునిగి పోయెడి వారమనుకొన నక్కరలేదు. అద్దములోవలెఁ బ్రతిఫలించి, యలనాటి కాందిశీకుల కష్టములు నిర్వచనోత్తర రామాయణమునఁ గన్పించుచున్నవి.

కాలుకొన్నంతయుఁ గడువేగముగఁ బాఱి,
    కనుకవి దెసలందుఁ గాడు పడియుఁ
బాఱఁ జాలక ముట్టఁ బడి జాడఁదప్పంగఁ
    దొలఁగి పెన్గొందులఁ దూఱఁ బడియుఁ
దలలుఁ జీరలును గంపలు పట్టికొని గాసి
    గా బ్రుగ్గ టడవులఁ గాటు పడియుఁ
గాళులఁ జేతులఁగా నెట్టకేలకుఁ
    జఱు లెక్కి లోయలఁ జాఁగఁ బడియు
బయలి మొనలు గోట కట్టిన పెల్లున
వీటి ప్రజయు నొక్కమాట యురలఁ
దెరలి యిద్ద ఱొక్క తెరువునఁ బోవక
యాకులతను గాందిశీకులైరి.

రాజు లన్యరాజ్యములు జయించినపుడు తిక్కన కాందిశీకుల కష్టములు కనులారగాంచి యుండును. ఈ వర్ణన తదనుభూతి పరిణామమే. నాటి తెలుగువారి కష్టము లన్నియు పాపము రామాయణకాలమునాటి యక్షులకుఁ గూడఁ దెచ్చి పెట్టినాఁడు మంత్రి తిక్కన :-

"పయనము చాటఁబంచి సులభంబుగఁ బూరియు నీరు వంట కట్టియలును గల్గు చోట్లను గడింది సుగల్ దగు సుక్కళంబుగా

భయమను పేరులేక నిరపాయమయిగా విడియించుచున్'' నాకాశమార్గమునఁబోవుచు యథేచ్ఛాగమనశీలులగు రాక్షసులు గాదు పూరి, నీరు, వంట, కట్టెలుగల చోట్లు తంటాలు పడి పెదకి విడిసినది. వారు తిక్కనకాలమునాటి తెలుఁగు భటులే.

'చామరగ్రాహిణీకచారుకటకరశ్మిరాజి నీరాజితుండు' 'నృప కోటియు, మంత్రికదంబకంబు' 'కవీంద్రుడు, వంది జనంబు లిష్టభృత్యులు మొదలైన వారలు' బలిసి మదనంబునం గొలువ రామభూవిభుండు కొలువు దీర్చినట్లు నిర్వచనోత్తర రామాయణ వర్ణనము. ఈ వర్ణనకు మూలము తిక్కన ''అను దినము'' చూచిన మనుమసిద్ధి కొలుపుకూటమే.

పౌరజానపదాభిభాషణంబులు దగ
　　నయ్యె తెరంగుల నాదరించు;
నుత్తమహయదంతిసత్తమరథరత్న
　　ములు సూచి సవరణ లలవరించు;
యోధవీరప్రకారోక్తి నిరూఢస
　　ముద్ధతి కెడఁదలో నుల్లసిల్లు;
నిఖిలవిద్యాగమనిపుణవిద్వజ్జన
　　సంభావనంబుల సంతసిల్లు;
ననుదినంబు నిట్టు లభిమతబహువిధ
సముచితప్రవర్తనము లొనర్చు
చతివిభూతినుండి కతిపయదినములు
వోపుటయును రామభూవిభుండు

సంస్కృతరామభూవిభుఁడీ రాజ్యకార్యములు తీర్చినట్లు వాల్మీకి చెప్పలేదు.

నిర్వచనోత్తర రామాయణమున సంస్కృతమూలములోఁ బ్రధానకథతో సంబంధము లేని యవాంతరగాథల నన్నిటిని తిక్కన వదలెను. సంస్కృతోత్తరరామాయణము మహారణ్యము. నిర్వచనోత్తరరామాయణము ఉద్యానవనము. చంద్రోదయ చంద్రికావర్ణనములు, వనవిహార పుష్పాపచయవర్ణనములు, నాంధ్ర వాఙ్మయమున తిక్కన లేఖిని తొలిసారి చిత్రించినవి. అర్వాచీనప్రబంధోదయమునకు నిర్వచనోత్తరరామాయణము వేగుఁజుక్క. తిక్కన ప్రబంధకవులకు వర్ణనాత్మకసన్నివేశముల మేలు బంతులు దీర్చి దిద్దెను.

"చిత్తజు చిగురలం జిత్రంబుగా నిడ్డ
లలితతమాలపల్లవ మనంగ !
రతిపు మాణిక్యదర్పణమున నూనిన !
కమనీయ మృగమదకణ మనంగ
వెడవిల్తు లీలారవిందంబు మీఁదికిఁ
దివుటమ్మె యరిగిన తేఁటి యనఁగ !
వ్వలరాజు సింధూరతిలకంబులోఁ జెలు
వొందు కాలాగరుబిందు వనఁగ !
నుదయరాగమహిమ నుజ్జ్వలంబైన బిం
బంబు నడుమ లాంఛనంబు చెన్నుఁ
జేయఁ బూర్వశైలశిఖరదేశంబున
నిందుఁ డొప్పె భువన మెలమి మిగుల"

తిక్కన 'ఉత్తరరామాయణ' మేల యారంభింపవలెను ? పూర్వరామాయణమును విడుచుటకు హేతువేమి ? ఈ ప్రశ్నలనూహించి సమాధానము తిక్కనయే చెప్పెను.

"ఎత్తఱి నైనను ధీరో
దాత్త నృపోత్తముఁడు రామధరణీపతి స
ద్వృత్తము సంభావ్య మగుట
నుత్తరరామాయణోక్తియుక్తుఁడ నైతిన్."

వెను వెంటనే తిక్కన మరియొక పద్యమున

"సారకవితాభిరాము గుంటూరు విభుని
మంత్రి భాస్కరు మత్పితామహునిఁ దలఁచి
యైన మన్ననమెయి లోక మాదరించు
వేఱ నాకృతిగుణములు వేయు నేల?" – అని

పితామహునిఁ బ్రశంసించెను. అయిన సారకవితాభిరాముఁడైన యీ మంత్రి భాస్కరుఁ డెవరు ? అతని కృతులెవ్వి ? తిక్కన మాటలనుబట్టి యతడు మిక్కిలి సుప్రసిద్ధుడై యుండవలెను. భాస్కరరామాయణకృతికర్తయైన బాస్కరుఁడే తిక్కన పితామహుఁడని కొందఱూహించుచున్నారు. అట్లయిన నుత్తరరామాయణ ప్రసక్తి వచ్చినపుడు గూడ "ఎత్తఱి నైనను ధీరోధాత్తనృపోత్తముఁడు రాముని చరితము సంభావ్య మగునని పల్కెను" గాని పితామహుని పూర్వరామాయణరచనను గూర్చి యేమియుఁ జెప్పక మౌనము వహించెను. దీనినిఁ బట్టి గుంటూరి విభుడైన మంత్రిభాస్కరుఁడు తిక్కన పితామహుఁడు సరస కవితాభిరాముఁడై యాకాలమునఁ

పేరొంది యుండవచ్చునుగాని, రామాయణమును వ్రాయలేదని చెప్పక తప్పదు.

పూర్వరామాయణకీర్తి తాతగారికి, ఉత్తరరామాయణ, శ్రీమదాంధ్రభారతకీర్తి మనుమనకుఁ గట్టిపెట్టుటచేఁ గథ రక్తి కట్టవచ్చును గాని సత్యము మాత్రము కాఁజాలదు.

'మనుమసిద్ధి మహేశసమస్తరాజ్య
భారధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్క శౌరి.'

అని కేతన తిక్కనను బ్రశంసించెను. తిక్కన మనుమసిద్ధి మహీపతి రాజ్యంబునఁ గులక్రమాగతం బగు మంత్రిపదవి

'అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలి శంఖములును
గంబగట్లు భూమి కానిక గాగఁ బెం
పెసగు రాచ పదవు లెల్లఁబడసె.''

వనియుఁ గేతన వ్రాసెను.

తిక్కన యుభయకవిమిత్రుఁడు

'అభిమతుఁడు మనుమభూవిక్షు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా
నుభయకవిమిత్రనామము
త్రిభువనముల నెగడ మంత్రి తిక్కఁడు తాల్చెన్'

అని కేతన దశకుమార చరిత్రమునఁ జెప్పెను.

తిక్కన మనుమసిద్ధి మహారాజునకు మంత్రి. ఆస్థానకవి. ఉభయకవిమిత్రుడు. అతఁడు తన నిర్వచనోత్తరరామాయణము మనుమసిద్ధి మహారాజున కంకిత మిచ్చెను. మహారాజునకు గృతి నిచ్చుట యాశ్రితకవి కవశ్య కర్తవ్యము. కాని, మహాకవి తిక్కన మనుమసిద్ధికిఁ గృతి నిచ్చుట కా సంబంధము మాత్రమే కారణము గాదు.

ఏ నిన్ను మామ యనియెడి
దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
కీ నర్హుఁడ వగు దనియును
భూనాయకు పల్కు చిత్తమున కిం పగుడున్.

మనుమసిద్ధి మహారాజు మంత్రి తిక్కనను 'మామా'యని పిలిచెడివాఁడు. ఆ పిలుపునకు సార్థకత కల్పించుటకై తిక్కన కావ్యకన్యక నిచ్చెను. కృతి ప్రదానమునఁ దిక్కన పలుకులలోఁ గనిపించు ఠీవి తెలుగు కవుల కెల్లరకు గర్వకారణము.

మనుమసిద్ధి చరిత్రలోఁ దెలుగు చోడులని ప్రసిద్ధి కెక్కిన రాజ వంశమునకుఁ జెందినవాఁడు. "మధురాంతకపొత్తపిచోడ", "గండగోపాల" బిరుదునామములతో వీరు దక్షిణదేశమునకుఁ బాలకులైన చోళులకు సామంతులై రాజ్యము చేసినట్లు వీరి శిలా శాసనములు తెలుపుచున్నవి. మనుమసిద్ధి మహారాజు తండ్రి తిక్కనృపతి. తిక్కనృపతి వీరుఁడు. నిజపరాక్రమమున రాజ్యము విస్తరించెను. శంభురాజాదిప్రశస్తారి మండలమును నిగ్రహించి పురమేలెను. కర్ణాటసోమేశుదుర్ధమదోర్గర్వము రూపుమాపి చోళరాజునకు

స్థాయమొనర్చి 'చోళస్థాపనాచార్య' బిరుదు గైకొనెను. తిక్కనృపతి శిలా శాసనములు కాంచిపురమునఁ గూడఁ గన్పించుచున్నవి. ఇతని యాస్థానమునఁ బెక్కండ్రు కవులుండెడివారు. తిక్కన తండ్రి కొమ్మన తిక్కనృపతివమంత్రి. కొమ్మన దక్షిణాపథ రాజ్యరంగమునఁ బరాక్రమవైభవప్రాభవమున వెలసిన తనరాజుగారి పేరును దన కుమారునకుఁబెట్టెను. తిక్కనకవి నామధేయమునకు మాతృక తిక్కనృపతి పేరే.

తిక్కనృపతి క్రీస్తుశకము 1254 సంవత్సరమువఱకు రాజ్యము చేసెను. అతని తరువాత మనుమసిద్ధి శాసనములు క్రీస్తుశకము 1256 నుండి కన్పించుచున్నవి. కావున నిర్వచనోత్తర రామాయణకృతి కాలము క్రీస్తుశకము 1256 తరువాత నని యూహింపవచ్చునను. ఈ విషయమునే నిర్వచనోత్తరరామాయణమునఁ గల యాంతరంగిక సాక్ష్యములను బట్టి నిర్ణయింపవచ్చును. తిక్కన యవతారికలోఁ గృతిపతి మన్మసిద్ధిపరాక్రమ విజయములు వర్ణించినాఁడు. అందుఁ బేర్కొనిన విషయములు కవి కాలానుక్రమముగఁ గూర్చినట్లు తోచుచున్నది.

అవతారికకుఁ జివర కృతిపతి శౌర్యమును

"శృంగారంబు నలంగ దేమియుచు బ్రస్వేదాంకురశ్రేణి లే
దంగంబుల్ మెఱుఁగేద వించుకయు మాహారాష్ట్ర సామంతు సా
రంగుం దోలి తురంగముం గొనిన సంగ్రామంబునం దృప్త
ప్తాంగస్ఫారయశుండు మన్మవిభు పంపై చన్న సైన్యంబునన్"

అని వర్ణించినాడు. ఇందలి సారంగుఁ డద్దంకి సీమకుఁ బాలకుఁడు. ఇతని పేరు శిలాశాసనముల 'సారంగపాణి' అని కానవచ్చుచున్నది. మాధవనాయకుని యనంతరము సింగళదేవ మహారాజు క్రీస్తుశకము 1254 సంవత్సరము వఱకు రాజ్యము చేసెను. సింగళదేవ మహారాజు తరువాత సారంగుఁడు రాజ్యము సల్పెను. క్రీస్తుశకము 1255 సంవత్సరమునుండి సారంగపాణి శిలాశాసనములు కన్పించుచున్నవి. కావున నీ సారంగు రాజుగఁ బేర్కొనిన నిర్వచనోత్తర రామాయణము క్రీస్తుశకము 1255 సంవత్సరము తరువాత, 1256 సంవత్సర ప్రాంతమునఁ దిక్కన మనుమసిద్ధికిఁ గృతి యిచ్చి యుండవచ్చును. ఆనాటికి మనుమసిద్ధి రాజ్యము సల్పుచున్నాడు. తిక్కన మంత్రిత్వము నెరపు చున్నాఁడు. కేతన దశకుమార చరిత్రము కూడ నించుమించుగ నా నాటిదే. దశకుమారచరిత్రమున నిర్వచనోత్తరరామాయణ ప్రశంసలేదు. కావున నది నిర్వచనోత్తరరామాయణమున కీషత్ పూర్వమై యుండవలెను. నిర్వచనోత్తరరామాయణ దశకుమార చరిత్రల యవతారిక లలనాటి తెలుఁగునాటి చరిత్రను నేటికిఁ గూడఁ బ్రతిఫలింపఁ జేయుచున్న యక్షరహర్మ్యములు.

మూలములోఁ గల నరకవర్ణనము. అహల్యాకథ భృగుశాపకథనము మున్నగునవి నిర్వచనోత్తర రామాయణములో లేవు. నృగరాజకథ తిక్కన యొక్క పద్యమున సంక్షేపించెను. శ్రీరాముని వీడ్కొని జనకాదులు తరలుట మూలమున నాలుఁగు సర్గలు. తెలుఁగులో కొన్ని పద్యములు మాత్రమే.

మూలమున రావణబలిసమాగము మున్నగు గాథలైదు సర్గ లధికపాఠములు గలవు. అట్టివాని నెల్ల తిక్కన తెలిగింపక విడిచెను.

మూలమున సీతాపవాదమును శ్రీరాముడు హాస్యగాండ్ర వలన దెలిసికొనును. నిర్వచనోత్తర రామాయణమున సీతాపవాదము నెఱింగించిన భద్రుడు నర్మసచివుఁడు.

సంస్కృతరామాయణము సపరివారముగ రాముఁడు సరయూ ప్రవేశమొనరించి నిర్యాణమొందుటలో ముగియు చున్నది. తిక్కన నిర్వచనోత్తరరామాయణము కుశలవులు రామునితోఁ జేరి రాజవిద్యల నేర్చుటతోఁ గల్యాణాంతముగ నున్నది.

తిక్కన కావ్యమర్యాద ననుసరించి నిర్వచనోత్తర రామాయణమును మంగళాంతము సల్పెను. తిక్కన తన్నుఁ గూర్చి

> ''అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
> ల్పమునం బారగుడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
> తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానై కశీలుండ న
> న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుడఁదిక్కాఖ్యుండ
> సన్మాన్యుఁడన్.''

అని చెప్పుకొనెను.

కేతన దశకుమారచరిత్రలోఁ గృతిపతి తిక్కన, చమూపుఁడు దండాధీశుఁడు.

"సుకవీంద్ర బృంద రక్షకుఁడెవ్వఁడనిన
వీఁడను నాలుకకుఁ దొడవైన వాఁడు
చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన
వీఁడను శబ్దమున కర్థమైన వాఁడు
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁ డనిని
వీఁడని చెప్పుటకుఁ బాత్రమైన వాఁడు
మనుమసిద్ధిమహీశసమస్తరాజ్య
భాగ్యధౌరేయుఁ డభిరూపభావభవుడు
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మి సుతుఁడు
దీనజనతానిదానంబు తిక్క శౌరి"

అని వర్ణించుట మాత్రమే గాక

"కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చ
పరగ దశకుమారచరితంబు చెప్పిన
ప్రోడ నన్ను వేరె పొగడ నేల?"

అని కావ్యశిల్పమునకుఁ దిక్కన మహాకవిని గీటు రాయిగా స్వీకరించెను. ఆ ఖ్యాతి సమకాలమువారివలననే తిక్కన సంపాదింపఁగలిగెను.

నిర్వచనోత్తరరామాయణరచన కాలము నాటికి తిక్కన మంత్రి. మహాకవి. అయిన 'సోమయాజి' యెప్పుడయ్యెను? కేతన, దశకుమార చరిత్రమునాడే

''సరసకవీంద్రుల సత్ప్రబంధము లప్పఁ
గొను నను టధికకీర్తనకుఁ దెరువు;
లలితనానాకావ్యములు చెప్పు నుభయభా
షలయందు ననుట ప్రశంస త్రోవ;
యర్థిమైఁ బెక్కూళ్ళ నగ్రహారంబులు
గా నిచ్చు ననుట పొగడ్త పొలము;
మహితదక్షిణలైన బహువిధయాగంబు
లొనరించు ననుట వర్ణనము దారి;
వరుని కొక్కని కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపు సొంపార నెగడు నట్టి
కొమ్మనామాత్యు తిక్కన కొలఁది సచివు
తింక నొక్కరుఁ డెన్నఁగ నెందుఁ గలఁడు''

అని చెప్పెను.

ఆనాటికే తిక్కన బహువిధయాగములు చేసి మహిళ దక్షిణ లిచ్చినను 'సోమయాజి' కాలే దనియే చెప్పవలెను.

నిర్వచనోత్తర రామాయణము నందలి యాశ్వాసాంత గద్యము దాహరణము ''ఇది శ్రీ మదుభయకవిమిత్ర కొమ్మనామాత్య పుత్ర బుధారాధనవిధేయ తిక్కన నామధేయ ప్రణీతంబైన యుత్తరరామాయణము''...

భారతమునందలి యాశ్వాసాంతగద్యము చూడవచ్చును.

''ఇది ... బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతము''

తిక్కన మహాకవి మనుమసిద్ధి యాస్థానమున మంత్రిగా మాత్రమే గాక, మహాకవిగా మాత్రమే గాక, మహోదార పురుషుఁడై తుల లేని గౌరవప్రపత్తుల ననుభవించెను. తిక్కన పూర్ణ పురుషుడు. మంత్రి, మహాకవి. దండనాథుఁడు, విద్వాంసుడు, వేదాంతి.

ఐతిహ్యము ఈ మహారాజును గూర్చి మహామంత్రిని గూర్చి కమ్మని కథలు చెప్పుచున్నది.

అక్కన్న బయ్యన్నలు, దాయాదులు మనుమసిద్ధి నోడించి రాజ్యము గైకొనిరి. మంత్రి తిక్కన కాకతి గణపతి దేవ చక్రవర్తి కొలువుకూటమునకేగి, యాతని సాయమున మనుమసిద్ధి మహారాజును సింహాసమునఁ బునః ప్రతిష్ఠితుని చేసెనని జనశ్రుతి.

తిక్కన మంత్రి మనుమసిద్ధిమహారాజునకు రాయబారియై గణపతి దేవచక్రవర్తి కొలువు కూటమునకుఁ జేరుటకు ముందే తిక్కన మహాకవి యశస్సు చక్రవర్తి వీనులు సోకినది. గణపతి దేవచక్రవర్తి మహాకవి కెదురేగి స్వాగత మిచ్చినాడు. కవిపూజ సలిపినాడు. మహాకవి తిక్కనవలన భారతామ్నాయము విని, మెచ్చి కవిని వరము కోరుకొనమనినాఁడు. మంత్రి తిక్కన మనుమసిద్ధి మహారాజును సింహాసనమునఁ బ్రతిష్ఠింప వేడికొన్నాఁడు. చక్రవర్తి అనుగ్రహించి స్వయముగా సేనాపతియై తరలి కవి కోర్కి తీర్చినాఁడు. కథ రక్తి కట్టినది. ఇందు తిక్కన గొప్పతనము గణపతి దేవుని రసజ్ఞత ఆంధ్రమహాభారత మహిమ స్వయంవ్యక్తమై, కావ్య కల్పనవలె నున్నది. ఇందలి చారిత్రక సత్యమేమి ? అను ప్రశ్న వచ్చుచున్నది.

సిద్ధేశ్వర చరిత్రమను ద్విపదకావ్యమున నీ కథ గలదు.

సారె సారెకుఁగేరి సన్నుతుల్ చేయ
సార పారావారసరసగంభీర
నారీతి గణపతి నటు చూచు వేడ్కఁ
దిక్కన సోమయా జక్కడ కొకట
దిక్కు దిక్కులనుండి దెరలి విద్యార్థు
లక్క డక్కడను గావ్యముల శ్లోకార్థ
మొక్కొక్క విధమున నొగి వినిపింపఁ
జక్కన వినుచును నొక్క యందలంబు
నెక్కి తిక్కన సోముఁడక్క డేతెంచె
నారీతిగా సోమయాజుల రాక
వారక చని పణిహారులు దెల్ప''
''అట్టి మహాత్ముని నా సోమయాజి
నెట్టన నెదురేఁగి నేర్పుతో రాజు
తెచ్చి యర్ఘ్యాసనస్థితునిగాఁ జేసి
మెచ్చి తాంబూలాదు లెచ్చుగా నిచ్చి

★ ★ ★

అగు భారతాఖ్యాన మా వీరవరులు
తగఁ జేసి నట్టి యుద్ధప్రకారములు
విని యు సంతోషించెఁ గని నట్లు చెప్ప

★ ★ ★

అంతఁ దిక్కన సోమయాజికి మెచ్చి

వింత వస్త్రంబులు వివిధభూషణము
లత్యంత భక్తితో నప్పు డిచ్చుడును
సత్యసంధుండు సభ్యవర్తనుండు
నగు సోమయాజి తా నా రాజు కనియెఁ
దగు మాట విను మొక్క ధర్మకార్యంబు
సూర్యవంశంబున సొబ గొందు నట్టి
యార్యపూజితవర్యుఁ డా మన్మసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల

★ ★ ★

అక్కన్న బయ్యన లధిక బలిష్ఠు
లక్కట సిద్ధిరాయునిఁ బాఱద్రోలి
దక్కిన రాజ్యంబు తామె యేలుచును
నొక్క కాసైనను జక్కగ నీరు
వారల దండించి వారి నెల్లూరు
వారి కొప్పింపు మవారణఁ బ్రీతి
ననిన గణపతి రాజట్ల కా కనుచు
వెడలి గణపతియు విజయంబునకును
గుడి యెడమల సేన కొలిచి యేతేర
వెలవాఁడు చేరియు వీఁడెల్లఁ గాల్చి
వెలనాటి రాజును వెస గెల్చి వాని
యప్పనంబులు గొని యటుఁజని రాజు
గప్పున నెల్లూరు కూడ నేతెంచి

యక్కన బయ్యన నచట సాధించి

★ ★ ★

నెల్లూరి ప్రజలకు నేర్పు వాటిల్లఁ
జెల్లించె నట మన్మసిద్ధి రాజునకు
నెల్లూరు పట్టణంబు నేర్పుతోఁ గట్టి
సల్లలితాద్భుత సమదుర్గములను
నలువ దెనిమిదియు నగు పట్టణముల
నరు దొండ సాధించి యా మన్మసిద్ధి
రాజు కిచ్చియుఁ దన తేజంబు దిశలఁ
బూజ లెక్కఁగ ఘనరాజితయశుఁడు
ఘనతటాకంబుఁ దాఁ గట్టించె నచట''
గొనఁగొని నెల్లూర గొన్నెల లుండి
మనుమసిద్ధికి రాజ్యమహిమలు దెల్పె.''

సిద్దేశ్వరచరిత్ర వ్రాసిన కాసె సర్వప్పకవి క్రీస్తుశకము 1400 సం॥ ప్రాంతము వాఁడు. అనగా తిక్కనకు సుమారు నూరేండ్ల తరువాతి వాఁడు. జరిగిన సన్నివేశమునకు సుమారు నూటయేబది సంవత్సరముల తరువాత వ్రాసినవాఁడని చెప్పవచ్చును.

ఈ కథనే కూచిమంచి జగ్గకవి తన సోమదేవరాజీయమునందు గూఁడ చెప్పియున్నాఁడు.

కాని ఈ కథను యథాతథముగ స్వీకరించుటకు కొన్ని చిక్కులున్నవి. గణపతి దేవచక్రవర్తి క్రీస్తుశకము 1260 సంవత్సరమువఱకు రాజ్యము సల్పెను. అప్పటికి తిక్కన మహా

భారతము నారంభింపలేదని నిశ్చయముగఁ జెప్పవచ్చును. సోమయాజి యయ్యెనో లేదో! అయిన తిక్కన నోట భారతార్థమును ద్వైతాద్వైతత్త్వములు గణపతిదేవుఁడు వినుటెట్లు పొసఁగును ? "అందుచేత సోమదేవరాజీయాదులందు చెప్పఁబడిన భారతశ్రవణకథ కవికల్పిత మనుటకు సందేహము లేదని శ్రీ వీరేశలింగముగారి అభిప్రాయము.

మనుమసిద్ధి రాజ్యభ్రష్టత, తిక్కన రాయబారము, కాకతి గణపతి భారతశ్రవణగాథతో నన్వయించుట పొసఁగదు. తిక్కన, తన బ్రదుకు మలి సంజ వెలుఁగులలో నిష్కామకర్మగ భారతమును హరిహరనాథున కారాధన విశేషముగ సమర్పించెను.

తిక్కన వార్ధకములోఁ గన్నులు కనుపింపని దినములలో భారతము కుమ్మరి గురునాథునిచే వ్రాయించె నని ఐతిహ్యము. పదునైదు పర్వములు ముగించుట కెంతయో కాలము పట్టి యుండును. నిర్వచనోత్తరరామాయణము తిక్కన నడిమి వయస్సులో క్రీ॥శ॥ 1258 ప్రాంతమున రచించెనని చెప్పిన భారతము వార్ధకములోఁ బదమూడవ శతాబ్ద్యంత్యమున గాని, ముగించియుండఁడని యూహింప వచ్చును.

అయిన తిక్కనరాయబారము, భారతశ్రవణగాథ కేవలము కవి కల్పితములా? – కావు.

చారిత్రకముగఁ జూచిన, మనుమసిద్ధి కాకతి గణపతి దేవుని కరుణను కాంక్షించుచున్నట్లు ఒక శిలాశాసనమువలన తెలియు చున్నది.[1]

అక్కన్న బయ్యన్నలు మనుమసిద్ధి రాజ్యము నపహరించుట గూడ యథార్థసంఘటనమే. గణపతిదేవచక్రవర్తి నెల్లూరు రాజుతో చేసికొనిన యొడంబడిక ప్రకారము నెల్లూరు తగులబెట్టి అక్కన్న బయ్యన్నలను జయించినట్లు గుంటూరు మండలమునందలి నాయనపల్లిలోని శిలాశాసనమునఁ గలదు.[2] కాని ఆ శాసనమున శకవర్షముల అక్షరములు అరిగిపోయినవి.

తిక్కన రాయబారము, మనుమసిద్ధి పునఃప్రతిష్ఠాకాలము నిర్ణయించుటకు ప్రత్యక్షసాక్ష్యము లేదు. అయినను మార్గాంతరమున నిర్ణయింపవచ్చును. తెలుఁగు చోడులు దక్షిణ చోళులకు సామంతులు. దక్షిణ చోళుఁడైన వీరరాజేంద్రచక్రవర్తికి మనుమసిద్ధి సామంతుడై యున్నట్లు శిలాశాసనము గలదు.[1] ఆ శిలా శాసనము వీరరాజేంద్రుని పదమూఁడవరాజ్య సంవత్సరము నాటిది. అతఁడు క్రీ॥ శ॥1246 లో రాజ్యమునకు వచ్చెను. అతని పదమూడవ రాజ్యసంవత్సరము క్రీ॥శ॥ 1258 వఱకు మనుమసిద్ధి దక్షిణచోళులకు సామంతుఁడు. గణపతి దేవచక్రవర్తి క్రీ॥ శ॥ 1260 లో మరణించెను. కావున మనుమసిద్ధి క్రీ॥ శ॥ 1258 లో గాని 1259 సంవత్సరమున గాని పదభ్రష్టుఁ డయ్యెనని విశ్వసింప వచ్చును.

శ్రీ కృష్ణుని రాయబారము భారతములో నత్యద్భుతముగఁ జిత్రించు నేర్పు తిక్కన స్వానుభవముచే గడించెను. తిక్కన రాయబారము నెరపి గణపతిదేవుని మెప్పించి మనుమసిద్ధికి రాజ్య

---

1. 1907 సం. 580 సంఖ్యగల శాసనము.
2. 1922 ఠే.... B. 769 సంఖ్యగల శాసనము.

మిప్పించెను. నాటినుండి తెలుఁగు చోడులు కాకతీయ సామ్రాజ్యములోఁ జేరిరి. కాకతీయుల వెల్లఁగొడుగు నీడ పెన్నా నదీజలములోఁ బ్రతిఫలించినది.

తిక్కన గణపతిదేవునకు వినిపించినది సంస్కృతభారతావ్యాఖ్యానమై యుండవచ్చును. నాటికే భారతముమీద తిక్కనకు గల అధికారము జగద్విదితమై యుండును. భారతనీతికి జీవద్ వ్యాఖ్యానము ప్రసాదించిన మహామంత్రి చిరంతనానుభవముచే మహాభారతాంధ్రీకరణమునకు నధికారము సంపాదించుకొనెను. మహేతిహాసరచన సలుపుటకు మహోదారజీవితమును నెరపిన మహాకవికే యధికారము కలదు. అయిన మహాభారతము నాంధ్రీకరించుటకు తిక్కనకు, కవిత్రయమునకు తెలుఁగువారి అదృష్ట వశమువలన నాయధికారము సమగ్రముగ లభించినది.

నిర్వచనోత్తరరామాయణ, మహాభారతరచనాకాలమధ్య మందు తిక్కన వ్యక్తిత్వములో నేర్పడిన పరిణామము గమనింప దగినది. ఆ నాడు తిక్కన మంత్రి, శైవుఁడు, 'మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుడు.'' కేతన గూడ నతని ''చిత్త నిత్యస్థిత శివుఁ''డని పేర్కొనెను. కాని మహాభారతరచన కాలమున తిక్కన సోమయాజి హరిహరనాథోపాసకుఁడు.

మహాభారతమున తిక్కన మంత్రిత్వప్రశంస గాని నిర్వచనోత్తర రామాయణమున తిక్కన యజ్ఞ ప్రశంసగాని లేదు. తొలినాడు తిక్కన, సోమయాజి కానట్లె, మలినాడు మంత్రిత్వము నుండి

---

1. 1907 సం. 580 సంఖ్యగల శాసనము.

విరమించుకొనినట్లూహింపవచ్చును. మహాభారతమున "నీ కరుణ నిట్లు పదస్థుడనైతి" అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిం బాటించు శిల్పమునన్ బారగుఁడ" అని చెప్పుకొనిన అహంభావము, భారత తచన నాటికి

"నా నేర్చిన భంగి చెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్" అను వినయముగా మారినది.

కవి, అంతఃకరణమున నిట్టి మహత్తరశుభపరిణామ వికాస మేర్పడుటకు కొంతకాలము పట్టియుండక తప్పదు.

తెలివి యొకింత గల్గునెడ దృప్తుఁడనై కరి భంగి సర్వమున్
దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితి తొల్లి నే డిటు
జ్జ్వలమతులైన పండితుల సన్నిధి నించుక బోధశాలినై
తెలియని వాఁడనై మెలఁగితిన్ గత మయ్యె నితాంతగర్వమున్

అన్న భర్తృహరిసుభాషితమునకు తిక్కన మహాకవి జీవితము జీవద్ వ్యాఖ్యానమైనది. "విద్య యొసగును వినయమ్ము" అను నానుడికి తిక్కన ప్రాణప్రతిష్ఠ సల్పెను.

నిర్వచనోత్తరరామాయణముకాలమునాడు శైవుఁడుగా నున్న తిక్కన మహాభారతరచనాకాలమునకు హరిహరనాథోపాసకుఁడుగా మారుట గణనీయము. నన్నయ తరువాత ఆంధ్ర వాఙ్మయముననే గాక దక్షిణాపథ సాంఘిక రంగమునందు గూడ శైవయుగ మావిర్భవించినది.

గజనీమహమ్మదు సోమనాథ దేవాలయముపై క్రీ॥ శ॥ 1026 సంవత్సరము జనవరి నెలలో దండెత్తె. అనగా రాజరాజనరేంద్రుడు రాజ్యమునకు వచ్చిన నాలుగు సంవత్సరములకు, భోజమహారాజు రాజ్యమునకు వచ్చిన 27 సంవత్సరములకు, ఆకస్మికముగ సోమనాథ దేవాలయముపైఁబడి కాంచ మణి రత్నరాసుల దోచుకొనిన గజనీమహమ్మదు నెదుర్కొనుటకు భోజమహారాజు దండెత్తి వెళ్ళెను.

గజనీ మహమ్మదు గజనీకి మరియొక మార్గమున సింధులోని యెడారి మార్గములఁ బట్టి పలాయమును సాగించెను. అతని ఆస్థాన చరిత్రకారుని కథనమున "మహమ్మదు డక్కడనుండి గజనీకి, వెళ్లినదారినిగాక, చుట్టు తిరిగి యొక మార్గదర్శకుని సాయమునఁ జేరవలసి వచ్చినది. దీనికి కారణము హిందూరాజయిన పరమదేవుఁడు వెంబడించుటయే. మార్గ మధ్యమున నెన్నియో గుఱ్ఱములు, ఎందఱో భటులు మరణించిరి. ఎన్నియో కడగండ్ల నెదుర్కొనవలసి వచ్చినది." పరమ దేవుఁడు పరమరరాజు భోజరాజే. ముస్లిము చరిత్రకారులు భోజుడు మహమ్మదు నెదుర్కొనినట్లు వ్రాయకపోయినను, భోజుని ఉదయపురప్రశస్తి, యతఁడు తురుష్కుల జయించినట్లు పేర్కొను చున్నది. లేనిచో మహమ్మదు వచ్చిన దారిని బోక, యెడారిలో నానాబాధలు పడనవసరము లేదు.

ఇస్లాము మతమునందు "దేవుఁడొక్కడే ! మహమ్మదని ప్రవక్త" అను సూత్రము ముఖ్యము. ఈశ్వరుఁడు విశ్వపిత అయిన అతని భక్తులందఱు సోదరులే. ఏకేశ్వరోపాసన ఇస్లాముమతానుయాయుల సౌభ్రాత్రమునకు దారితీసినది. గజనీ మహమ్మదు దండయాత్ర విరమించుకొని గజనీకి తరలి పోయినను

ఇస్లాముమత సంపర్కము హైందవభూమిని మఱి కొన్ని సమస్యల రేకెత్తించెను.

విగ్రహారాధకులకు బుద్ధిచెప్పుటకు, వారి సొత్తు కొల్లగొట్టుటకు ఇస్లాము ధ్వజము ప్రతిష్ఠించి దేవునకు, ప్రవక్తకు సంతోషము, విగ్రహారాధకులకు విముక్తి, కల్గించుటకు మరల మహమ్మదువంటి వాఁడెవ్వడో తలయెత్త వచ్చును. గోరీ మహమ్మదు క్రీ॥ శ॥ 1192లో స్థానేశ్వర యుద్ధమున పృధ్వీరాజును జయించి అజ్మీరు రాజ్యము నాక్రమించెను. క్రీ॥ శ॥ 1197 సంవత్సరమున నతని సేనాని విశ్వవిఖ్యాతిఁగన్న నాలందా విశ్వవిద్యాలయమును అందలి రత్నోదధి, రత్నగర్భ పుస్తక భాండాగారములను విధ్వస్త మొనర్చెను. క్రీ॥ శ॥ 1199 లో "పద్మావతీచరణచారణచక్రవర్తి" జయదేవకవి కాశ్రయమిచ్చిన లక్ష్మణసేన ప్రభువును బారఁద్రోలి వంగదేశము నాక్రమించెను. కొలదికాలములో ఉత్తరాపథ మంతయు ముస్లిము సంస్కృతికి, ప్రభుత్వమునకుఁ దోసి లొగ్గినది.

ఉత్తరాపథము దాటి దక్షిణాపథమును గూడ ఇస్లాము సంస్కృతి ముస్లిము దండయాత్ర ముంచివేయకుండ అరికట్టుట అవశ్యకర్త మయ్యెను. హిందూమతము ఆనాడు కులవిభేదములతో, బహుదేవతోపాసనతో నిండియుండెను. అంతచ్ఛిద్రములు సమాజ రాజకీయ జీవితమునఁ గ్రుళ్ళుచుండెను. ఇట్టితరిశైవులు ప్రబలి ఏకేశ్వరోపాసన ప్రతిపాదించి కులవిభేదములకు స్వస్తి పలికిరి. శివుడు పరదైవము. శివుడు విశ్వపిత. శివభక్తులందఱు సోదర సమానులు. కులవిభేదములకు తావు లేదు. పండితారాధ్యునివంటి మహాపురుషుఁడా నాడు

"భక్తి మీది వలపు బ్రాహ్మ్యమ్ముతోఁ బొత్తు
వదలలేను నేను బసవలింగ!." అని చెప్పెను.

శైవులలో అతివాదమతము ప్రబోధించినవాఁడు బసవేశ్వరుండు.

ముస్లిము సంస్కృతి వింధ్యపర్వతపంక్తులు దాటకుండ "హరహరమహదేవ్" "అశ్శరభ శరభ" అని వీరావేశమున శివమెత్తి త్రిశూలఖడ్గధారులై ప్రతిఘటించి నిల్చిన కీర్తి వీర శైవులకు దక్కినది. వీరశైవులు సాంఘిక రాజకీయ వాఙ్మయ రంగము లనేకప్రయోజనము సాధింపనిల్చిన మహోద్యమ ప్రవర్తకులు. అందుచే వారు నన్నయభారతమును స్పృశింపలేదు. వారు బ్రాహ్మణపారమ్యము, సంస్కృతాధిక్యము వర్ణాశ్రమధర్మములు, వైదిక సంస్కృతి నంగీకరింపరు. అప్పుడు దేశమునకు కావలసినది వీరశైవప్రబోధము గాని భారతాంధ్రీకరణముగాదు. శివకవులు, నన్నయ సంస్కృత భూయిష్ఠరచన సేవగించుకొనుటయే గాక "బ్రాహ్మణగార్దభముల, అద్వైత గాడిద' లను దుమ్మెత్తి పోసినారు.

ఆనాడు ప్రగతిశీలు లందఱు శైవులై, ఆ మహోద్యమమునకుఁ దమ జీవితమును శ్రుతిఁగల్పుకొనిరి. దక్షిణాపథమున కాకతీయ సామ్రాజ్యము శైవులు నిర్మించినదే. ఆనాటి చంపుడు గుడులఁబట్టి పరమేశ్వరారాధనకై యెందఱు వీరశైవులు తమ శిరస్సుల చేతులార గండకత్తెరకు బలిదానముగ సమర్పించెడి వారో తెలియనగును. మతసంరక్షణమున ప్రాణము తృణప్రాయము. అది యుగధర్మము. కాలమాహాత్మ్యము.

తిక్కన కూడ తొలినాళ్లలో శైవుఁడే. శైవుల ప్రాణ బలి దానమునకైన సంసిద్ధమగు త్యాగశీలము ప్రతికూల సభ్యతపై, ప్రతీపశక్తులపై, విరోధిసేనలపైఁ బరపిన మంచిదే. కాని సుస్థిర సామ్రాజ్య స్థాపనతో నా యావేశము నంతచ్ఛిద్రములుగా వ్యాపించినది.

శివపారమ్యము నంగీకరింపక వీరశైవుల వీరావేశము నెదుర్కొనినవారు వైష్ణవులు. దక్షిణాపథమున నీ యుభయ మతానుయాయులు కుత్తుకలు దరుగుకొనుట కుద్యమించినారు. జాతీయశక్తి, అంతఃకలహములలో అన్యోన్యమారణ హోమముగా మారసాగినది. తిక్కన మహాకవి ఈ యన్యోన్యకలహోన్మాదము గాంచి అశ్రువులు రాల్చినాడు. నిర్మాణాత్మకమైన కృషి సలుపవలసిన మహాశక్తి వ్యర్థమై పోవుచున్నది. ఆలసించుట కది తరుణము గాదు. తాము శైవుడే. అయిన నేమి ? ఆంధ్రావళి నుద్ధరించుటకై.

"శ్రీ యన గౌరినాఁబరఁగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయతమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూ
పాయి నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్"

అని యెలుఁగెత్తి చాటఁగల్గినాడు. ఇది శివకేశవాభేదాత్మకమైన ధర్మాద్వైతము.

మతోన్మాదము నెదిర్చి, గాంధీమహాత్ముఁడు, "ఈశ్వర అల్లా తేరేనామ్" అని అన్నమాట "విష్ణురూపాయ నమశ్శివాయ" అని తిక్కన అన్న మాటకు కాలానుగుణమైన స్వేచ్ఛానువాదమే.

తిక్కన ఉపాసించిన యీ హరిహరనాథుఁ డెవ్వఁడు? "అని పూని యీ దృశంబు లగు పుణ్యప్రబంధంబులు దేవ సన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధన విశేషంబగుటం జేసి" అను తిక్కన వాక్యముల నాధారముగఁ గైకొని నెల్లూరిలో నాడు హరిహరనాథదేవాలయ ముండెడిదని కొందరు చెప్పుచున్నారు. తిక్కన హరిహరనాథుని "పరతత్త్వము" గనే పేర్కొనినాఁడు. ఇప్పుడెచ్చటను నెల్లూరులో హరిహరనాథదేవాలయుము గాని శిథిలావశేషములు గాని లేవు. కొందఱా యాలయము పెన్నలోఁ గలిసి పోయినదని సమాధానము చెప్పుచున్నారు. కాని తిక్కన, ఎచ్చటను హరి హరనాథుని పెన్నానదీతీరవాసునిగఁ జెప్పలేదు. "హరిహరనాథునకు, భక్తపరతంత్రునకు" "ఏను విన్నపంబు సేయు తెఱంగుగా నంతస్సన్నిధిం గల్పించుకొని, యిమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేసెద" అని వ్రాసినాడు.

తిక్కన వలెనే హరిహరనాథునకుఁ దమ కావ్యముల నంకితము చేసిన కవులు నాచన సోముఁడు. వేంకటనాథుఁడు. ఇరువురుగూడ ఆ హరిహరనాధునితో పాటు నెల్లూరు గాని పెన్నా నదినిగాని పేర్కొనలేదు. వీరిరువురు నెల్లూరువారు కారు. నాచనసోముఁడు "హరి మే లంచు హరుండు మే లనుచు నేలా తర్కముల్" అని శివకేశవాభేదప్రభోదము సల్పుచు, సమన్వయ వేదాంతము ప్రతిపాదించుటకే హరిహరనాథోపాసన నల్పు చున్నట్లు స్పష్టముగఁ బ్రకటించెను. నేటి రంగనాథాలయ ప్రదేశమున పూర్వము హరిహరదేవాలయ ముండెడిదని కొందరి కథనము. హరిహరాలయుము శిథిలము కాగా, రంగనాథాలయ మచ్చట

నిర్మించిరట. ఈ వాదమునందు సత్యము లేదు. రంగనాథాలయము తిక్కనకు ముందునుండి నెల్లూరులో నుండెను.

హరిహర నాథపురము హరిహర లేదా కుడలూరు అనుపురము తుంగభద్రానదీ సంగమునఁ గలదు. ఈ పట్టణము పద్మపురాణ ప్రసిద్ధమైన తీర్థయాత్రాస్థలము. శ్రీ చైతన్యస్వామి శిష్యుఁడైన నిత్యానందుఁడీ పట్టణము సందర్శించెను.

హరిహరక్షేత్రమను నామాంతరము గల సోనేపూరు పట్టణ మిం కొకటి గంగాగండక్ నదీ సంగమస్థానమునఁ గలదు. ఇది వరాహపురాణ ప్రసిద్ధమగు క్షేత్రము.

హరిహరనాథుఁడు తిక్కన మహాభారతమునుండి కన్నడ దేశమునకు వలసపోయెనో పురాణప్రసిద్ధుడైన హరిహరనాథుఁడు కన్నడ దేశమున, గంగాతీరమున, తిక్కన మహాకవి హృదయమందున, ఏకకాలములో వెలసెనో యూహించుట కష్టము. తిక్కన నిష్కారణముగా శైవమును త్యజించి హరి హరనాథుని స్వీకరింపలేదు. తిక్కన శైవుఁడుగా నున్నపుడు నిర్వచనోత్తర రామాయణ కాలముననఁగూడ హరిహరనాథుఁడు ఒకవేళ నెల్లూరివాఁడైన నచ్చటనే యుండి యుండునుగదా. అపుఁడేల తిక్కన, హరిహరనాథుని స్వీకరింపలేదు? తిక్కన ధర్మాద్వైత సందేశమునకు అనువుగ, అవశ్యచారిత్రకభవిత వ్యముగ హరిహరనాథోపాసన సల్పెను.

ఆంధ్రసాంఘిక జీవితమును నిత్యరణక్షేత్ర మెునర్చి, జాతీయశక్తి నంతను వమ్మొనరించుచున్న శైవవైష్ణవ విభేదములకు స్వస్తి చెప్పి, హరిహరనాథోపాసన, శివకేశవాద్వైతము ప్రతిపాదించి

"విష్ణురూపాయ నమశ్శివాయ" అని ఉభయ మతములకు మధ్య నిలిచి, పొత్తు కుదిర్చి నవ్యయుగోదయమున ఉషస్సూక్తము పఠించిన రాయబారి మహాత్రవేం గాడు తిక్కన. జాతీయజీవితమునం నిత్యకురుక్షేత్ర మొనర్చు విప్రతిపన్నశక్తులకు శాశ్వతసమన్వయము, వేదాంతము ప్రతిపాదింప నిలచిన జ్యోతిర్మూర్తియైన "ధర్మాద్వైత్వమూర్తి." మహాభారతము ఈ ధర్మాద్వైతమునే ప్రబోధించుచున్నదని తిక్కన యుద్దేశము. తెలుగు జాతికి ఈ మహాప్రబోధ మందించుటకే "ఆంధ్రావళి మోదమున్ బడయ" తిక్కన ఆంధ్రమహాభారతము "మహాకవిత్వ దీక్షావిధి" నొంది రచించె నని చెప్పుకొనెను.

"విద్వత్సం స్తవనీయభవ్యకవితావేశుండు విజ్ఞాన సం
పద్విఖ్యాతుఁడు సంయమి ప్రవర సంభావ్యానుభావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహితనిష్ఠం బూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైనయామ్నాయమున్"

భారతరచనకు తిక్కన మహాకవికి భవ్యకవితావేశము కల్పించినది ఈ ధర్మాద్వైతత్త్వనిరూపణయే

"వేదములకు నఖిలస్మృతి
వాదములకు బహుపురాణవర్గంబులకున్
వా దైవ చోటులను దా
మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్,"

అని తిక్కన ప్రవచించెను.

ధర్మము ద్వైత మగునా ? ఇక ధర్మాద్వైత మన నేమి ? వేదములు ఉపనిషత్తులు బహుదర్మప్రతిపాదకములు. ధర్మ సూక్ష్మము తెలిసికొనుట కష్టము. అప్పుడు లోకమునకు గతియేమి; 'సత్యంవద' 'అహింసా పరమో ధర్మః' ఇత్యాది ధర్మములు వేదోపనిషత్ప్రోక్తములు. అహింసాధర్మము పాటించు నప్పుడు సత్యవ్రతమునకు భంగమేర్పడ వచ్చును. అప్పుడు పంచమవేదమైన భారతమే మార్గదర్శకమని తిక్కన మహాకవి సందేశము.

ఒక అరణ్యము; అందొక ఋషికులము. అరణ్యామార్గమునఁ బోవు గృహస్థును సంహరించి ధనము నపహరింప దొంగలు వెంటాడుదురు. గృహస్థు ఆ ఆశ్రమమునందలి ఋషి మరుగు చేరును. వెంబడించిన దొంగ గృహస్థు ఉనికి పట్టుల గూర్చి ఋషిని ప్రశ్నించెను. 'సత్యంవద' అన్న వేదవాక్యము పాటించిన "అహింసా పరమోధర్మః" అను ఉపనిషత్ వాక్యమునకు భంజక మగును, ఋషి కర్తవ్యమేమి? ఇచ్చట 'ధర్మాద్వైత్వ' పరిష్కారము పంచమ వేదము సూచించుచున్నది.

"భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చు తత్
భూతభయాస్పదం బగు ప్రభూతపు సత్యము బొంకు నట్ల ప్రా
ణాతురుఁ డైనచో పరిణయంబున యందున పల్కు బొంకు స
త్యాతిశయంబ యండ్రు మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్ముముల్.

రెండు ధర్మములు విప్రతిపన్నములై యున్నపుడు దేని ననుసరింప వలెను ? ధర్మము ఒకటియే కదా! అందేది "పరమ ధర్మమో" దానిని అనుసరింపవలెను. స్వార్థమును కుటుంబము

కొఱకై, దేశమును విశ్వముకొరకై, విశ్వమును సత్యము కొఱకై త్యజింప వలెను. ఈ త్యాగమే పరమధర్మము. చిన్న ధర్మమును పెద్ద ధర్మముకొఱకై త్యజించుటయే ధర్మాద్వైతము. ఏదియో యొక ధర్మము చేయుట గాని, ఏ ధర్మమును స్వీకరింపక యుపేక్షించుట గాని కర్తవ్యము గాదు.

"కేవల నిష్కర్మత మో
క్షావహమగు నేని గిరులు నవనీజములున్
భూవర ముక్తిం బడయం
గా వలవదె యడవి నునికి కైవల్యదమే!"

తిక్కన మహాకవి మానవుడు కర్మవీరుఁడై జీవితరణ క్షేత్రమున విజయుడు కావలె ని యుద్బోధించెను. కర్మ సన్న్యాసమునకు విపరీతార్థము ప్రవచించి, కేవల సన్న్యాసమే మోక్షావహమని భారత మాదేశింప లేదు. జీవితమునందుండి మానవుడు ముక్తుఁడు కావలెను. జీవితమునుండి తరించుటకు మార్గము జీవితమే. కర్మయోగమే. కర్మవీరతయే.

"ఫలముల యెడ బ్రహ్మార్పణ
కలన పరుం డగుచు కార్యకర్మము నడపన్
వలయుం దత్త్వజ్ఞానము
దలకొనినం గర్మశమము దానై కలుగున్."

అని తిక్కన సందేశము.

తిక్కన మహాభారతము చేఁబట్టుటకు కారణము మహాభారత వేదాంతము. అతని జీవిత వేదాంతములో

సంగమించుటయే, తిక్కన మానవజాతి కందింపఁ దలపోసిన ధర్మాద్వైతమునే భారతము ప్రబోధించుచున్నది. అందుచే రెండు శతాబ్దాలు నిల్చి యున్న మహాభారతమును దిక్కన మహాకవి చేఁబట్టుట కేవలము యాదృచ్ఛికము గాదు. తిక్కన సమకాలీన జగత్తునకు విశ్వమానవలోకమునకు అందింపఁ దలపోసిన జీవిత వేదాంతమే అం దిమిడి యున్నది.

తిక్కన అనుష్ఠానవేదాంతి. తెలుఁగు జాతి క్రియాశూరులై కర్మవీరులు కావలెను. అదియే మానవ పరమధ్యేయము. అనుష్ఠానపరమైన కర్మయోగమే ధ్యేయమైన నేది యాచరణీయమో ముందు తెలిసికొనవలెను. మానవుఁడు తొలుత జ్ఞానియై, తత్త్వజ్ఞానము నలవరచుకొని, విప్రతిపన్నములైన ధర్మముల నుధ్య పరమధర్మము నేరుకొని అనుష్ఠింపవలెను. జ్ఞానము వెనువెంట కర్మానుష్ఠానము. ఈ అనుష్ఠానము మాత్రము బ్రహ్మార్పణ బుద్ధితో, అహంకారత్యాగముతో సలుప వలెను. తిక్కన సందేశమునఁ గర్మాచరణమే యోగ సాధన. జీవితమే కురుక్షేత్రము. కురుక్షేత్రము ధర్మక్షేత్రము. సంకులధర్మసమర క్షేత్రము.

ఈ ధర్మాద్వైతమును ఒకనాడు వేదవ్యాసమహర్షి భారత వర్షమున నెలుగెత్తి చాటినాఁడు. అందుచే భారత వర్షము కర్మభూమి, పుణ్యభూమి యని ప్రసిద్ధి నొందినది. తరువాత అపర వేదవ్యాసుడు తిక్కన మహాకవి తెలుఁగు భూమిలో ధర్మాద్వైత ప్రతిష్ఠాపకుఁ డయ్యెను. అందుచే దేశ భాషలలో నెక్కడలేని ప్రాధాన్యము; ప్రతిష్ఠ; తెలుఁగు భారతము సంపాదించుకొనఁ గలిగినది. భారతదేశ జాతీయగ్రంథము భారతము. భారతధర్మమును అవగత

మొనర్చుకొనిన కవిత్రయము వారి చేతిలో తెలుఁగు భారతము పడుట తెలుఁగువారి అదృష్టము. తెలుఁగు భూమిలోఁ గూడ జాతీయ గ్రంథము భారతమే.

ఈ ధర్మాద్వైతమును ఈ సమన్వయ వేదాంత ప్రబోధము ఆంధ్రభూమిలోనుండి ఆంధ్రవాఙ్మయములోనుండి వెలువడుటలో మిక్కిలి యౌచిత్యమున్నది. తెలుఁగుదేశము భారత వర్షములో నడి బొడ్డున నున్నది. ఔత్తరాహుల హృదయము దాక్షిణాత్యుల మెదడు అటు ఆవేశము; ఇటు ఆలోచన; అటు భావావేగము; ఇటు క్రియాశూరత తెలుగునాట సంగమించుచున్నవి. ఈ మహాకవి ఆదర్శాంధ్రుఁడు. తెలుఁగుదనము మూర్తిభవించిన మహాకవి. అటు హరిహరనాథోపాసనచే భక్తిని ఇటు భగవద్గీతాపరమ్మైన భారతరచనతో ధర్మాద్వైతమూలకమ్మైన అనుష్ఠానవేదాంతము ప్రబోధించిన భక్తుఁడు; కర్మ వీరుఁడు.

భక్తికిఁ గొందఱు తేలిక అర్థము చెప్పుచున్నారు. కాని తిక్కన జ్ఞానయోగియై అనుష్ఠానవేదాంతి యైన భక్తుఁడు. తిక్కన భక్తి, జ్ఞానులకుఁ గర్మవీరులకు మాత్రమే అందునది.

పోతన మహాకవి;

''కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ''

అని భక్తితన్మయుఁడై పలుకఁ గలిగెను.

భక్తిరసతరంగితహృదయులై పులకాంకురప్రకరవములతో తెలుఁగువా రీ మహాకవి పద్యములను నిత్యపారాయణము చేసినారు. ఈభక్తి ఆవేశప్రధానమైనది. తిక్కన భక్తిలో ఆలోచన, ఆచరణ ముఖ్యము. తెలుఁగు దేశములో భారతమున కంటె భాగవతము జనరంజకముగా నుండుటకు హేతువు అనుష్ఠానము గానముకంటె, కర్మయోగము భక్తిమార్గముకంటె, కష్టమగుటయే. తెలుఁగువారు తిక్కన సందేశమను గ్రహింపవలెనన్న ఆవేశము నణంచి ఆలోచనతో క్రియాశూరులు కావలెను.

రాజరాజ నరేంద్రుఁడు మహాభారత మాంధ్రీకరింపుమని కోరినపుడు, నన్నయ చెప్పిన సమాధానము గమనింపఁ దగినది.

''అమలిన తారకాసముదయంబుల నెన్నను సర్వవేదశా
స్త్రముల యశేషసారము ముదంబున బొందను బుద్ధిబాహు వి
క్రమమున దుర్గమార్థజల గౌరవభారతభారతీసము
ద్రము దరియంగ నీదను విధాతృనకైనను నేరఁబోలునే''

నన్నయ మహాకవి తాను భారతభారతీ సముద్రము దరియంగ నీద లే నని యారంభించుటకు ముందే తెల్పెను. అంత మాత్రమే గాదు. అది విధాతృనకైనను నేరఁబోలదు. ఒకవేళ భారత భారతీ సముద్రము నీదఁ గల బ్రహ్మయున్న నతఁడు ''కవిబ్రహ్మ'' యే గావలెను. అట్టియెడ నన్నయ తన తరువాత రెండువందల సంవత్సరముల పిమ్మట నుద్భవించు కవిబ్రహ్మ గూడ భారత భారతీసముద్రము దరియంగనీదబోలఁ డని ముందుగనే విధించెనా ?

తిక్కన మహాకవి, నన్నయ మహాకవి వాక్కుమీఁదగల గౌరవముచేఁ బదునైదు పర్వములు తెనిగించి యరణ్యపర్వశేషము పూరింపక విడిచిపుచ్చవలెననియే విడిచిపుచ్చెనా ?

కొందఱు నన్నయ అరణ్యపర్వము తెనిగించుచు మరణించె ననియు అందుచేఁ దరవాతి కవులెల్లరు మహాభారతము స్పృశింపలేదనియు వింత వాదము లేవదీసినారు. అయిన, ఆ రెండువందల యేండ్లలో నెవరైన తిక్కన వలె విరాటపర్వమునే యారంభముగాఁ గొని భారతము నేల తెనిగింపలేదు ? ఆ రెండు శతాబ్దులు, ఆంధ్రవాఙ్మయ చరిత్రలో, సాంఘిక రాజకీయ రంగాలలో శైవయుగము. శైవకవులు భారతము స్పృశింపక పోవుటకుఁ గల కారణములు తేట తెల్లములే.

తిక్కన అరణ్యపర్వమును విడిచి పుచ్చుటకు మరియొక కారణముగూడ నుండ వచ్చును. నన్నయ ఆ పర్వమును రాజ రాజనరేంద్రున కిదివరకే యంకిత మొనర్చియుండెను. తిక్కన దానిని తెనిగించిన రాజరాజున కంకిత మీయవలదా? హరిహరనాథున కిచ్చిన భుక్త శేషము గాదా? ఎఱ్ఱాప్రెగ్గడ తెనిగించి నపుడు అందుచేతనే అరణ్యపర్వమును రాజరాజనరేంద్రునకే అర్పించెను. తిక్కన దత్తశేషము ఈశ్వరార్పణ చేయుట కిష్ట పడక వదలి వేసెనని చెప్పవచ్చును.

కొందఱు నన్నయ్యయే అరణ్యపర్వము నిశ్శేషముగా రచించెనని, యవతారికలోని తిక్కన పద్యము నాధారముగాఁగొని చెప్పుచున్నారు.

"ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృతమై పెనుపొంది యుండ నం
దాదిం దొడంగి మూఁడు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్"

తిక్కన మూఁడుకృతులు అని సమూహము మీఁద చెప్పను గాని రెండు కృతుల పై చిల్లర యని చెప్పవలెనా? అదియునుగాక, తిక్కన నాటికున్న యరణ్యపర్వము, నేబది సంవత్సరముల లోపున నెఱ్ఱాప్రెగ్గడ కాలము నాటికి అంతరించి పోవునా? ఒక్క ప్రతులన్నియు నేక కాలములో శారదరాత్రు లను పద్యము తరువాత మాత్రమే పోవునా? లేదా, ఎఱ్ఱాప్రెగ్గడ పూరించుటయే యసత్యకథనము కావలె. చరిత్ర యంతయు దీనికిఁ బూర్వపక్షమే.

తిక్కన మహాకవి, నన్నయభట్టు మహాకవిని, అవతారికలో మిక్కిలి భక్తితో స్మరించెను. "ఆంధ్రకవిత్వ విశారదుండు విద్యాదయితుండు మహితాత్ముఁడు" నన్నయభట్టునెడ గల భక్తిని శంకించు చున్నారు. ఇట్టి కుశంక ఉభయకవులకు ద్రోహము. మహితాత్ముఁడైన నన్నయభట్టు మీఁద గాని ఆ విద్యాదయితుండు తెనిగించిన కృతులమీద గాని గౌరవము తిక్కనకు లేనిచో నతడామూలచూడముగ భారతము తెనిగించియుండును. పదునైదుపర్వములు తెనిగించిన తిక్కన మహాకవికి మఱి మూఁడు పర్వములు బరువా!

తిక్కనకు నన్నయ మహాకవిమీఁద, ఆ మహాకవి రచించిన భారతభాగముపై మిక్కిలి గౌరవ మనుటకు సారస్వత సాక్ష్య మున్నది.

"అనుకరణమే యే రచయిత యెడ నైనను ప్రదర్శింపఁగల అత్యుత్తమ గౌరవము" అని యొక ఆంగ్ల సుభాషితము గలదు. తిక్కన ఎన్నియోచోట్ల నన్నయ ననుకరించి, ఆ మహాకవికి మన్ననఁ దెలిపెను. నన్నయ దిద్దిన యొరవడినే ననుసరించి, తిక్కన మహాభారతము "తెనుఁగు బాస" వినిర్మింపఁ బూనెను. కవిత్రయము వారి యాంధ్రమహాభారతము వ్యాసమహాభారతమునకు కేవలానువాదము గాదు. యథోచితానుసరణము.

తిక్కన ఉత్తరరామాయణము నిర్వచనముగా వ్రాయుటకు గద్యపద్యసంస్కృతభూయిష్ఠరచన సర్వసామాన్యము గాదను శివకవుల యాక్షేపణప్రభావమే కారణము. కాని, నన్నయ మహాకవి ప్రభావము తిక్కనపై భారతరచననాడు సంపూర్తిగఁ బ్రసరించెను.

తిక్కన మహాకవి భారతమ్మున నన్నయ 'చంపు' పద్ధతినే యనుసరించి, "పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్" అని నిర్వచనధోరణి మార్చుకొనెను.

అంతియు గాక శివకవుల ప్రచారసాహిత్యదృష్టిని మార్చి, నన్నయ సాహిత్యదృష్టినే తెలుఁగు నాట పునః ప్రతిష్ఠ గావించెను. తిక్కన కృత్యాదిని గావించిన వేదవ్యాసమహర్షిస్తోత్రమునకు నన్నయ కావించిన వేదవ్యాసప్రశంసయే మేలు బంతి. నన్నయ జనమేజయసర్పయాగఘట్టమున ఆస్తీకునిచేఁ బల్కించిన పద్యము.

"విద్యన్ముఖ్యుఁడు వేదమూర్తి త్రిజగద్విఖ్యాతతేజుండు కృ
ష్ణద్వైపాయనుఁ డేగుదెంచి సుతశిష్యబ్రహ్మసంఘంబుతో
సద్వంద్యుండు సదస్యుఁ డయ్యె నని నన్ శక్యంబె వర్ణింప సా

క్షాద్విష్ణుండవ నీవు భూపతులలోఁ గౌరవ్యవంశోత్తమా!''

తిక్కన కృత్యాదిపద్యమున నన్నయ వాడిన "ద్వ" కార ప్రాసమును శార్దూలవృత్తమునుగూడ గ్రహించి, కృష్ణద్వైపాయన ప్రశంస సల్పెను.

''విద్వత్సంస్తవనీయభవ్యకవితావేశుండు విజ్ఞాన సం
పద్విఖ్యాతుఁడు సంయమిప్రవరసంభావ్యానుభావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థిలోకహిత నిష్ఠం బూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్

దీనిని బట్టి నన్నయపద్యము తిక్కన యంతఃకరణము నావేశించి, యెట్లు పునరవతారము నెత్తెనో స్వయంవ్యక్తమగుచున్నది.

నన్నయ సభాపర్వమున దుశ్శాసనుఁడు ద్రౌపదికి సల్పిన పరాభవమును

''ఆ వనజాననం గురుకులాపశదుండు కడంగి రాజసూ
యావభృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా
రావళిఁ జేసి పావనములైన శిరోజములం దెమల్చి పా
పావహుఁడీడ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమ మంది చూడఁగన్''

అని వర్ణించిన పద్యము తిక్కన మనఃఫలకముపై నెట్లుహత్తుకొనెనో గుర్తింపవచ్చును. తిక్కన యా సన్నివేశమునే ద్రౌపదినోట శ్రీకృష్ణునకు జెప్పించిన పద్యము స్మరణీయము.

నీవు సుభద్రకంటెఁ గడు నెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయు దిట్టినను బంకజనాభ యొకండు రాజసూ

యావభృథంబునందు శుచియై పెనుపొందిన వేణిఁబట్టి యా
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చె కులాంగన నిట్లొనర్తురే.

ఇందలి వకారప్రాసము, 'రాజసూయావభృథంబునందు' శుచియై పెనుపొందినవేణి మున్నగు పదగుంఫనములు ప్రాతఃస్మరణీయుఁడైన నన్నయకు తిక్కన దెలిపిన మన్నన.

వేదవ్యాస, నన్నయు ప్రశంసల తరువాత తిక్కన కృత్యాదియందుఁ దన స్వప్నవృత్తాంతము పేర్కొనును.

తిక్కన స్వప్నవృత్తాంతము మహాభారతరచనమున, ఆంధ్ర వాఙ్మయమున, మిక్కిలి ప్రాముఖ్యము వహించినది. ఎందరో కవులు, తిక్కన ననుకరించి తమ గ్రంథారంభము నొక స్వప్నకథతో ముడి పెట్టినారు.

ఆంధ్రవాఙ్మయమున నెన్నియో గ్రంథములకుఁ దత్కవుల స్వప్నములే యుత్పాద్యప్రకృతులు. ఏ ముహూర్తమున తిక్కన కా స్వప్నము వచ్చినదో తరువాత యుగముగ్గాంతరముల కా స్వప్నకథ సాహిత్యసంప్రదాయమై నిలిచి, కవులు కలలు గనుచునే యున్నారు. కలలు కవులను వెంబడించుచునే యున్నవి.

తిక్కనకు స్వప్నమున హరిహరనాథసాక్షాత్కారము కలిగినది. ఈశ్వరసాక్షాత్కారము సంభవమని అధునాతనులు కొందఱు నమ్మక పోవచ్చును గాని స్వప్నసాక్షాత్కారమును నమ్ముట కెవరి కెట్టి యభ్యంతర ముండనవసరము లేదు. మనోధర్మపరిజ్ఞాతలు స్వప్నమనస్తత్త్వము పరిశోధించి కొన్ని సిద్ధాంతముల నేర్పరిచి యున్నారు.

తిక్కనకు స్వప్నమున సాక్షాత్కరించిన హరిహరనాథుఁడతనికిఁ బూర్వపరిచితుడే. అంతకు ముందే తిక్కన హరిహరనాథునిగూర్చి

"కి మస్థిమాలాం కిము కౌస్తుభం వా
పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్
కిం కాలకూటః కిము వా యశోదా
స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే"[1]

అని సంస్కృతశ్లోకమునఁ బ్రస్తుతించి యుండెను. స్వప్నమున హరిహరనాథుని తిక్కనకుఁ దండ్రియగు కొమ్మన పరిచయము గావించును.

"కరుణారసము వొంగి తొరఁగెడు చాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువార,
హరినీలపాత్రిక సురభిచందనమున
గతి నాభి ధవళపంకజము మెఱయ,
గుఱియైన చెలువున నెఱసిన లోకర
క్షణ మనంగ గళంబు చాయ దోఁపఁ
బ్రథమాద్రి దోఁతెంచు భానుబింబము నా ను
రమ్మునఁ గౌస్తుభరత్న మొప్ప
సురనదియును గాళిందియుఁ బెరసి నట్టి
కాంతిపూరంబు శోభిల్లు శాంతమూర్తి
నా మనంబు నానందమగ్నముగఁ జేయ
నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు."

అని తిక్కన వర్ణించెను. అప్పుడు

"జననమరణాదులైన సంసారదురిత"
ములకు నగపడ కుండంగఁ దొలఁగు తెరువు
గను వెలుంగు నీ కిచ్చితి ననిన లేచి
నిలిచి సంతోష మెదనిండ సెలవు కొనఁగ."

మేల్కొంచి తిక్కన మహాభారతము నాంధ్రభాష వినిర్మింప నుద్యమించెను.

కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావలి మోదముం బొరయు నట్లుగ సాత్యవతేయసంస్మృతి
శ్రీ విభవాస్పదం బయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్

అని యజ్ఞారాధనప్రవణమైన దీక్షతోఁ బదునేను పర్వములఁదెనుఁగుబాస 'జనసంప్రార్థ్యంబులై పెంపునం దుది ముట్టన్ రచియింపు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్" అని తిక్కన మహాభారతము నారంభించెను.

"ఆంధ్రావళి మోదముం బొరయు" "మహాకవిత్వదీక్షావిధి" "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుఁడ నయ్యెద భక్త కోటికిన్" "ధర్మాద్వైతస్థితి" "ఆరాధనవిశేషము" మున్నగు ప్రయోగములు విశేషార్థవంతములు. తిక్కన ఆత్మీయతాదీపకములు.

---

1. ఓ ప్రభూ : అలంకారార్థము నీవు ఎముకల దండ కోరుకొందువా ? కౌస్తుభము కావలెనందునా? నీకు కాలకూటము రుచించునా? లేక యశోదాస్తన్యమా ? వచింపుము.

మహేశ్వరాంఘ్రికమలధ్యానైక శీలుఁ డైన తిక్కన శైవము విడిచి 'విష్ణురూపాయ నమశ్శివాయ' యని హరిహర నాథోపాసన సల్పి మహాకవిత్వదీక్షావిధి నొందుటకు అతని మనస్తత్త్వమునఁ గలిగిన దివ్యపరిణామవికాసమునకు, దోహద మొనర్చిన కారణము లెవ్వియో అనుశీలనార్హములు. అప్పుడు అతని స్వప్నకథలోని అంతరార్థము స్వయంవ్యక్త మగును.

హరిహరనాథుని గూర్చి తిక్కన మననము చేయుచునే కొంతకాలము గడపి యుండవలెను. తిక్కన రచించిన ధ్యానశ్లోకమే యందులకు నిదర్శనము. తిక్కన నిదిధ్యాసయందు స్థిరరూపము దాల్చిన హరిహరనాథుఁడే స్వప్నరూపమున నాతనికిఁ బ్రత్యక్ష మయ్యెను.

"ఓంకారవాచ్యునకు నన
హంకారనిరూఢభావనారాధ్యునకున్
హ్రీంకారమయమనోజ్ఞా
లంకారోల్లాసనిత్యలాలిత్యునకున్"

ఆ హరిహరనాథుఁడు భావనాతీతుఁడు. శ్రుతిసీమంతమణి. ఆ హరిహరనాథుని గూర్చిన సంబోధనఁబట్టి తిక్కన మనఃపరిపక్వత యూహింపవచ్చును.

"నాదామృతధారాసారరూప !" "వేదవ్యాస వ్యంజిత విహార!" "సంతతానందసాంద్రా !"

మహాగాయకునకుఁ బరబ్రహ్మము నాదమే. అతఁడు నాదబ్రహ్మోపాసకుడు. తమ యుచ్ఛ్వాసనిశ్వాసముల నాద బ్రహ్మము

నుపాసించి, తమ గుండెను నాదబిందుకళాస్వరూపుని నయయనద్యుతులతో శ్రుతి గల్పుకొని ధన్యులైనారు త్యాగరాజువంటి గాయకులు. కాళిదాసమహాకవి ఈశ్వర స్తవము సల్పుచు

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ"

అని కీర్తించెను.

మహాకవికి పరమేశ్వరుఁడు అర్ధనారీశ్వరుఁడై 'వాగర్థముల' వలె సాక్షాత్కరింపక తప్పదు. పరమేశ్వరునకు వాగర్థములకు అభేద మేర్పడినది. కాళిదాసకవి కవితతో తాదాత్మ్యమున్ చెందినాడు.

అట్లే తిక్కన మహాకవికిఁ గల్గిన హరిహరనాథ సాక్షాత్కారము ననుశీలించినచో నాతని ఆత్మీయత అవగతమగును. తిక్కన హరిహరనాథుఁడు "నాదామృతధారాసారరూపుఁడు." నాదము అమృతధారావాహినియై తత్సారము రూపము గొన్నది. నాదమందలి అమృతత్వమును అక్షరరూపమున ప్రస్తరించి సారవంతము చేయుటయే కవిత. తిక్కన హరిహరనాథుని రూపమునఁ గవితోపాసననే సల్పెను. తిక్కనకు హరిహరనాథుఁడుగూడ నాదామృతధారాసార రూపుఁడుగనే సాక్షాత్కరించెను. అట్లే హరిహరనాథుని తిక్కన 'వేదవ్యాస వ్యంజితవిహార' అని స్తుతించెను.

ఇచ్చటఁగూడ తిక్కన ధర్మాద్వైత మభివ్యక్తమగు చున్నది. స్థూలదృష్టికే హరిహరులిద్దరు. సూక్ష్మదృష్టికి ఒక్కరే. సూక్ష్మదృష్టికి వేదములకు స్మృతులకు నచ్చటచ్చట వైరుధ్య మేర్పడుచున్నది.

సూక్ష్మదృష్టికి వేదోక్తధర్మ మొక్కటే. వేదవ్యాసుఁడే వేదముల నిరూపించి, పురాణముల సృష్టించినాఁడు. అంతట నంతర్వాహినిగా నున్న ధర్మమొక్కటే. అతఁడే యీ ధర్మాద్వైతము ప్రస్ఫుటము చేయుటకై పంచమవేదమైన మహాభారతము వ్రాసెను. తిక్కన దృష్టిలో ఈ ధర్మాద్వైతమునకు హరిహరనాథుఁడు ప్రత్యక్షదైవము.

'సంతతానందసాంద్రా!' తిక్కన ప్రతిపర్వాంతమునందలి యాశ్వాసాంతపద్యముల "ఆనంద" శబ్దమును వాడెను. ధర్మాద్వైతమున కీ వికారమయమైన జీవితము, ద్వంద్వబద్ధమైన ప్రాణికోటి అవ్యవస్థితమైన సృష్టి యంతయు, రూపాంతరము నొంది ఆనందమయముగనే సాక్షాత్కరించును. ఈ ఆనందోపాసన జీవన్ముక్తులకే సాధ్యము. తిక్కన జీవన్ముక్తుఁడు. "జన్మాంతర దుఃఖముల్" దొలఁగు నట్లుగ ధర్మాద్వైత స్థితి భారతామ్నాయము రచించి ఆనందోపాసన సల్పెను.

నిత్యప్రకాశుఁడు యోగానుభావ్యుఁడు నైర్గుణ్యగణ్యుఁడు కేవల భావానందమయుఁడునైన, హరిహరనాథుఁడు కౌస్తుభము నస్థిమాలగూడ ధరించి నెడ నెడ సాక్షాత్కరించును. అవాఙ్మానసవేద్యమైన పరతత్త్వము నభివర్ణించుటకు, మాటలు తెల్పలేని మహత్త్వము ప్రతిపాదించుటకు, కవియోగులు ప్రపంచ మందెల్లడ ఛాయావాదమును స్వీకరించిరి. ఈ ఛాయావాదము నందలి ప్రయోగము లనుభవైకవేద్యములు.

తిక్కన యాత్మీయతలో నిట్టి మహోజ్జ్వలపరిణామ వికాసము భారతరచనకు ముందు, నిర్వచనోత్తర రామాయణమునకుఁ దరువాత, నేర్పడినది. ఈ మధ్యకాలమున మనుమసిద్ధి గతించినాడు.

తిక్కన యజ్ఞము చేసి సోమయాజి యయ్యెను. దేశమునందుఁగూడ ఎన్నియెూ చారిత్రక పరిణామము లేర్పడినవి. అవియన్నియు మననశీలియైన తిక్కన మానసిక పరిణామ వికాసమునకు దోహదము కల్పించి యుండవచ్చును.

మనుమసిద్ధి యవసానకాలమున జరిగిన యుద్ధము కాటమరాజు కథగా ద్విపదఁలో బ్రతిష్ఠితమైనది. ఆ ద్విపదపంక్తు లలనాటి సాంఘిక రాజకీయ స్థితిగతుల ప్రతిఫలించు అద్దాల మేడలు, ఆ యుద్ధము గూర్చి, ఆ యుద్ధమునఁ బాల్గొనిన మహావీరుల గూర్చి, దేశములో వ్యాపించిన చాటువులుగూడ తిక్కననాటి వీరపురుషుల యుగము కన్నులఁ గట్టు నట్లు వర్ణించుచున్నవి. కాటమరాజు కనిగిరి సీమలోని యెఱ్ఱగడ్డపాడున కధిపతి. పెద్దిరాజు కొడుకు. యాదవంశీయుఁడు. ఇతడు అనావృష్టి కారణమున దక్షిణమున నున్న మనుమసిద్ధి యడవులు పుల్లరి చెల్లించి పశువుల మేపుకొనుటకుఁ బుచ్చుకొనెను. కాని, కాటమరాజు పుల్లరి చెల్లింపలేదు. మనుమసిద్ధి అన్నంభట్టును రాయబారిగాఁ బంపి పుల్లరి చెల్లింపఁ గాటమరాజు నడిగెను. కాటమరాజు, మనుమసిద్ధి శత్రువులతోఁ గలిపి పుల్లరి చెల్లింప నిరాకరించెను. మనుమసిద్ధి మహారాజుగారి వేశ్య పెంపుడు చిలుకను కాటమరాజు పసువుల కాపరులు పట్టుకొని యల్లరి చేసిరనిగూడ జనశ్రుతి కలదు.

ఇట్లు కాటమరాజు కథ చిన్ని తగవుగా నారంభమై చివరకు మహారణముగా పరిణమించినది. తిరునామాల తిప్పరాజు, శ్రీకంఠరాజు, పెదవేఁగి చొక్కరాజు, పెద వరదరాజు, అర్లకొండ అచ్చిరాజు, అదివన్నె మాదిరాజు, గయకొండ గంగ రాజు, ఉర్లకొండ

సోమన్న, ఉదయాద్రి అమ్మయ్య, చెన్న పట్టణము చంద్రశేఖరుఁడు, దేవముని వెంగళయ్య, పట్టుకోట బసవరాజు, కాళహస్తి పాప తిమ్మరాజు, వెలకంచి వెంగళపతిరాజు, ప్రభగిరి పట్టణము పద్మశేఖరుఁడు, మున్నగు వీరులు మనుమసిద్ధి పక్షము చేరిరి. మనుమసిద్ధి సేనలకు ఖడ్గతిక్కన సేనాపతియై నడిపించినెను. ఖడ్గతిక్కన పెద తండ్రి సిద్ధనమంత్రి కొడుకు.

కాటమరాజు పక్షమునఁగూడ పల్నాటి ప్రభువు పద్మ నాయఁడు, పల్లికొండ ప్రభువు చల్ల పిన్నమనాయఁడు, దొనకొండ అయితమరాజు, ఎఱ్ఱయ్య, భట్టావుల రాజు, కరియావుల రాజు, వల్లభన్న నాళకూళ్లనాయఁడు, ముమ్మయ్య నాయఁడు, పుత్తరాజు, మున్నగు వీరులు చేరిరి.

కాటమరాజు సేనలకు సేనాధిపతి బ్రహ్మరుద్రయ్యయను నారాధ్యబ్రాహ్మణుడు. ఉభయసైన్యములు పాలేటి యొడ్డుననున్న పంచలింగాల కడ నెదుర్కొనినవి. ఘోర యుద్ధము జరిగినది. ఇరుపక్షముల భటులు, వీరులు మరణించిరి.

చిట్ట చివరకు మనుమసిద్ధిపక్షమున, యుద్ధభూమిని ఖడ్గతిక్కన యొక్కఁడే మిగిలియుండుట పిన్నమనాయఁడు గాంచి

''పోరు నిలుపుమోయి భూసురోత్తముఁడ !
సరిగాదు మాతోడఁ సమరంబు చేయ;
అగ్రజుల్ మీరు యాదవులము మేము
ఉగ్రమ్ము మా మీఁద నుంపంగరాదు.''

అని పలికెనని కథ.

ఖడ్గతిక్కన చేయునది లేక, గుఱ్ఱమును మరలించి యిల్లు చేరినంత, వీరపత్నియగు నాతని భార్య, యతనికి స్నానోదకములతో పాటు పసుపు ముద్దనుగూడఁ బెట్టి నులకమంచము చాటుంచి,

''పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులందున్;
ముగు రాడు వార మైతిమి
వగ పేటికి జలక మాడ వచ్చిన చోటన్''

అని అధిక్షేపించెనట.

వీరమాతయగు తల్లిగూడ నన్నము పెట్టుచు విరిగిన పాలు పోసి

''అసదృశమగ నరివీరులఁ
బసమీఱఁగ గెలువ లేక పందక్రియన్ నీ
వసి పైచి విఱిగి వచ్చినఁ
బసులున్ విఱిగినవి తిక్క పాలున్ విరిగెన్.''

అని పరిహసించె నట.

అటు పిమ్మట, ఖడ్గతిక్కన యేకాకియై యుద్ధభూమిని జేరి విజయమో వీరస్వర్గమో యని బోరి, వీరస్వర్గ మలంకరించెనని చెప్పుదురు. ఆ యుద్ధము ఖడ్గతిక్కన పరాక్రమము, ఆనాడు మిక్కిలి ప్రఖ్యాతి వహించి, ప్రజల మనస్సులపై మిక్కిలి ప్రభావము వహించెననుటకు, చాటుపద్యములు నిదర్శనములు. ఖడ్గతిక్కన మరణము గూర్చి

"ధైర్యంబు నీ మేనఁ దగిలి యుండుటఁ జేసి
చలియించి మందరాచలము తిరిగె !
గాంభీర్య మెల్ల నీ కడన యుండుటఁ జేసి
కాకుత్స్థునకు వార్ధి కట్టు వడియె !
జయలక్ష్మి నీ యురఃస్థలినె యుండుటఁ జేసి
హరి పోయి బలి దాన మడుగుకొనియె !
నాకార మెల్ల నీ యందె యుండుటఁ జేసి
మరుఁడు చిచ్చునఁ బడి మడిసి చనియెఁ
దిక్కదండనాథ దేవేంద్రపురికి నీ
వరుగు టెరిగి; నగము తిరుగు టుడుగు,
నబ్ధి కట్టు విడుచు, నచ్యుతు కొఁద మాను,
మరుఁడు మరలఁ గలుగు, మగలరాజ"

అని యొకకవి చెప్పిన చాటుధార. ఖడ్గతిక్కన భార్య సహగమనము సల్పి, వీరస్వర్గ మలంకరించిన భర్త ననుగమించెనని కథ.

ఖడ్గతిక్కన నిత్యజీవితము నింకొక చాటువు మనోజ్ఞముగ వర్ణించుచున్నది.

వీరనినాదంబు వేదనినాదంబు
పాయక యే ప్రొద్దు మ్రోయుచుండు;
భూసురప్రకరంబు సేసలు చల్లంగఁ
బాయ కెన్నియొ కుటుంబములు బ్రదుకు;
బ్రాహ్మణావళికి ధారలు పోసిన జలంబు
సతతంబు ముంగిట జాలువారు;

రిపుల కొసగిన పత్రికల పుత్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుండ్రు;
మానఘనుడైన తిక్కన మంత్రి యింట
మదనసముడైన తిక్కన మంత్రి యింట
మహితయశుడైన తిక్కన మంత్రి యింట
మంత్రి మణియైన తిక్కన మంత్రి యింట.

కేతనకవి దశకుమార చరితమున ఖడ్గతిక్కనను వర్ణించెను.

'వేడిన నర్థార్థి వృథపుచ్చ నేరని
దానంబు తనకు బాంధవుఁడు గాఁగ;
నెదిరిన జమునైన బ్రదికి పోవఁగ నీని
శౌర్యంబు తన కిష్ట సఖుఁడు గాఁగ;
శరణు చొచ్చిన శత్రువరు నైన రక్షించు
కరుణయె తనకు సంగదము గాఁగఁ;
బలికినఁ బొంకవ ప్రభు నైన మెచ్చని
సత్యంబు తనకు రక్షకుఁడు గాఁగ;
జగతి మతికెక్కె రాయవేశ్యాభుజంగ
రాజ్యరత్నాకరస్ఫూర్తి రాజమూర్తి;
గంధవారణబిరుదవిఖ్యాతకీర్తి;
దినపతేజుండు సిద్ధయ తిక్క శౌరి.

సిద్ధయ కుమారుడైన తిక్కనకు, కవి తిక్కనకు భేదము తెలియుటకై యతని సమకాలీను లతని ఖడ్గతిక్కన యని పిలిచిరి.

కాటమరాజుతో జరిగిన యద్ధము తరువాత తిక్కన మనస్సు కురుక్షేత్రయుద్ధానంతరము వేదవ్యాసమహర్షి మనస్సువలె నుండియుండును. మహర్షి మనస్సునుండి ''జయ'' ప్రబంధ ముద్భవించినట్లే మహాకవి గంటమునుండి మహాభారతము ప్రసరించినది.

ఈ యుద్ధము శాలివాహనశకము 1170 కాళయుక్తి[1] సంవత్సరము కార్తికశుద్ధ పంచమి గురువారము నాఁడు జరిగినట్లు కొండయ్య కొడుకెవ్వరో రామయ్య వేయించిన శిలా శాసనమునఁ గలదు. కాని, కాళయుక్తి సంవత్సరము 1180 సంవత్సర మయినది. ఆ సంవత్సరమునే స్వీకరించినచో క్రీస్తు శకము 1258-59 సంవత్సరప్రాంతమున నీ యుద్ధము జరిగినదని చెప్పవలసి వచ్చును. మనుమసిద్ధి మహారాజు కూడ, ఈ యుద్ధము జరిగిన కొలది కాలమునకే మరణించెనని చెప్పుదురు.

తిక్కన మహాభారతము కాటమరాజుతో యుద్ధము ముగిసిన తరువాత, ఖడ్గతిక్కన మనుమసిద్ధి మరణించిన తరువాత కొంతకాలమున కారంభించెనని చెప్పవచ్చును.

తిక్కన భారతము రచించు నాటికి పండువృద్ధని యైతిహ్యము. అతనికి కుమ్మరి గురునాథుఁడు లేఖకుఁడై యుండగా భారతము నాశువుగాఁ జెప్పెనను జనశ్రుతి యొక కమ్మని కథకూడఁ బ్రచారములో నిల్చినది. కుమ్మరి గురునాథుని గంట మాగకుండ తిక్కన కవిత చెప్పుట సమయము.

---

[1]నెల్లూరు శాసనములు 527 పుట.

కురుక్షేత్రయుద్ధాంతరమున పదు నొకం డక్షౌహిణీబల మెల్ల సమసిపోయిన పిమ్మట తిక్కన దుర్యోధనుని స్థితి సంజయు నోట ధృతరాష్ట్రున కెరింగించెను.

"వలవలని మూఁకఁలోఁ గాల్
నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలితభుజుండై యొక్కఁడు
దొలఁగి చనియె...."

అని కంద పద్యము మూడున్నరపాదములు చెప్పి, యింక చెప్పవలసినది లేక, పాదపూరణమునకై యేమి చెప్పవలెనో తోచక "ఏమి చెప్పుదుం గురునాథా!" యని సంప్రశ్నించె నని గురునాథ మేమియు నెరుఁగక అట్లే వ్రాసినను నది కురునాథుఁడైన ధృతరాష్ట్రుని సంబోధనగాఁ గథతోపాటు కందపద్యముతోఁగూడ నతికిపోయినదని చెప్పుదురు.

వేదవ్యాసుని భారతరచనమును గూర్చిగూడ నిట్టి కథ గలదు. అచ్చట గణపతి యతనికి లేఖకుఁడు. గంట మాగకుండ వ్రాయుట తుల్యసమయము. వ్యాసుడు గణపతిని శ్లోకముల నర్థము చేసికొనిన పిమ్మటనే వ్రాయవలెనని నిర్ణయించెను. అఁదుచే నెడనెడ వ్యాసఘట్టములు. వానిని గణపతి యవగాహన మొనరించుకొనులోపల వ్యాసుఁడు కవిత చెప్పుచుండెడి వాఁడు. వ్యాసునకు గణపతి వలె నపరవ్యాసుఁడగు తిక్కనకు గురునాథ మేర్పడెను. అందులకుఁ బూర్వోక్త పద్యముకూడఁ జక్కగఁ గలసి వచ్చినది. ఇందలి సత్యాసత్యము లెటున్నను కథమాత్రము రక్తికట్టినది.

తిక్కన నాటి మహాయుద్ధములు రాయబారములు రాజ నీతి వీరధర్మము, మహాభారతయుగములను స్ఫురణకుఁ దెచ్చును.

మనుమసిద్ధి రాజ్యభ్రష్టత, తిక్కన రాయబారము కాకతి గణపతి దేవచక్రవర్తి సాయము, అన్నంభట్టు రాయబారము, ఏకైకవీరుఁడు ఖడ్గతిక్కన యొక్కటి పోరు మున్నగునవి మహాభారతవీరయుగమును స్ఫురింపఁజేయు సన్నివేశములు.

ఈ విధముగా కవికి కావ్యమునకు, కవికాలమునకు కావ్యయుగమునకు, బింబప్రతిబింబభావము సమకూరినది. తిక్కన మహాభారతము నందిట్టి ఆత్మనివేదనయే సలిపెను. అందుచే ఆంధ్రమహాభారతము స్వతంత్రసృష్టియై యందు తిక్కన స్వీయానుభవము జీవనాడివలె స్పందించుచుండును.

కావ్యములయందలి పాత్రలు బహుళముగా తోలు బొమ్మలు. ఆ పాత్రలు మాటాడునపుడు వెనుక నుండి కవి వాక్కే వినిపించుచుండును. దానికిఁ గారణము కవిజీవితమునకు కావ్యవృత్తమునకు జీవదనుబంధము లేకపోవుటయే. అట్టి కవులు పాత్రలను నిర్మింపగల కవికుంభకారులే గాని ప్రాణ ప్రతిష్ఠ సలుపఁగల కవిబ్రహ్మలు కాఁజాలరు. తిక్కన తాను సృష్టించిన పాత్రలకు జీవరేఖలు తీర్చిదిద్ది ప్రాణప్రతిష్ఠ సలుపఁ గలిగిన కవిబ్రహ్మ. ఉత్తమకవు లందరికి ప్రజ్ఞ యుండును. తిక్కనలో నీ ప్రజ్ఞ విశేషము. తిక్కన సృష్టించిన ద్రౌపది, పాండవులు, దుష్టచతుష్టయము, భీష్మద్రోణాదివీరులు, ఉత్తరుని వంటి ఉపపాత్రలు కూడ సాహితీ ప్రియంభావుకుల మనఃఫలకముల శాశ్వతముగా హత్తుకొని యుండుటయే గాక ఆంధ్రవాఙ్మయ ప్రపంచమున చిరంజీవములు.

తిక్కనకు బ్రథమమున విరాటపర్వముమీద నభిమాన మెక్కువగఁ గోచరించును. "హృదయాహ్లాదిచతుర్థ మూర్జిత కథోపేతంబు నానారసాభ్యుదయోల్లాసి"గ విరాటపర్వము తీర్చిదిద్దెను.

"కథ జగత్ప్రసిద్ధి గావునఁ బూర్వ ప
ర్వార్థయుక్తి సేయునట్టి యెడల,
యత్న మించు కంత యయినను వలవదు
వలసి నట్లు చెప్పవచ్చియుండు"

అని విరాటపర్వము నారంభించెను. ఈ పద్య మరణ్యాపర్వశేషమును బట్టియే వ్రాయక తప్పినది గాదు. నన్నయ మూఁడు పర్వములు సంపూర్తిగఁ జెప్పిన యెడలఁ బూర్వకథ ప్రసక్తియే లేక కథ యతుకు లేక కలిసిపోవును. అయినను తిక్కన, యరణ్యా పర్వశేషము పూరింప నిష్టము లేక విరాట పర్వము నారంభించుటకు కుపపత్తి కథ జగత్ప్రసిద్ధి యని చెప్పి యుపక్రమించెను.

అయినను ధర్మరాజు ముఖమున, విరటు కొలువుకూటమున నతిలోకశూరులై, నెగడిన తన తమ్ము లెట్లు మెలఁగ గలరో యను విచారమునఁ, బూర్వకథను వివరించెను. ధర్మరాజు

"కడిమిమై సౌగంధికమున యక్షుల మద
మడఁచి కృష్ణకుఁబువ్వు లట్లు దెచ్చెఁ
గిమ్మీరదానవు సమ్మెయి నిర్జించి
విగతకంటకము గావించె వనము
బకదైత్యుఁదొడరి యా భంగి రూపఱఁ జేసి

రక్షించె నేక చక్రాపురంబు
నస్పాటఁ బ్రబలు జటాసురు నడరి
దండితుఁ జేసి మనలఁ బెట్టించుకొనియె
నితడు పుట్టిన కోలెను నెసక మెసగు
దర్పమునన వర్తిల్లు నుదగ్రహృదయుఁ
డకట యొరు చిత్తమున కెక్కునట్లు గాఁగ
మెలఁగి యే విధంబునఁ గొలుఁచు వాఁడు''

అని భీముని గూర్చి,

''ఖాండవ మేర్చె, దేవతలుఁ గానని యీశ్వరుఁగాంచె, దోర్బలో
ద్దండమహాసుర ప్రతతి దర్ప మడంచి ప్రియం బొనర్చె యా
ఖండలుఁ డున్న గద్దియ సగంబున నుండె, మహానుభావుఁడీ
తండొక మర్త్యుఁజేరి యనుదాత్తత నెమ్మెయి గొల్చువాఁడొకో''

అని అర్జును గూర్చి సంతాపము చెందుదురు. ఈ పద్యములందలి ఘట్టములన్నియు భీమార్జున ప్రశంసలు మాత్రమేగావు. ఖాండవదహనము, కిరాతార్జునీయము, సౌగంధికాపహరణము, బకాసురవధ మున్నగు మహోజ్జ్వల సన్నివేశములందు నన్నయ మహాకవి ప్రదర్శించిన ప్రతిభను దలచి తిక్కన సమర్పించిన సరససౌహృదకవితాకర్పూరనీరాజనములు.

నన్నయ ఉత్తమ కథకుఁడు. అక్షర రమ్యత ప్రసన్నకథా కవితార్థయుక్తితోఁ బాండవుల శైశవకథ రాజ్యత్యాగము వర్ణించెను. నన్నయ చిత్రించిన పాండవులు పరమపవిత్రులు. వారి హృదయములు సుకుమారకోమలనిర్మలములు. 'మేను లేత, ఉల్లము

మెత్తన.' అజ్ఞాతవాసముతోఁ బాండవుల జీవితములో నూత్నఘట్ట మారంభమైనది. వారు జీవితసమరము నెదుర్కొనుట కుద్యుక్తులు కావలెను. భీముఁడే గాక పాండవులందఱు "పుట్టిన నాటను గోలెను మెసఁగు దర్పమునన వర్తిల్లు నుదగ్ర హృదయులు ఒరుచిత్తమున కెక్కునట్లు" ఎట్లు వర్తింతురో తన భారతభాగమున నని తిక్కన భారతభాగమున పాండవులు క్రొత్త వేషములు వేసి, తమ స్వభావములు మార్చి నూత్నభూమికలు ధరించిరి. తిక్కనకు నాటకీయశైలి, కథలోఁ గలిగిన మార్పుగూడఁ జక్కగఁ గలిసి వచ్చినవి. నన్నయ కథా కథన శైలితోపాటు తిక్కన నాంధ్రవాఙ్మయమునకు నాటకీయమైన భిన్న కవితాశిల్పము ప్రసాదించెను.

తిక్కన ఇంగితజ్ఞుడు. పాత్రల చిత్తవృత్తుల వర్ణించుట యందు మిక్కిలి గడుసరి. కథను నాటకీయముగ సంభాషణము ద్వారముననే నడపును. సంభాషణచాతుర మాతని కవితా శిల్పమునకు వన్నెఁబెట్టినది. అలతి యలతి మాటలతో తెలుఁగు నుడికారపు వంపులు సొంపులు తామరతంపరగ నేరికూర్చి కమ్మని తీరుతియ్యములు తిక్కన కురిపించి తనకవిత తీర్చి దిద్దుకొనెను. నన్నయనాడు శకునితో మాయాద్యూతమున రాజ్యమెల్లను గోలుపోయిన ధర్మరాజు, అన్నమాట కడుగు దాటని యతని తమ్ములు అమాయక కోమలులు, పరమ పవిత్రులు, తిక్కననాడు వేయని వేషములు లేవు పోవని గడుసరి పోకడలు లేవు. చిత్రవిచిత్రభ్రమములు నేర్చి గడిదేరిరి.

ధౌమ్యుఁడు పాండవులకు లోకజ్ఞాన ముపదేశించెను. రాజగృహంబు కంటె నభిరామముగా నిలు గట్టఁగూడదు.

"వసుమతీశు పాల వర్తించు నేనుఁగు
తోఁడ నైన దోమతోడనైన
వైరమగు తెఱంగు వలవదు తారెంత
పూజ్యులైన జనుల పొందు లెస్స."

రాజుల మనస్తత్వము తిక్కన మరపురాని మాటలతో మనోజ్ఞముగ వర్ణింపఁ గలిగెను. తిక్కనవంటి మనోధర్మ పరిజ్ఞాతయైన కవి ప్రపంచవాఙ్మయమున నరుదు.

అరణ్యావాసనమునకు జను నప్పుడు కుంతి పాండవుల నందఱగూర్చి ద్రౌపదితోఁ జెప్పుచు సహదేవుని గూర్చి

"కడు పసిబిడ్డ వీఁడొకటి గాదవు నా నెఱుఁగండు ముంద రె
య్యడనొక పాటెఱుంగఁ డెదయంతయుఁ గోమలమెప్పుడైన నేఁ
గుడవఁగఁ బిల్తుఁ గాని తనకుంగల యాకటి ప్రొద్దెరుంగఁ డీ
కొడుకిటువోకకున్ మనము గుందెడు నిన్ గని యూఱడిల్లెడున్"

అని చెప్పెనట. ఈ మాట ద్రౌపది వెనుచూపు తలపుఁగఁ బూర్వకథావృత్తాంతమును భీమునకుఁ దెల్పును. ఆ ఘట్టమునే తిక్కన వెనుదిరిగి కుంతీమనస్సును మథించి హృద్యముగ వర్ణించెను. కుంతి మనోవేదన, ఆమెకు మాటలలోఁ గల నేర్పు, పరేంగిత జ్ఞానము, ఆ మాటలు ద్రౌపది మనస్సులో ప్రసరించిన ప్రభావము మహోద్భుతము. కుంతి మాతృహృదయము, ద్రౌపదిలోని స్త్రీత్వము, చక్కగ నభివ్యక్తమైనవి.

ఈ ఘట్టము నన్నయ మహాకవి ప్రసన్నకథాకవితార్థ యుక్తి, అక్షర రమ్యతతో గంభీరముగ కదలిపోయినది.

నన్నయ పాత్రములలో పవిత్రత, తిక్కన పాత్రములలోఁ బ్రగల్భత గోచరించును.

యతివేషమున ధర్మరాజు విరటుని కొల్వుఁ జేరినపుడు "ఎయ్యది జన్మభూమి కుల మెయ్యది" "ఎఱిగింపుఁ డున్న రూపు" అని విరటుఁడు ప్రశ్నించును.

శకుని చేతిలో నవమాయికవముగ మాయాద్యూతమున నోటుపడిన ధర్మరాజు తిక్కన చేతిలో గడిఁదేరినాఁడు. విరటుని ప్రశ్నల కంతు చిక్కకుండ, తిక్కన ధర్మరాజు చెప్పిన గడుసరి సమాధానములు మరపునకు రానివి.

"ఉన్న రూప పలుకునన్నరు లెక్కఁడఁ
గలరు తోఁచి నట్లు పలుకు వలుక
నైన చంద మయ్యె నంతియ కా కంత
పట్టి చూడఁ గలరె యెట్టివారు"

అని మందహాసంబు సేయుచు మఱియును

నానావిధభూతమయము
మే నతిచంచలము మనము మెయికొని నిక్కం
బే నరునకుఁ జెల్లింపం
గా నగు సత్యంబు నడపు క్రమ మట్లుండెన్"

అని సత్యము దప్పకయే "ద్విజుఁడ గురువిషయజాతుఁడ" నని చెప్పి తప్పించుకొనఁ గలిగిన ప్రగల్భుడు తిక్కన ధర్మరాజు.

ఈ ప్రగల్భత ధర్మరాజునకే గాక తిక్కన భీమార్జున నకుల సహదేవులకుఁ గూడఁ గల్గినది. భీముఁడు

దేవా నాలవజాతివాఁడ నిను నర్థిం గొల్వఁగా వచ్చితిన్
సేవాదక్షత నొండుమ్మై నెఱుఁగ నీ చిత్తంబునన్ మెచ్చు న
ట్లే వండం గడు నేర్తు బానసమునం దిచ్చోటనే గాదు న
న్నే వీటన్ మిగులంగ నెవ్వఁడును లేఁ డెబ్బంగులం జూచినన్''

అని యర్థాంతరన్యాసము చిందులాడఁ బల్కెను. బండ భీము నకుఁగూడ మహాకవి తిక్కన ఎంతటి మాటల నేర్పు, ప్రగల్భత నేర్పఁ గలిగెను! అర్జునుఁడు పేడి రూపమునఁబోయిగూడ

''ఆడుఁ దనంబు నిక్కమున కారసి చూచిన లేదు పుంస్త్వముం
బోడిమి తప్పియున్నది నపుంసకజన్మ మవశ్యభోగ్యమై
వాఁడిమి గల్గు శాపమున వచ్చె'' అని చతురముగఁ బల్కెను.

నకులుఁడు గూడ నన్నలకుఁ దీసిపోలేదు.

''ధర్మసుతుండు పెంచె ననుఁ దాన తురంగమశాస్త్రశిక్షకుం
గర్మఠుఁ జేసి యాత్మతురగంబుల కెల్లను నన్న యుక్తగా
నర్మిలి నిల్పి యాఁగియుఁ బ్రియంబును నాయెడ నాడు నాటికిం
బేర్మి వహించుచుండ నడపెం దన తమ్ములలోని వానిగన్''

అని అంతుచిక్కకుండగ నసత్యము చెప్పకుండగనే చెప్పి తప్పించుకొనెను. తిక్కన మహామంత్రి నడపెడి పాత్రములు మాటలలో నొరులకుఁ జిక్కుదురా!

సంకేతమయము ప్రకారము కీచకుఁడు నర్తనశాల చేరును. ముసుఁగు వేసికొని ద్రౌపది వలె భీముఁడాతని నిరీక్షించుచుండెను.

''కీచకాధముండు గిమ్మిరవైరిపైఁ
గేలు సాఁచి యా విశాలనయన
గాఁ దలంచి మేను గఱుపార''

దరిఁజేరి సరససల్లాపముల నారంభించెను. భీముఁడు

''నా యొడలు సేర్చి నప్పుడ
నీ యొడ లెట్లగునో దాని నీ వెఱిఁగెదు న
న్నే యబలల తోడిదిగాఁ
జేయఁ దలంచితివి తప్పు సేసితి గంటే.
నను ముట్టి నీవు వెండియు
వనితల సంగతికిఁ బోవువాఁడవె''

అనుచు గ్రక్కున నతని దల పట్టుకొనెను.

''తన యగపా టొరు లెఱుఁగుదు
రని సూతుఁడు సమయభంగ మగుటకు భీముం
డును గొంకుచుఁ జప్పుడు సే
యని గూఢమర్దనప్రహారములఁ దగన్''

మల్ల యుద్ధనైపుణ్యము మెఱయఁ జేసిరి.

ఈ రౌద్రబీభత్ససన్నివేశమునకు అంతర్వాహినిగ వెల్లి విరిసిన తిక్కన నిశితనిర్భరహాస్యచాతురి అత్యద్భుతము.

ఉత్తరకుమారుఁడు ''చక్కగఁ గను విచ్చి పేడిఁ జూడరోయు'' వీరుఁడు. ''ఎత్తునఁ గొందుఁ గౌరవుల నెల్లను మార్కొని రేని గోవులం దెత్తు వముహూర్తమాత్రమున'' నని ''అంతిపురంబులోనఁ గల యంగన లెల్లను నెవ్వనంబులన్ సంతస మంద'' పల్కిన

వాక్ర్పరుఁడు "కౌరవసేనఁ జూచి వడకం" దొడగి రథము నాప, సారథియగు నర్జును" వేఁడెను.

"వివ్వచ్చుండు తేరువోవ నిచ్చుటయు నాననంబు పల్లటిల్ల మానసంబు తల్లడిల్ల నా భూవల్లభకుమారుండు

శరములు శరాసనమున
య్యరదముపై డిగ్గ విడిచి యతరభసమునన్
ధరణికి లంఘించి వెసం
బురి దెసకును లజ్జ వీటిఁ బోవం బాటెన్"

అర్జునుఁ డప్పుడు పదశతమాత్రపలాయితుండగు భూమింజయు నెయిది పట్టుకొనిన నతండు

"వెల వెల బాఱుచు వెగడొందుఁ బెదవుల
తడి యాఱ నెంతయుఁ దల్లడిల్లుఁ
జల్లన సంగంబులెల్ల నిండఁ జెమర్చుఁ
బదములుఁ గరములుఁ గుదియ వడఁకు
హృదయంబు దట తట నదరంగఁ బెలుకుఱు
దీనదృష్టుల మోముఁ దేటి చూచు
నెలుఁగు గద్గదికఁ దొట్రిల నేడ్చు విడు మని
ప్రార్థించు మాటఁ గీడ్పాటు దోఁప
నిష్కశతశుద్ధ హేమంబు నిర్మలోజ్జ్వ
లాష్టవైడూర్యములుఁ దురగాఢ్యరథముఁ
గరటిదశకంబు నొక యూరుఁబురముఁ సొచ్చి
నపుడ యిచ్చెద నీకను నార్తుఁడగుచు."

తిక్కన ఉత్తరకుమారపాత్రమునకుఁ బ్రాణ ప్రతిష్ఠ సలిపి యతని నాంధ్రవాఙ్మయమున చిరంజీవిని సల్పెను. ఇచ్చట తిక్కన చిత్రకారునకుఁగూడ నగమ్యమైన ఉత్తరకుమారుని క్షణక్షణ పరిణామవిహ్వలమైన యాకృతిని మనోజ్ఞముగఁ జిత్రింపఁగలుగుటయే గాక ఇంగితజ్ఞులకుఁ గూడ నందని యతని చిత్తవృత్తి సత్యద్భుతముగ వర్ణింపఁగలిగెను. ఈ ఘట్టమునందు తిక్కన నిశితనిర్భరహాస్యచాతురి జీవత్పాత్రచిత్రణము గంగాయమునవలె సంగమించినవి. ఉత్తరకుమారుఁడు జీవాత్పాత్రము, నేటికిని మన కెందఱో ఉత్తరకుమారులు కనుపించుచుందురు. ఉత్తరకుమారప్రజ్ఞలు వినిపించుచునే యుండును.

ఉత్తరుని సారథిగాఁ గైకొని వచ్చుచున్న నర్జునుఁజూచి, శిష్యవత్సలుఁడగు ద్రోణుఁడు అజ్ఞాతవాస సమయభంగము శంకించి నితరు లెరుఁగకుండు నట్లుగ భీష్మ వదనంబు వీక్షించి పలికిన పలుకులలోని సుకుమారమైన యర్థాంతరస్ఫురణము మనోజ్ఞము.

"వెరవరి గాక వీడు కురువీరులకుం బొడసూపు వాఁడె య
చ్చెరు వొక మ్రాని పేర నిట సేరగవచ్చుచు నున్న వాఁ డహం
కరణము కాని యొం డొకటి గానఁడు మూర్తివిశేషమారయన్
సురపతి యట్ల వీని మది చొప్పదియెట్లొ యెఱుంగనయ్యెడున్"

ఆ మాటలు విని ద్రోణుని సందియమును మాన్ప భీష్ముఁడు దుర్యోధనునితోఁ బలికినట్లు నిగూఢార్థస్ఫోరకముగ

"తలఁపంగ రిపులకు నిమ్మగు
కొలది గడచి వచ్చితిమి యకుంఠిత బాహా

బలము నెఱపc దటి యయ్యెను
జలింపవల దింక మనకు శత్రుల వలనన్''

అని పల్కెను. ఇట్టి గడుసరితనము తిక్కన భారతమునం దెల్లెడc గానుపించునదే. అర్థాంతరస్ఫురణ కెయ్యెడ తిక్కన శ్లేష వాడ లేదు. ప్రయోగసామర్థ్యము వలన నేర్పడిన శబ్దశక్తినే యుపాసించి ధ్వని ప్రధానమైన యుత్తమకావ్యసృష్టి సల్పెను.

అజ్ఞాత వాసానంతరము పంచపాండవులు విరటుcడు రాక మునుపే కొలువు కూటము చేరి ''ధర్మరాజు సింహాసనమున భీమాదు లాత్మసము చితరుచిరాసనముల, పంచాగ్నులునుబోలె'' గూర్చుండిరి. విరటుcడు వచ్చి, యెల్లిద మని భావించి

''ఇది యేమి కంక నీ వు
న్మదవృత్తిని శంకc దక్కి నా గద్దియపైc
బదిలంబుగc గూర్చుండితి
వదియును గా కిపుడు దిగ వహంకారమునన్''.

అనిన విని మందహాసంబు సేసి సంక్రందననందనుం డతని కిట్లనియె.

''నడదివియలు సేసె నగరికి మాణిక్య
మకుటముల్ పూనిన మనుజపతులc
దగు నాజ్ఞ సూయాణముగ నొనరించె
మంచిగ నేల నాలుcగు సెఱcగులకును
బ్రీతార్థిజనుల సచేతనత్యాగధ్వ
జములుగా నన్ని దేశములc బఱపె

దిక్కు లన్నింటను దెలుఁ పారు పూఁత గా
    వించె నుజ్వలయశోవిభ్రమంబు
రాజసూయాధ్వర ప్రవర్తకుఁడు నిత్య
సత్యభాషామహావ్రతశాలి పాండు
రాజదుగ్ధపయోనిధిరాజు ధర్మ
రాజు సుమ్ము మత్స్యావనీరమణ యితఁడు !

ఈతఁ డజాతశత్రుఁడు మహిం దగ దిగ్విజయంబు సేసె వీ
ర్యాతిశయార్థి వాసవు మహాసన మైనను నెక్క నర్హుఁడు
ద్యోతితమూర్తి కౌరవకులోద్వహుఁ డార్యనికాయసంతత
ఖ్యాతచరిత్రుఁ డీ చిఱుత గద్దియకుం దగఁడే నరేశ్వరా!''

ఇందలి నాటకీయత; సంభాషణాచారిమ; సీసపద్యము నందలి యుయ్యాల తూఁగు; కమ్మని తేట తెలుఁగు నుడికారపు నయగారములు ఔచితీపాలనము సర్వతోముఖ ప్రతిభకు నిదర్శనములు.

పై సీసపద్యము కీచకవధయందు ధర్మరాజునుగూర్చి ద్రౌపది భీమునితో నవిన పద్యమును స్మరణకుఁ దెచ్చుచున్నది.

''ఎవ్వాని వాకిట నిభమదపంకంబు
    రాజభూషణరాజోరజి నణఁగు !
నెవ్వాని చారిత్ర మెల్ల లోకములకు
    నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు !
నెవ్వాని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి
    మానితసంపద లీనుచుండు !

సెవ్వాని గుణలత లేడు వారాసుల
కడపటి కొండపైఁ గలయఁ బ్రాఁకు !
నతఁడు భూరి ప్రతాపమహాప్రదీప
దూరవిఘటితగర్వాంధకారవైరి
వీరకోటిరమణిఘృణివేష్టితాంఘ్రి
తలుఁడు కేవలమర్త్యుఁడే ధర్మసుతుఁడు''

సీస పద్యమున నే చరణమున కాచరణమే స్వయంసంపూర్ణమగు నర్థసమృద్ధితో నుయ్యాల తూగుతో నడిపించుట తిక్కన యారంభించెను. శ్రీనాథుని చేతిలో సీసము సిద్ధి చెందినది.

కవితా శిల్పము వాగర్థముల యుతిలోక దాంపత్యము. వాగర్థముల కలయిక అర్ధనారీశ్వరుఁడైన పరమేశ్వరునిలోని అద్వైత యోగము వంటిది. కవి వాగర్థములను జోడుగుఱ్ఱముల నేక కాలమున స్వారి చేయు నేర్పు నలవరచుకొనవలెను. రెండు గుఱ్ఱములును ఆరితేరినవే కావచ్చును. కాని అవి ఒకే వేగమున పరిగెత్తవలెను! ఆ పరుగులో గిట్టల చప్పుడులోఁ గూడ అపశ్రుతి వినిపింపరాదు. ఇది కవికి అసి ధారావ్రతము. భాషను మించి భావము, వాక్కును మించి అర్థము, పందెపు పరుగు తీయునపుడు ఏ గుఱ్ఱము గెలిచినను కవితారథమునకు ప్రమాదపతనము సంభవింపవచ్చును. ఎట్లో రెండు గుఱ్ఱములు కలిపి రథము నీడ్చినను ఊపు, కుదుపు మాత్రము తప్పదు.

నన్నయ వాగర్థముల జోడు గుఱ్ఱముల స్వారిలో ఆరితేరిన మహారథికుఁడు. నన్నయ కవితారథ మెంత నిమ్నోన్నత భూములలో గమించుచున్నను ఆ జోడు గుఱ్ఱములు, వాగర్థములు; బాష;

భావము; ఒకే వేగములో పరుగిడును. ఆ గుఱ్ఱముల గిట్టల చప్పుడుగూడ ఒకే శ్రుతికి అనుస్యూతమై మృదంగ నిస్వనమువలె తాళలయాన్వితముగ వినిపించును. నన్నయ కవితారథములో కుదుపు లేదు; కంపము లేదు; ఒడుదుడుకులు లేని మల్లె పూల బాటపై మెత్తగఁ గదలి పోవును.

''బహువనపాదపాథబికులపర్వతపూర్ణ సరస్సరస్వతీ
సహితమహామహీభర మజస్రసహస్రఫణాళిఁ దాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్యమైన య
య్యహిపతి దుష్కృతాంతకుడనంతుఁడుమాకు బ్రసన్నుఁ
డయ్యెడున్''

నన్నయ పద్యములు వేదబుక్కులు. కవితాగమనము సామగానము.

తిక్కన పద్యశిల్పమునఁ గూడ వాగర్థములు జోడు గుఱ్ఱముల స్వారీ-వలెనే నడచును.

''ఎవ్వాని వాకిట నిభమదపంకంబు
రాజభూషణ రజోరాజి నణఁగు''
''నడదివియలు చేసె నగరికి మాణిక్య
మకుటముల్ పూనిన మనుజపతుల''

అన్న పద్యములందు వాగర్థముల అనుకూలదాంపత్యము వర్ణనాతీతము.

ధర్మరాజు వాకిట మత్తేభముల దానోదకముచే బురదయైనది.

సామంతరాజుల భూషణములు రాపిడిచే నేర్పడిన బంగారు ధూళిచే నా బురద యణగుచున్నది.

ధర్మరాజు ఆ నగరియందు మణికిరీటములు దాల్చిన మనుజపతులనే జంగమజీవద్దీన స్తంభములుగ నిలిపెను. ఇందు భాష : భావము గంగాయమునల వలె సంగమించినవి.

భాష : భావము ! వాక్కు : అర్థము కావ్యప్రపంచమున శరీరము: ప్రాణము వంటివి. అవి అవినాభావసంబంధము కలవి. ప్రాణము లేని శరీరము శవము. శరీరము లేని ప్రాణము దయ్యము, శరీర ప్రాణముల రమణీయసమ్మేళనమే సృష్టిశిల్పము. రమణీయకావ్యశరీరమును నిర్మించుటయందు చక్కని చిక్కని పద్యముల వ్రాయుటయందు చాలమంది కవులు కృతకృత్యులు కాఁగలరు. కాని తిక్కన కావ్యశిల్పమున ప్రాణపతిష్ఠ సలిపిన కవి బ్రహ్మ.

కవి అంతరాత్మ కావ్యములో నావిష్కృత మగును. తిక్కన భారతము ననువదించినను, స్వీయజీవితానుభవనివేదనము సలిపెను. తిక్కనయుగము భారతయుగమునకు ప్రతిబింబమే. తిక్కన యోధుఁడు. ఎన్నియో యుద్ధములఁ జేసిన వాఁడు చూచిన వాఁడు. ఎన్నియో యుద్ధములఁ జేసిన వాఁడు. చూచిన వాఁడు. యుద్ధతంత్ర మతనికి వెన్నతోడఁ బెట్టిన విద్యయే. ఖడ్గతిక్కనవంటి వీరుల వంశమునఁ బుట్టినవాఁడు. కులక్రమానుగతమైన మంత్రిపదవి నిర్వహించి రాయబారముల జయప్రదముగ నడపి రాజనీతినే వృత్తిధర్మముగ స్వీకరించినవాఁడు. తుదకు సోమయాజియై హరిహరనాథోపాసన సలిపిన తపస్వి.

మహాభారతసార మనదగిన రాజనీతి, యుద్ధతంత్రము, బ్రహ్మవిద్యోపదేశము తిక్కన ఆత్మీయతలో లీనమై యున్నవి. తిక్కన భారతరచనమున సలిపినది తన యాత్మీయతావిష్కరణమే. సంజయ శ్రీకృష్ణుల రాయబారముల చిత్రించుటకు తిక్కనకు సహజాధికారము కలదు. సంజయుఁడు ధర్మరాజుతో

"పా లీక కౌరవులు దు
శ్శీలతఁ జెడుఁ దలఁచి రేనిఁ జెప్పెద రుధిరా
భీలాన్నంబుకంటెను.
మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్

నీ విభవం బహింసయు ననింద్యచరిత్రము కాక యన్యమే" అని.

"అల్లులకు మ్రింగఁ జేఁ దైన హాలహలము
భంగిఁ బొంగెడు కోపంబు మ్రింగి కొనఁగ
నీలగళు నెన్ని నిన్నెన్నఁ బోలు నట్టి
నీవు సాలినఁ గా కేల నెగడుఁబేరు"

అని ధర్మపన్నముల నుపన్యసించును. అట్టి మాటలకెదురు చెప్పుట దుర్ఘటము. కని ధర్మరాజు సద్యఃస్ఫూర్తి కొనియాడతగినది.

"అనవుడుఁబాండుతనయాగ్రుదు సంజయుమోముఁజూచి యి
ట్లను నది యెల్ల నీవలికి నట్టిద ధర్మువు లట్ల యుండి బో
ధను లరయంగ వచ్చిన నధర్మములై చెడుఁ గొన్ని ధర్మ వ
ర్తనములుగాక తోఁచి తుదిధర్మములై చనుఁగొన్ని కర్మముల్"

అని ధర్మరాజు తుది ధర్మముత్తై చనుఁ గొన్ని కర్మ్మవుల నిరూపించి యాభాసధర్మ్మవుల నిరాకరించెను.

ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దన భంగపాటును జెప్పుకొను ఘట్టము తిక్కన చిత్రించిన యుజ్జ్వలసన్ని వేశములలో నొకటి. ద్రౌపది పాత్రోన్మీలమున తిక్కన చూపిన ప్రజ్ఞ పేర్కొనఁ దగినది.

"ధర్మనందను పలుకులు దనకు హృదయ
తాప మొనరింప మోమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్యఁ బలికెఁ
గనలి శౌరితో గద్గదకంఠి యగుచు
అంతలు సేసి పో నడచి యక్కట సంజయు చేతఁజెప్పి పు
త్తెంతురె యిట్టి యూరట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దా
నంతన యూళ్ళులేవురకు నైదు సుయోధనుఁ డిచ్చు నొక్కొ యీ
కంత కృపావిహీనమతి నాతఁడు నొంచునె యన్నదమ్ములన్"

సంధిసంధాతగా వెడల నున్న శ్రీ కృష్ణునితో ద్రౌపది పలికిన పలుకులలో నెంతటి యెత్తి పొడుపు ! ఎంతటి బీభత్సనిర్భర నిశితహాస్యలాఘువము !

"ఓట యొకింత యేనియు సుయోధను చిత్తమునందు లేదు నీ
మాటలఁ బోవునే దురభిమానము యెక్కుడు పూను గాక య
చ్చోటన సంగరంబులగు చొప్పులు పుట్టిన నైనఁ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ పోదురొ కానల నుండ నచ్యుతా"

ద్రౌపదిలో స్త్రీ సహజమైన భీరుత్వము గనిపింపదు. "అని అట్లుగ్గడించి

ద్రోపది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెంట్రుకల్
దా వలచేతఁ బూని యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగ మో
నా విలసిల్లి వ్రేలగ మనంబునఁ బొంగు విషాదరోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై

గోవిందు ముందటం బెట్టి యిట్లనియె

ఇవి దుస్ససేను వ్రేళ్లం
దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి కౌ
రవులకడఁ దీఱు మాటల
యవసరమునఁ దలఁప వలయు సచ్యుత వీనిన్
ఈ వెంట్రుకలు పట్టి యీడ్చిన యా చేయి
తొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింత లింతలు దునియలై చెదరి రూ
పాటినఁ గని యుడుకాఱుఁ గాక
యలుపాలఁ బొనుపడు వట్టి చిచ్చే యిది
పెనుగద పట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ
మను నొక విల్లెప్పుడును వహించు
కట్టి విక్రమంబుఁ గాల్పనే యిట్లు బ
న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజ పీనుంగుఁ గన్నారఁ
గానఁ బడయమైతిమేనిఁ గృష్ణ''.

పాపము ధర్మరాజు మాత్రము రాజరాజు పీనుఁగుఁ గన్నార గాంచఁ దలపోయలేదు!

"ఆపదఁ గడవం బెట్టంగ
నోపి శుభంబైన దాని నొడఁ గూర్పను మా
కి పుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా"

అని "యా సుయోధనుతోడి పోరాట దక్కి యనుభవింతుము మా యంశమగు ధరిత్రి" యని చెప్పియుండెను. ఒకవేళ సంధి సుయోధనునకు సమ్మతమైనను ద్రౌపదికి మాత్రము సమరమే కావలిసినట్లున్నది. "ద్రోపది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెంద్రుకల్ దా వల చేతఁ బూని" నల్ల త్రాచు వలె దిగ్గన లేచినది. తిక్కన వర్ణన ఏ చిత్రకారుఁ డనుకరింప గలడు ! తిక్కన స్థిర భంగిమల కాక చరద్ భంగిమలచే నిశిత దృష్టితో వేడుకొనును. ఎంతటి వీరపత్నియైన ద్రౌపది కంతటి పగయా! రక్త దాహమా! భారతకాలమునఁగూడ నట్టి స్త్రీ ద్రౌపది యొక్కతియే యేమొ ! తిక్కన తనవదినెయైన ఖడ్గ తిక్కన భార్యను, పెత్తల్లియైన ఖడ్గతిక్కన తల్లిని స్వయముగ నెరిఁగినవాఁడే కదా. 'పరచి వచ్చిన పతికికీ పసుపు కుంకుమఁ బెట్టు' వీరపత్నుల స్వగృహమందే కన్నార గాంచిన తిక్కన ద్రౌపదిపాత్ర నట్లుల్లేఖించుటకు సాధ్యమైనది.

శ్రీకృష్ణుని రాయబారమునఁగూడ తిక్కన ఆత్మీయతా ముద్ర స్పందించుచుండును.

ధర్మరాజు శ్రీకృష్ణుని రాయబారిగ వరించి

"మ మ్మెఱుఁగు దెదిరి నెఱుఁగుదు
నెమ్మి యెఱుఁగు దర్థసిద్ధి నెటి యెఱుఁగుదు వా
క్యముల పద్ధతి నెఱుఁగుడు
పొ మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్"

అని చెప్పి పీడ్కొలుపును.

ఆవునేతిగుండెకల ధర్మరాజునకుఁ దిక్కన చేతిలో ఎంతటి రాజనీతిచతురత వాగ్విన్యాసము అబ్బినది ! మనుమసిద్ధి మహారాజు తిక్కన మహామంత్రిని గణపతిదేవచక్రవర్తి కొలువు కూటమునకు రాయబారిగఁ బంపి నపుఁడీ మాటలనే యనెనేమో. ఈ మాటలలో ఆత్మవృత్తము జీవనాడి వలె స్పందించుచున్నది. ఈ పద్యములోని ప్రత్యక్షరము వెనుక రక్తపు అటు పోటుతోఁ గూడిన గుండె సవ్వడి వినుపించుచునే యున్నది.

అలతి అలతి మాటలు, అల్పాక్షరముల ననల్పార్థరచన కీ కందపద్య ముదాహరణప్రాయము. నిరతిశయస్వాభిమాన పూరితుఁడు సర్వతంత్ర స్వతంత్ర భావుఁడగు చౌడప్పగూడ

"ముందుగఁ జను దినములలోఁ
గందమునకు సోమయాజి ఘను డందురు నేఁ
డందఱు నను ఘను డందురు
కందమునకుఁ గుందవరపు కవి చౌడప్పా !"

అని తిక్కన కందపద్యరచన పేర్కొనక తప్పినది గాదు.

శ్రీకృష్ణుడు రాయబారియై "సంధికిఁ బురుషకారమొనర్చెద నోపినంతయున్" అని కౌరవసభ కేగెను.

"ఆ కొలువు వారు కర మచ
లాకృతి నొక పలుకు లేక యందఱు వింజం
బా కిడిన కరణి నవశ ము
దాకారితచిత్తవృత్తులై యుండంగన్
జలదధ్వనగంభీరత
నెలుఁ గొప్పగ దంతదీప్తు లెసంగ ముకుందుం
డలరు చవుల నఖిలజనం
బులు విన ధృతరాష్ట్రభూవిభూన కిట్లనియెన్
జననాథ నీ యెఱుంగని
పనులు గలవె య్యైనఁ దగవుఁ బరమహితంబుం
దన వారికిఁ జెప్పగఁ దగు
నని వచ్చితి భారతాన్వయము ప్రియమందన్"

"కౌరవపాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొందియున్కి మే
లారయ నాకు నీకుఁ గుల మంతకు నీ నృపకోటి కుర్వికిం
బోరిత మైన నింతకును బుట్టు మహాపద గావునన్ ధరి
త్రీరమణాగ్రగణ్య గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే"

అని సభాసదుల నుద్దేశించి

"సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొంద లేక చెడఁ బారినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చే టగుఁ గాని ధర్మ ని
స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడున్"

అని హెచ్చరించెను.

ధర్మగ్లాని యేర్పడి నపుడు తాటస్థ్యము వహించి మిన్న కుండుట గూడ దోషమే. తిక్కన క్రియాశూరతనే చైతన్య పూరితమైన ధర్మముగాఁ బ్రబోధించెను. గాని కర్మసన్న్యాసము బోధింప లేదు. ఎట్లయినను ధర్మము జయించితీరును. "యతో ధర్మస్తతో జయః" ఎంతటి ఆశాసందేశము! మానవుడు కర్మవీరుఁడై "పురుషకారమే యేకైక పరమపథమని గుర్తింప వలెను". తిరిగి ధృతరాష్ట్రు సంబోధించి

"వారలు శాంతశూరులు భవచ్ఛరణంబులు గొల్వఁగఁ బూనియు
న్నా రటుఁ గాక మీ కది మనంబున కప్రియ మేని యింతకుం
బోరికి వచ్చుచుండెదరు భూవర రెండు తెరంగులందు నీ
కారయ పథ్య మేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!"

పాండవులు శాంతశూరులు. ఎంతటి విరోధాభాసమైనను సత్యమే. శ్రీకృష్ణున కారాజనీతి, వాగ్విన్యాసము, ఠీవి, మూలములో లేని ఉన్మీలనము తెలుఁగులోఁ దిక్కన క్రొత్తగాఁ గల్పించినవే.

శ్రీకృష్ణుని నోట నా మాటలు విన్న ధృతరాష్ట్రుఁడేమనగలడు ! సభాసదు లే మనుకొనిరి ? అనుకరణాసాధ్యము గాని తిక్కన మాటలనే యుదాహరించుట మేలు.

"అనవుడు రోమహర్షణము లంగములం బొడమన్ సదస్యు లె
ల్లనుప్రియమంది నెమ్మనములం బురుషోత్తముఁడింతయొప్పఁగఁబ
ల్కునె మఱు మాటలాడ నయకోవిదుఁ డెవ్వడు ధీరుఁడెవ్వఁ డిం
దనువరి యెవ్వఁ డంచు నచలాకృతులై నెఱి నూరకుండగన్"

కాని సుయోధనుఁడు "వాడి సూది మొన యించుక మోపిన యంతమాత్రయున్ భూమి యొనర్చి పాండునృపపుత్రుల కిత్తునె" అని తన నిశ్చయము తెలిపెను.

"అనిన విని కిన్కఁ బూనిన యలఁతి నగవు
చెలువు మొగమున కొక క్రొత్తపొలుపు సొనర్పఁ
బుండరీకాక్షుఁడగుటెల్లఁబోయి యప్పు
డరుణ కమలాక్షుడగుచు మురాంతకుండు"

నవ్వు మొగమున కొక క్రొత్త పొలుపు దెచ్చును. నిజమే; నవ్వు తెలుప లేని భావమేది ?

నవ్వు నవరసఖని
నవ్వు అగాధహృదయవిషయసూచిక.

తిక్కన ఎన్ని విధముల నవ్వులనో గుర్తించెను. తిక్కన వాడిన నవ్వుల నేరికూర్చిన అతఁడెట్టి మనోధర్మపరిజ్ఞాతయో తెల్లమగును.

"కలకల నవ్వు" "పక పక నవ్వు" "పిన్న నవ్వు" "కన్నుల నవ్వు" "వెకిలి నవ్వు" "అనాదరదరహాసము" "నవ్వు గాని నవ్వు" "రుచిస్మితము" "సుందరమందహాసము" మున్నగు నవ్వుల నెన్నిటినో తిక్కన ప్రయోగించెను. నవ్వు ఆనందము కంటెను ఒకప్పుడు దుఃఖమునే యెక్కువ సూచింపవచ్చును. అది ఏడవని నవ్వు కావచ్చును. తిరస్కారము చూపు నవ్వు మాటలకంటె ఈటెలకంటె ఎక్కువ వాడికలది.

తిరస్కారము గాని అనురాగము గాని మాటలకంటె కన్నుల నవ్వులే బాగుగ వ్యక్తీకరింపఁగలువు. అట్టినవ్వు గ్రుచ్చి కొనిన ఆ

గాయము మాన్పుటకు మందు లేదు. శిఖండి భీష్మ నెదుర్కొని నపుడా మహావీరుఁడు "మరలి చూడ కతని నుద్దేశించి పలికె దరహాసముతో" "నీవు శరకోటి వెసం బరఁగించితేనినే నవ్వుదుఁగాని కోపము మనంబునఁ బుట్టదు సూ శిఖండినీ"! జగదేకవీరుఁడగు భీష్ముని నవ్వున కెవరు భాష్య మొనరింపఁగలరు ?

భీష్ముడు బాణవముల వేయకున్నను శిఖండి యొడలు భగ్గుమన్నది. భీష్ముని బాణముల కా నవ్వున కున్న శక్తి యుండునా? అంపకోల పై ఁబడుచున్నను ఎత్తిన ధమవు తునియలైనను తిక్కన చిత్రించిన వీరులు "అల్లని నవ్వోలయుగ" మరి యొక ధనువు నెత్తికొని యుద్ధమున కుపక్రమించిన యుదాత్త మూర్తులు.

ద్రోణుఁడు అభిమన్యుని పొగడు చుండెను. "అనిన వెలుఁక బాటి యతిదీనమగు నాసనమున నవ్వు గాని నవ్వు మెఱయు" దుర్యోధనుఁడు ద్రోణుని సమీపించి "ధనువు వట్టిన వారికి నెల్ల నొజ్జయైన గురుని యుపేక్షఁజేసి తనకున్ సమరోద్ధతి చెల్లె గాక ఈ వెరవడి గాన లేడు తన వీరమఁగాఁగొని విఱ్ఱవీగెడున్" అని పెదవి విరుచును. ఏ చిత్రకారుడైన దుర్యోధనుని పెదవుల విరిగిన ఆ "నవ్వుగాని నవ్వు" చిత్రింపఁగలడా? భువనేశ్వరములో ప్రేమలేఖను వ్రాయుచున్న శిల్పప్రణయిని పెదవులపై చిందులాడు చిరునవ్వు; "మోనోలిసా" అను చిత్రలేఖనమున పయస్విని కెమ్మోనిపై 'లియోనార్డో డావ్వింసి' చిత్రించిన దరహాసముద్ర గాంచి ప్రపంచము మురిసిపోవు చున్నది. అక్షర ప్రపంచమునందు తిక్కన చిత్రించిన చిరునవ్వులు జగన్మోహనవములు. విచిత్రమనోవిశేవిషయసూచికలు. అగాధ హృదయంగమములు. అత్యద్భుతములు.

షేక్స్పియరుమహాకవి యొకచోట "కులుకు నవ్వుల వెన్నెల వెలుఁగులు వెల్లి విరియు పెదవుల వెనుకనే విషము తొలుకు హృదయము దాగియుండ వచ్చును" అని హెచ్చరించెను. ఇతరుల కున్నది; తనకు లేదు అను ద్రేవిరింపు కంపు గుండెతో కుమిలెడి కుత్సితాధరములపై విరిసెడి అసూయాశా పాశావిలమ్మైన ఆకలి చిచ్చరకంటి చిరునవ్వు, శ్మశానమున విరిసిన వెన్నెలవలె బీభత్సావహముగనే యుండును.

నవ్వునకు తిక్కనవంటి వ్యాఖ్యాత "న భూతో న భవిష్యతి" అనిపించును.

శ్రీకృష్ణుఁడు రాయబారము తరువాత రహస్యముగ కర్ణుని గలిసికొనును. అందు శ్రీకృష్ణుని నేర్పు, కర్ణుని యుదాత్త సమాధానము మహాభారతమందలి యుజ్వల ఘట్టములలో నొకటి.

"ఒకరుని చేతి ప్రోవును దదున్నతి ప్రాపును గాంచి యెల్ల వెం
టకును గొఱంత లేక పొగడందగు సంపద నొంది యట్టి దా
తకుఁ దుదిఁ గీడు సేసిన కృతఘ్నుని పీనుగునైన రోత వు
ట్టక కబళింపఁ గుక్కలు నొడంబడునే కురువంశవర్ధనా!"

అని విదురుఁడు ప్రకరణాంతరమునఁ జెప్పిన మాట తలపునకు వచ్చును.

తిక్కన కర్ణుని పాత్రోన్మీలనమున మెరుగు మాయని వెలుఁగు రేకల దిద్దెను.

"పాంచాలరాజపుత్రియు సంచితముగ నిన్నుఁబొందు" నని పాండవపక్షమున కాహ్వానించు శ్రీకృష్ణునకు "మదిఁగడు వాఁడి గలదె

నీకు వారిజనాభా!'' అని కర్ణునితోపాటు అందరాశ్చర్యము పొందక తప్పదు. కర్ణుఁడు

''ఏను నర్జునుండు నెక్క టెక్కటిఁ దల
పడకయున్న నగరె పుడమి జజనము
లందు నాదువచ్చుటతని కపకీర్తి
యనిన నాకు వేఱె అడుగ నేల?''

అదిఁయుగాక ధర్మతనయుని గూర్చి,

''అట్టి ధార్మికుఁ డాధిపత్యంబుఁ జేయ
వలవదే శాశ్వతంబుగ వసుధ యెల్ల''

అనియుఁ జెప్పును. కర్ణుని స్వామిభక్తికి ఔదార్యము మెరుగు పెట్టినది.

కర్ణుడు భీష్ముఁడు సేనాపతిగా వున్నపుడు యుద్ధము చేయలేదు. భీష్ముఁడు తన్నర్థుఁడని గణించుటచే రోషమునఁ గర్ణుఁడు అస్త్రసన్న్యాసము సల్పెను. భీష్ముఁడు శరతల్పగతుఁడయ్యెను. కర్ణుఁడా మహావీరునిఁ జూడ నేగెను. తిక్కన యా సన్నివేశము నత్యద్భుతముగఁ జిత్రించెను.

''తదనందరంబ కర్ణుండు గాంగేయుకడకుంబోయి భక్తి వినయంబులు దోపం బాదప్రణామం బాచరించిన'' భీష్ముఁడతని నొక్క కరంబు వంలంచి కౌగిలించుకొని, వమున్నతని నాడిన నిష్ఠురములు శిక్ష గాని రోషంబు గాదని పలికి

"నీ యుదయము దైవిక గ
ర్భాయత్తము నీకు మర్త్య లసదృక్షులు గాం
తేయుఁడవు గాని విను రా.
ధేయుండవు గావు నీవు ధీరవిచారా

ఇది కృష్ణద్వైపాయనుండు నాకు నేకాంతంబున నెఱింగించె. నేనును భవదీయతేజోవిశేషంబు వలననుంగనుంగొని యుండుదు గావున నక్కౌంతేయులఁ గలిసియుండు" మనెను.

అర్ధరథుఁడని కర్ణు నెన్నిన భీష్మని మాటలేనా యివి! భీష్మునకు లలోపల గర్ణుఁడనిన నెంత గౌరవమున్నది! కర్ణుని సమాధాన మా గౌరవము సార్థకము చేయుటయే గాక యినుమడింపఁ జేసినది.

"కౌంతేయుఁడ నగుదు నిది
యంతయుఁ దొల్లియుని వింటి నార్యులచే వి
ట్లంతయు నెఱింగిన గుంతీ
సంతానముతోడి పొత్తు సనునే నాకున్

వారు మహాబలుల్ హరియు వారికిఁ బ్రాపు గలండు వారలం బోర జయింప రామియును బుద్ధి నెరుంగుదు నైనఁ గౌరవ క్ష్మారమణుండు సేయు తగు మన్ననలెల్లఁ దలంచి చూచినన్ భూరివివేక యే విడిచిపోవుట ధర్మమె వీరకర్మమే!

దైవాధీనము సర్వమున్ మన మతిం దప్పింపగా వచ్చునే నీవింకన్ నను నొండు వల్కక పరానీకంబుపైఁ బంపు మ త్సేవాధర్మము నిర్వహించెద బలోత్సేకంబు లోకంబునన్ భావింపన్ విహరించెదం మురిపుం బార్థుం దలంకించెదన్.

అన విని భీష్ముఁడిట్టు లను నంతకుఁ జాలు టెరుంగనే సుయో
ధననునకు నెప్డు నీదు భుజదర్పము కాదె సహాయ మెద్ది యా
తనికిఁ బ్రియంబు దానిన యుదాత్తమతిం దగ నాచరింపు నీ
మనమున సంతసిల్లు మనుమానము మాను మనుజ్ఞ
యిచ్చితిన్''

ఈ సమావేశమువలన భీష్మ కర్ణు లిరువురి పాత్రములు మెఱుగెక్కినవి.

భీష్మపతనానంతరము దుర్యోధనుఁడు కర్ణునితో ''సర్వ యోధసంభావితుఁడైన శాంతనవు బాహుల మాటున నస్మదీయ సేనావిభవంబు సెల్లెఁ బదినాళ్లును నీ మది కెక్క నాదు యోధావళి నింకఁ బృతనాధిపుఁగాఁగొన నెవ్వఁ డర్హుఁడో'' నిరూపింపుమని వేడెను. కర్ణుఁడు తన్ను దావరించుకొన లేడుగదా. అతడెవరి మనస్సు నొవ్వకుండ కార్యవాదియై యంద ఱుబ్బునట్లుగ ద్రోణుని సేనాపతిగ వరించెను.

''అధిప నీ యోధులయందు సేనా
పతిత్వమునకుఁ జాలని వారు గలరె ?
అందఱు నయవిక్రమాది గుణంబుల
మాననీయుల యట్టు లైన నెల్ల
వారి ముఖ్యులఁ జేయవచ్చునే యొక్కరు
గైకొన్న మత్సరగ్రస్తబుద్ధి
నన్యులు విపరీతులై కలంగక యుండు
వారు గావలయు నెవ్వరును ద్రోణు

డనినఁ గారన రాతండ యర్వ్వఁడాధి
పత్యమునకు నాచార్యుండు బ్రాహ్మణుండు
వివిధరణకోవిదుఁడు వయోవృద్ధుఁ డధిక
బలుఁడు శూరుండు గట్టుము పట్ట మతని.;''

యుద్ధభూమిని వీరులఁ బలువురఁ గూడఁ గట్టుకొని నడిపింపఁ గల దక్షుల నోటినుండి వెడల వలసిన మాటలఁచూచి వేయఁ గలిగిన యుద్ధనీతి విశారదుఁడు తిక్కన.

యుద్ధనీతియందు వ్యూహనిర్మాణవిజ్ఞానమందు తిక్కనకుఁ గల ప్రత్యక్షానుభవ మాతని యుద్ధపంచకమందలి ప్రత్యక్షరమునందుఁ దొలుకాడుచుండును.

తిక్కన యుద్ధవర్ణనములు పేర్కొనఁ దగినవి. యుద్ధభూమిని జీవితకాలములోఁ జూచి యెరుఁగని వారి వర్ణనల తెఱఁగు వేరు. తిక్కన యుద్ధభూమిని కన్నులకుఁ గట్టినట్లు చిత్రించుటయే గాక "దారుణప్రియదర్శనంబయ్యె" "రమణీయ భయానకమయ్యె" "నెత్తుట దోగిన మేని కమనీయరుచి" అని వర్ణించెను. అఖిలఘోరబీభత్సదృశ్యములు తిక్కన కెట్లు రమణీయములుగా సాక్షాత్కరించినవో!

రుక్మరథుం డను వాఁడు పాండుపౌత్రుం దలపడి తొమ్మిదియమ్ము లురమ్మునను నాటించి వెండియు నేయం గడంగునెడ సుభద్రాసూనుండు

"శరముతోడ నొక్క కరము చాపముతోడ

నొకటి బొమలు గదిపి యున్న యుగ్ర
రేఖతోడఁ దల ధరిత్రిపైఁ బడ నేసె
రయము మెఱయఁ బటు శరత్రయమున''

రుక్మరథుఁడు విల్లెక్కు పెట్టి బాణప్రయోగమునకు సంసిద్ధుఁడై యున్నాడు గనుక, యతని తల ''బొమలు గదిపి యున్న యుగ్రరేఖతోడ'' క్రిందఁ బడి బిగిసిపోయినది. తెగిన తల యందు బొమలు గలిసియున్న యుగ్రరేఖనుగూడఁ దిలకింపఁ గలిగిన తిక్కన నిశితదృష్టి ప్రత్యక్షరణక్షేత్రపరిచయము పేర్కొన దగినది. మరణించిన అభిమన్యుడు.

''ఉన్నతగతి సెడి యుర్విపైఁ గడువిన్న
నై పడియున్న సుధాంశుభంగి'' నుండెను.

''నెత్తుటఁ దోఁగి నేల యెఱనింగి తెఱంగున నుండె నక్కు మా
రోత్తముఁడందుఁ జంద్రు క్రియనొప్పె పితాయుధఖండభూషణో
దాత్తమణిప్రతాపములు తారల చందమునొంది యందమై
యత్తఱి నుల్లసిల్లె వసుధాధిప చూపర పిండు చూడ్కికిన్

కరికళేబరములు ధరణీధరములు తురంగ
గాత్రమ్ములు గ్రాహసమితి
నరశరీరములు మీనములు గొక్షేయక
క్షురికాది శస్త్రంబు లురగకులము
రుధిరార్ద్రశరములు రుచిరప్రవాళముల్
ప్రేవుల ప్రోవులు ఫేనతతులు
నెత్తురు వెల్లువ నీళులు భూషణ

స్తోమాస్థి చయములు తుమురు లిసుక
గాగ నంబురాశి కరణి సంగ్రామ భూ
భాగ మొప్పుమిగులభవ్యయోగ
నిద్రనున్న విష్ణునకుఁ బాటి యగుచు శో
భిల్లె నమ్మురారి యల్లుఁ డందు.

అభిమన్యుఁడు గూలినప్పుడుగూడ నంత "అందమైై" యుద్ధభూమి తిక్కనకుఁ గనుపించినది. యుద్ధభూమిని తిక్కన ప్రేమించినట్లు కనఁబడుచున్నది.

దుశ్శాసనుఁ జంపి నెత్తురు ద్రావుచున్న భీమసేనుఁడు "రక్తంబుచాయ దలిర్పం దనువుగ్రసుమదరముగా" నేతెంచెను.

సంగ్రామరంగమునఁ దొడలు విరిగి పడియున్న దుర్యోధనుని అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలు గాంచిరి.

"కడుబెట్టిదంబగు గాలిచేఁ గూలిన
 మహనీయ సాలభూరుహము పోల్కి
బ్రబలకిరాతమార్గణముఁ ద్రెలళిన
 రాజితవన్యమార్గణముఁ మాడ్కిఁ
గల్పాంతవాయునఖస్ఫురణంబున
 నివిరిపోయిన మహార్ణవము కరణిఁ
గాలపర్యయమునఁ దూలి మేదిని మీఁదఁ
 బడిన పూర్ణేందుబింబంబు పగిది
ధరణిఁ బడి యుండియును నొప్పు దరుఁగకున్న
యన్నరేశ్వరుఁ గనుఁ గొని యడలు నెడల

తోడ మేనులు దూలఁగఁ దొట్రు పడుచుఁ
జేరి యాతనిచుట్టు నాసీనులైరి''

విధివిలాసవిభ్రమము విచిత్రము. పదునొకండ క్షౌహిణులంతరించినవి. రాజరాజు ఊరుభంగమున కదలలేని స్థితిలో, మిగిలిన ముగ్గురు వీరులలో అశ్వత్థామను సేనాపతిగ నభిషేకించి పంపెను. ఒకనాడు పాండవపక్షపాతియగు అశ్వత్థామ ఆనాడు దుర్యోధనునికంటె నెక్కుడుగాఁ బాండవుల ద్వేషించి, భూమి నపాండవ మొనరింప శపథము పూనెను.

మహాభారతము మానవజీవితమువలె మహావిచిత్ర విరోధాభాససమ్మేళనము. కర్ణుఁడు కుంతీపుత్రుఁడై సహోదరులతో యుద్ధమునకు దిగక తప్పలేదు. అతనికి గత్యంతరము లేదు. విచిత్రవిధివిలాస మది. కసిగందుగ నున్నపుడు గంగలో విడిచి పెట్టిన కర్ణుని సన్నిధికే కుంతి పుత్రభిక్ష నర్థించుచుఁ జేరవలసి వచ్చినది. శల్యుఁడు పాండవులకు మేనమామయయ్యు గూడ దుర్యోధనుని సేనలోఁ జేరక తప్పినది గాదు. భీష్మ ద్రోణుల మాట చెప్పనేల? ఈ ముగ్గురు స్వపక్షపరాజయమే కోరుకొని ప్రాణములు సంతోషముతో వదలిరి. సత్యసంధుఁడగు ధర్మరాజు గూడ ''అసత్యమాడక'' తప్పినది గాదు. జగదేకధనుర్ధరుఁడైన అర్జునుఁడే శ్రీకృష్ణనిర్యాణానంతరము కిరాతులచేత భంగపడవలసి వచ్చినది.

మానవజీవితములోని పతనోత్థానములు మానవహృదయములోని చీకఁటి వెలుఁగులు పూర్ణపురుషాయుష మనుభవించి స్వానుభవమున గ్రహించిన మహానుభావుఁడు తిక్కన,

మహాభారతములోని ఈ యద్భుత సన్నివేశముల సమబుద్ధితోఁ జిత్రింప గలిగెను.

అర్జునుఁడు సేనాపతియై విజృంభించుచున్న కర్ణుని గాంచి

"పట్ట పగటింటి సూర్యునిఁ బగిది గర్ణు
డుగ్రమూర్తియై వెలుఁగుచునున్నవాఁడు
మన రథం బిష్టు మాధవ మరలనిమ్ము
బ్రదికియుండిన శుభములు వడయ వచ్చు"

అని తప్పుకొని పోవలసి వచ్చెను.

యుద్ధానంతరము తర్పణములు విడుచునప్పుడు కుంతీదేవి ధర్మరాజుతోఁ గర్ణుఁ డతని కగ్రజుఁడేయని వెల్లడించును. ధర్మరాజు మనస్సులో రేగినవి ఝుంఝూమారుతములు, బ్రద్దలైనవి అగ్ని పర్వతాలు, ఉద్భవిలలినవి భూకంపములు ! అది జీవితము. స్త్రీపర్వమునందు వివిధములైన చందస్సులతో మానవ జీవితానుభవ వైవిద్యమును తిక్కన వర్ణించెను.

యుద్ధానంతరము శాంతిపర్వమునందు మానవజీవితము నందలి పతనోత్థారముల సమీక్షించు నీతులను నిర్వికల్పసమ చిత్తవృత్తితోఁ దిక్కన నివేదింపఁ గలిగెను. అందలి యుపాఖ్యానములు స్వయంసంపూర్ణములైన పద్యకథానికలు. తిక్కన ఉత్తమకథానికల నెన్నిటినో పద్యరూపమున వ్రాసెను.

మూషికమార్జాలసంవాద మట్టి పద్యకథానికలలో నొకటి. ఆ మార్జాలముగాని, మూషికముగాని, మేధవికసింపని మూక

జీవములుగావు. నిత్యజీవితములో మన కెన్నియో యట్టి మానవ మార్జాలమూషికములు కనుపించుచునే యుండును.

అడవిలో మాలని యుచ్చులో రోమశుఁడను పిల్లి పడెను. ఆ చెట్టు క్రింది లాఁగలనున్న యెలుకను భక్షింప గూబ, ముంగిస యేతెంచినవి. ఎలుక, యురి కొరికి రక్షింతునని చెప్పి పిల్లి యొడి చేరినది. పిల్లికి భయపడి గూబ, ముంగిస పారిపోయినవి. కాని వెనువెంటనే యెలుక, యుర్రితాళ్లుకొరికి పిల్లిని విడిపింప లేదు. మాలని రాకవఱకు వేచియుండి, యప్పు డురి కొరికి వేసినది. మాలనిఁ జూచి భయమంది పిల్లి చెట్టెక్కిపోయినది. ఎలుక కన్నమున దూఱినది. మాలఁడు నిరాశతో నిష్క్రమించెను. పిల్లి, ఎలుకలు బయటికి వచ్చి, తనతో స్నేహము సలుపుమని యెంతయొా వేడికొనెను.

''బలవంతుడైన శత్రుని
వలనఁ బ్రయోజనము గలిగి వలను కలిమి దాఁ
గలిసియు నది గడచనఁగా
దొలఁగ వలయు నమ్మె నేనిఁ దుదిఁ గీడొలయున్.

బలు పగఱ వలని యాపద
దలుఁగుటకును రిపుని హీనతరుపైనఁ దనుం
గలిపికొని బ్రదుకుటకు ని
య్యెలుకయుఁ బిల్లియును వెరవు లెఱిఁగించెఁ దగన్.''

మానవుఁడు పురుషకారి కావలెనని మహాభారతరచనమున తిక్కన ఉద్బోధించెను. ఆ సందేశమే ఆ యుగధర్మము.

ఆ యుగముద్ర తిక్కన సమకాలీనుల కావ్యములందుఁ గూడ గపనించుదను. బద్దెనృపాలుఁడు వ్రాసిన నీతిసారముక్తావళి యందుగూడఁ తిక్కనయుగముద్ర గపనించుచుండును.

"నయమున గాని భూమిప్రజ నమ్మదు; నమ్మిన గాని యర్థ సం
చయమును దంత్రవృద్ధియును చాలదు; చాలినఁగాని శత్రులన్
బయి చని యోర్వరాదు; ప్రతిపక్ష మణంగినఁగాని భూమి య
క్షయముగ నేల రా దనిరి; కావ్యచతుర్ముఖ బద్దెభూపతీ."

తిక్కన యుగమువారు జీవితము నొక లలితకళగా, మహోద్యమముగ, వీరక్షేత్రముగఁ బరికించిరి. పురుషార్థముల నన్నిటియందుఁ దుల్యగౌరవము కలిగి యుండిరి.

"పాఱకుమీ రణమందున" అను సుమతిశతకపద్యపంక్తి "మగురాడువార మైతి" మను ఖడ్గతిక్కన భార్యమాట-భారతవీరులు చరిత్రలు - తిక్కన రాయబారము అంతయు ఒకే శ్రుతిలో వినిపించును.

చారుచర్యయను గ్రంథమందు బ్రదుఁకు నెట్లు తీర్చి దిద్దుకొని సుఖతరము చేయబచ్చునో గలదు. కేతన, మంత్రి మిత్రుఁడు, కృతిపతియుగు తిక్కన ప్రోత్సాహకముచే "విజ్ఞానేశ్వరీయము" మితాక్షరికిఁ దెలుఁగు సేత యొనరించెను. మారన మార్కండేయపురాణము రచించి బ్రదుకు కవ్వలిసీమలఁ బ్రస్థానించెను.

తిక్కన, వ్యక్తిమాత్రమే గాఁడు. అత డొక మహా వ్యవస్థ. మహాజీవదుద్యమము. సమకాలీనగ్రంథములం దతని

ఆత్మీయతాముద్ర గనుపెంచినట్లే, యాతని మహాభారతమునందల నాటి మహోద్యమములు కావ్యరీతులు నంతర్గీతమ్మైయున్నవి.

తిక్కనకవితాశిల్ప మర్వాచీనకవులపై మిక్కిలి ప్రభావము వహించినను. నెవరికిని సంపూర్ణముగ సిద్ధింపలేదు. తిక్కన ప్రత్యక్షశిష్యుడైన మారనకే గురుశిల్పము కొంతవరకైన సిద్ధింపలేదు. మారన "నవీనపరాశరసూనుఁ దిక్కకవీంద్రుని గొల్తు" నని దూరముగ నిలిచియే నమస్కరించి తన తెమ్మునఁబోయెను.

శ్రీనాథుఁడు "నిర్వంచితకీర్తివైభవవిరాజికిఁ దిక్కన సోమయాజికి" నమస్కరించి "ప్రాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచితబంధముగ నొక్కొక్కమాటు" అని యదార్థము వచించెను. ఒక్కొక్క మాటు శ్రీనాథునివంటి వారు తిక్కన, రసాభ్యుచితబంధము ననుకరింపఁ జూచిరిగాని యాతని కవితాశిల్పము నంతటిని సమగ్రముగ నెవ్వరు ననుకరింప లేక పోయిరి. కొంద రాతని స్వప్నకథను మాత్ర మనుకరింపఁగల్గిరి. మరికొందరు "హా యను ధర్మరాజతనయా యను" వంటి పద్యముల చట్రముల మాత్ర మనుకరింపఁ గగలిరి.

నాచన సోముఁడు వేంకటనాథుఁడు హరిహరనాథుని కంకిత మొనర్చుట ననుకరింప గగలిరి.

"అలికంబున యక్షిని దాచిన సర్వజ్ఞుఁడని" ప్రస్తుతి గనిన నాచన సోముఁడు, తిక్కన సజీవపాత్రచిత్రణము, మనోధర్మ పరిజ్ఞానము, పదప్రయోగము, పలుకుబడులు, సంభాషణాచారము

ననుకరించి భారతమునకు ఖిలపురాణమ్మైన హరివంశము వ్రాసి యతని ప్రక్క, పీట వేయించుకొనఁ జూచెను.

నాచనసోముఁడు "హరి మేలంచు హరుండు మే లనుచు నేలా తర్కముల్" అని తగతరిగ నిల్చెనె గాని యతనికి తిక్కన హరిహరనాథవేదాంతమందలి "ధర్మాద్వైతము" పట్టువడలేదు. సంభాషణచాతురిలోఁగూడ తిక్కన ఆత్మసంయమము ఔచితీపాలనము నాచనసోమునకుఁ బట్టు వడలెదు.

ఊర్వశి, నరకుని బారినుండి తప్పించుకొనఁ జూచి "సంతలో జవ్వన మమ్ముకొన్న ముదిసాని ననుం గవయం దలంచితే" యని తప్పించుకొనఁజూచును. "ఎంత తరిగిన మిరియాలుం జొన్నలకున్ సరిరావే" యని నరకుఁ డామెను గవయం జూచుచు ఈ రాక్షస శృంగార సంభాషణలోఁ దిక్కన నిశితత్వ మున్నది గాని నిగ్రహము లేదు.

సజీవపదప్రయోగమునందు జీవత్ పాత్రచిత్రణమునందు, సంభాషణచాతుర్యమందు, మనోధర్మ పరిజ్ఞానమునందు చలచిత్రభంగిముల వర్ణించుటయందుఁ దిక్కన కవితా శిల్పము పట్టుపడినవాడులో పింగళి సూరన. "కలకల నవ్వినట్లు; తెలిగన్నుల నిక్కము చూచినట్లు తోఁబలుక కడంగినట్టు"న్నది ప్రద్యుమ్నుని చిత్రము. పింగళి సూరనకుఁ దిక్కన వేదాంతముగాని ఆధ్యాత్మికోన్నతిగాని లేవు.

ఆధ్యాత్మికనైర్మల్యమునందు ధూర్జటి, తిక్కనకు దలపింపఁ జేయును.

"ఏ లీలన్ నుతియింప వచ్చు నుపమోత్ప్రేక్షాధ్వనివ్యంగ్య శ
బ్దాలంకారవిశేషబాషల కలభ్యంబైన నీ రూపముం !
జాలుం జాలు కవిత్వముల్ నిలుచునే సత్యంబు వర్ణించుచో !
ఛీ లజ్జింపరు గాక మాదృశకవుల్ శ్రీ కాళహస్తీశ్వరా"

అని ఆలపించిన ధూర్జటి ఆత్మనివేదనము తిక్కన హరిహరనాథోపాసనను దలపింపఁ జేయును.

భక్తివైరాగ్యములయందు పోతన తిక్కనను దలపింపఁ జేయును. "ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబుల" కాసపడని వైరాగ్యమువలన పోతన మహాకవికి గుండెలోఁ గోవెల గట్టి యారాధించు భక్తులెందఱో గలరు. "ఇమ్మనుజేశ్వరాధములు" అని పారుష్యతరంగితమైన వాక్కు గూఁడ లేక త్రిగుణాతీతుఁడైన మహాతపస్వి తిక్కన. కవులు భ్రష్టతపస్వులు – "యోగభ్రష్టో కవిశ్రేష్ఠః" యోగి పదమునుండి అవతరించిన కవులున్నారు గాని తిక్కన కవిపదమునుండి యోగిపదమున కారోహించెను.

తన వూరిగుడిసెనుండి మహాప్రసాదముగనే స్వీకరించి సంతృప్తినే చెందఁగల వైరాగ్యసంపన్నుఁడు మహానుభావుఁడు. తన మహాప్రాసదమునుగూడ పూరిగుడిసెయట్టులే భావింపగల సమబుద్ధిభూషితుడు మహామహితాత్ముఁడు. తిక్కన యిట్టి మహామహితాత్ముఁడు.

తిక్కన మహాయోగి గనుక మహాకవిగా గౌరవింప వలెనని కాదు. తిక్కన ప్రధానముగాఁ గని. వేదాంత నుతని కవితాస్రవంతికి అంతర్వాహిని మాత్రమే. అందుచే దిక్కన భారతము ప్రబంధ

మండలిగ రచించెను. భగవద్గీతాసారమును విడువకుండఁజెప్పినను, యథాక్షరానువాదము సలుపలేదు. వేదాంతముగూడ, కాంతాసమ్మితముగ మహాభారతమునఁ జెప్పి, తిక్కన పురుషార్థముల కర్థవివరణ సలిపిన మహాకవి యయ్యెను.

తిక్కన విదురుని నోటఁ దాదాత్మ్యసిద్ధితోఁ బలికించిన పల్కులు చిరస్మరణీయములు.

''మాలకరి పుష్పములు గోయు మాడ్కిఁ దేటి
పువ్వుఁ దేనియఁ గొనియెడు పోలిక నెదురు
గంద కుండఁగఁ గొనునది కార్యఫలము
బొగ్గులకుఁ బోలె మొద లంటఁ బొడవఁ జనదు,''
''పరుల ధనమునకు విద్యా
పరిణతికిం దేజమునకు బలమునకు మనం
బెరియఁగ నసహ్యపడు న
న్నరుఁడు తెవులు లేని వేదనం బడు నధిపా''

''ధనమును విద్యయు వంశం
బును దుర్మతులకు మదంబుఁ బొనరించుచు స
జ్జను లైన వారి కడఁకువ
యును వినయము నివియ తెచ్చు నుర్వీనాథా''

నన్నయకూడ, ''మితహితసత్యవాక్య''మును బ్రశంసించి ''వాక్పారుష్యము నన్నె మహాదారుణ మది విషముకంటె దహనము కంటెన్'' అని ధర్మరాజు నోటఁ బలికించెను. ఎదిరి కందకుండఁగఁ,

దేటి తేనె గ్రైగొను నట్లు కర్తవ్యము నెరవేర్చు కొనవలెనని తిక్కన యుద్బోధించెను. ఇంతటి తియ్యని గుండెలనుండి స్రవించుటచేతనే నన్నయ తిక్కనల వాణి యుగయుగాంతరములు తేనె సోనల నొలుక గలుగుచున్నవి.

వర్డ్సువర్తుకవి, భావావేగమును అనుస్మరణపూర్వకముగా పునస్సృష్టి సల్పుటయే కవిత యని ప్రవచించెను. రాజశేఖరుఁడు కావ్యమీమాంసలో "ప్రతిభ"ను భావయిత్రి-సమాధి-కారయిత్రిగ, ప్రస్తరించెను. భావయిత్రి కవికిగల నవనవోన్మేష ప్రజ్ఞావీక్షణ. కారయిత్రి ఆ దర్శనపు ప్రదర్శనోన్ముఖ సాఫల్యము. కవులలో భావయిత్రి, కారయిత్రి శక్తులు పుష్కలముగ నుండియు సమాధి కొఱవడుటచే మహాకవులు కాలేక పోవుచున్నారు.

కవి తన యావేగమును నిగ్రహించి సమాధిబద్ధము చేసి పునస్మరణ రూపముగనే కవిత చెప్పవలెను.

ద్రౌపది కీచకవధానంతరము తన భావావేగమునకు "గరువతనమను బలితంపుఁ గట్ట వెట్టి ధీరయ్యె" ననును.

"మనమున నెలమి సొం పొదవి నెమ్మొగమునఁ
దోఁపంగ వచ్చినఁ ద్రోచి త్రోచి
లలి నుల్లసిల్లుచు లలితలోచన దీప్తు
లడర నుంకించిన నాఁగి యాఁగి
సంతసంబున బాలశములగు చెయ్వులు
దొడరఁ జూచినఁ జేయ కుడిగి యుడిగి
మనమున నుబ్బుమై మాట నాలుకను రాఁ

గడఁగిన నాడక కడపి కడపి
ధీరయై యిట్లు సమ్మదపూరమునకు
గరువతనమును బలితంపుఁ గట్ట పెట్టి
పెలఁది యెఱుఁగనియది వోలె వికృతి లేక
యల్ల నెప్పటి యట్టుల యరుగుటయును.''

కవితోద్వేగమునకు గఱువతనము తోడు గావలెను. కవి తన భావస్రవంతికి ఆనకట్ట కట్టవలెను. కవితాప్రపంచమునఁ కూడ ఆత్మసంయమమే విశ్వవిజయము.

తిక్కనలోఁగల భావనిగ్రహము భావసమాధి ఆంధ్రవాఙ్మయము నందతనికి మహోదారస్థానము గల్పించుచున్నవి. సహజముగ ఉద్రేకస్వభావులగు కవులలో నిగ్రహశక్తి యుండుట మిక్కిలి యరుదు. భావోద్వేగము, ఊష్మలత లేనిదే కవియే కాలేడు. తిక్కనకున్న యీ నిగ్రహశక్తి ప్రపంచ వాఙ్మయమునందు మిక్కిలి అరుదు.

కవి ఆత్మీయత కావ్యములోఁ బ్రతిఫలించును. కావ్యములోఁ బ్రతిఫలించునది కవి భౌతికరూపము గాదు. కవి యిష్టానిష్టములు భౌతిక జీవితము మానసికతత్త్వము మున్నగునవి కావ్యమువలనఁ దెలియ వచ్చును. కాని సూక్ష్మదృష్టి గల సహృదయుల మనోనేత్రమునకు కవి యంతరాత్మ విశ్వరూప ప్రదర్శనము సాక్షాత్కరించును. అంతరాత్మనుబట్టియే కవికి గౌరవము కలుగును. కవి వ్రాసిన కావ్యములన్నియు ననుశీలించిన తరువాత సాహితీప్రియంభావుకుఁడైన సహృదయుని హృదయమున నేర్పడు గౌరవముద్రను బట్టియే కవికి విలువ గట్టవలెను అనిన, సహృ

దయుఁడైన రసజ్ఞుఁడు తన అంతఃకరణమునే సాహిత్యతులాభారముగ నొనర్చి కవిని తూయవలయును. అందుచేఁ గవులందరకు లోకములో నొకే తూనికయుండుటలేదు. తూకము సరిగా రాకపోవుటకుఁ గారణము తూచిన వస్తువులోని దోషమే గాక తులలోని దోషముకూడ కావచ్చును. అందుచే ఈ సాహిత్యతులాభారమునకుఁ బూనుకొను రసజ్ఞుని హృదయమెంత సుకుమారకోమలమైన నాతని తూకమంత నికరముగా వచ్చును. కళ యొక హృదయము, సానుభూతి గల మరియొక హృదయముతోఁ జేసికొను నివేదనమే గనుక ప్రమాదగర్భితమైనను నీ తులాభారమునకు దిగవచ్చును.

శిరీషకుసుమపేశలసుధామయోక్తుల మనుచరిత్ర రచించిన పెద్దన సుకుమారకోమలహృదయము ఆ కావ్యమునందే ప్రతిఫలించినది. "నిరుపహతిస్థలమ్ము రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడె మాత్మకింపయిన భోజనము" ఇత్యాది భోగములఁ గోరుకొనిన ఆంధ్రకవితాపితామహుని అంతరాత్మ ఆక్రోశము శ్రీకృష్ణదేవరాయల నిర్యాణనంతరము హంసగీతి వలెఁ వినిపించినది.

"ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి
కేలూత యొసగి యెక్కించుకొనియె !
మనుచరిత్రం బందు కొనువేళఁ బురమేగ
పల్లకిం దనకేలఁ బట్టి యెత్తె !
బిరుదైన కవిగండపెండేరమున కీవె
తగుదంచుఁ దాన పాదములఁ దొడగె !

గోకటగ్రామాద్యనేకాగ్రహారంబుల
నడిగిన సీమలయందు నిచ్చె !
ఆంధ్రకవితాపితామహ అల్లసాని
పెద్దనార్య యనుచు నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేగ లేక
బ్రదికియున్నాడ జీవచ్ఛవంబ నగుచు.''

అని వాపోయెను. శ్రీనాథుఁడు గూడ ''కస్తూరికే రాజు ప్రస్తుతింతు'' ''హేమపాత్రాన్న మెవ్వని పంక్తి గలుఁగు'' ''రత్నాంబరంబు లే రాయఁడిచ్చు'' అని అవసానకాలమున ఆటమటించెను. వారు పుట్టకవులు. వాల్మీకి శోకము శ్లోకరూపము గొన్నట్లు వారి మనోవేదన మహాకవిత యైనది. కాని వారి ఆత్మీయతలో రాజసగుణము తొలుకాడుచునే యున్నది.

''ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట పోటులం బడక సమ్మతి నీ హరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకఁడు భాగవతమ్ము జగద్ధితమ్ముగన్''

అని పోతరాజు

''రాజుల్ మత్తులు వారి సేవ నరకప్రాయంబు వారిచ్చు నం
భోజాక్షీ చతురంత యానతురగీభూషాదు లాత్మవ్యథా
బీజంబుల్ తదపేక్ష చాలు పరితృప్తిం బొందితిన్ జ్ఞాన ల
క్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా''

అని ధూర్జటి, ఆలపించినారు.

పెద్దన, ధూర్జటి కవుల అంతరంగములలోఁ గల వ్యత్యాసము, వారి వ్యక్తిత్వములలోఁ గల యంతరమును బట్టి ఆత్మీయతకు విలువకట్టగలవారికెల్ల తేట తెల్లము. ఈ నాడు ఏ సుహోద్భుతదైన వంయోగమునైనను, పెద్దన ధూర్జటి మహా కవు లిరువురు మా యింటికి దయచేసినచో పెద్దనకు కర్పూర తాంబూలము నుపహార మొసంగెదను. ధూర్జటికి సాష్టాంగ మనస్కారము సమర్పించెదను. అనగా కవి గొప్పతన మతని యంతరంగముయొక్క విలువమీదనే యాధారపడి యుండునని సిద్ధాంతముగాదు. కవితాశిల్పమునందు సిద్ధహస్తులైన మహా కవుల నిరువురి తూచునప్పుఁడు మాత్రమే యీ యంతఃకరణ గౌరవము చూడవలెను. అందుచే నరాంకితము చేసిన కవులందరి కంటె ఈశ్వరాంకితము చేసిన కవులు గొప్పవారని చెప్పుట కూడదు.

తిక్కన మొదట నరాంకిత మొనర్చి తరువాత హరిహర నాథాంకితముగ మహాభారతము రచించెను. తిక్కన హరిహర నాథోపాసనలో రాజస తామస వాసనలు లేవు. తిక్కన యంతరాత్మ శుద్ధసాత్వికసమాధి సంపన్నమై యతని యాత్మీయత జ్యోతిర్మయమై వెల్లి విరిసినది. "నానేర్చిన భంగి చెప్పి వరణీయుఁడనయ్యెద భక్తకోటికిన్" అన్న నిరహంకారమూర్తి ఆరాధన విశేషముగ మహాభారతము తెలుఁగున వినిర్మించెను.

మహాకవిత్వదీక్షావిధి నంది పదునేనుపర్వములఁ దెనుగుఁబాస జగద్ధితముగ వినిర్మింపఁ బూనిన తిక్కన జీవితములో నపరసంధ్యాసమయ మది. ఐతిహ్యముకూడఁ దిక్కన పూర్ణ పురుషాయుషజీవి యనియు, గన్నులు గనిపింపని వృద్ధాప్యమున

గురునాథుని లేఖకునిగ స్వీకరించి భారతము చెప్పెననియు కమ్మని కథలు చెప్పుచున్నది. అప్పటికి తెలుఁగు మహాభారతము రెండువందల యేండ్లనుండి మూలఁబడి యున్నది. పండు వృద్ధు తిక్కన పదునేనుపర్వములు పరిపూర్తిఁ చేయగలడా? ముగ్గిన పండు ఎప్పుడు రాలిపోవునో!

చిట్టచివరి పద్యము చెప్పునపుడు తిక్కన యనుభవించిన యానందతన్మయ మెట్టిదో! ఊహింపవచ్చును. మహాభారతము సంపూర్తి చేసి ఫలశ్రుతిగూడఁ జెప్పినమీద శౌనకాదిమునులు కథకుఁడగు సూతు నర్చించిరి. ఇది చివరి మాట

"పరమపదాప్తి హేతువగు భారతసంహిత శౌనకాది భూ
సురవరురు లింపునం గరగు చొప్పునఁ జెప్పిన వారు మోదసం
భరితతఁ బొంది యక్కథకు నర్చితుఁ జేసి రర్మిలిన్

ఈ చంపకమాలలో ఈ మూడు పాదములతో మహాభారతము పదునేను పర్వములు పూర్తియైనవి. చతుర్థపాదపూరణమునకై ఇక నేమి వ్రాయవలెను? వెను వెంటనే

"హరిహరినాథ సర్వభువనార్చితనం దయఁజూడు మెప్పుడున్" అని కృతార్థుఁడై తిక్కన, హరిహరనాథునకు ధన్యవాదములర్పించెను. చరమపాదమునందలి ప్రత్యక్షరమునందు పదునేను పర్వముల 'తెన్నుంగు బాసఁ దుదముట్ట; బుధసంతోషంబు నిండార' రచించి నట్టి తిక్కన జీవితసాఫల్యము, తెలుఁగువాణి కేర్పడిన ధన్యత్వము తొలుకాడు చున్నవి. ఈ చివరి పాదమున తిక్కన

మహాభారతరచన సంపూర్తి చేసిన శుభముహూర్తమున ననుభవించిన నిర్భరానందతన్మయత్వము నేటికిని తెనుఁగుదేశమున వెల్లివిరియుచునే యున్నది.

ఎఱ్ఱన

ఎఱ్ఱాప్రెగ్గడ దక్షిణాపథచరిత్రలో మిక్కిలి ప్రాముఖ్యము వహించిన యుగసంధితో సాహిత్యజీవితము నెరపెను. తిక్కన కాకతీయసామ్రాజ్యము పరాకాష్ఠ నంది, తెలుఁగు దేశమంతయు గణపతిదేవచక్రవర్తి పెల్ల గొడుగునీడను అలపు దీర్చుకొనుచున్న విశ్రాంతిసమయమున మహాభారతము పదునేనుపర్వములు తుదముట్ట తెనుఁగుబాస వినిర్మించెను. తిక్కన నాడు కాకతి ప్రభువుల డెబ్బది యైదుగురు "వీరసామంతులు" గజ రథ తురగ భట సాహిణులు "ఏకశంఖంబులు, నెఱ్ఱగొడుగులు, హనుమంతు పడులు, రెడ్డిరికంబు, గండభేరుండ తలాటములు, అరిరాయ గజాంకుశంబులు, పసుపుపావడలు, డాలుడమారంబులు, ముత్యాలజగ జంపు పంచె వన్నె వాద్యంబులు గలిగి, ఏకాంగి వీరులై సాహిత్యవినోదులై స్వామిద్రోహరగండలై శత్రుమహీపాలకశిరః కందుకక్రీడావినోదులై" దక్షిణాపథమున సనాతన సంస్కృతి ప్రతిష్ఠించిరి. ఉత్తరాపథమంతయు నాక్రమించి తురుష్కుల సభ్యతాసంస్కృతి ఝుంఝూమారుతములు వికటాట్టహాసవిలయతాండవము సల్పుచు వింధ్యపర్వతముల ద్రోసికొని వచ్చుచున్నపుడు, వీర సామంతులు విజృంభించి దక్షిణాపథమున సనాతన సాహిత్య సంస్కృతులకు వింజామరలు పట్టిరి. ఈవీరయుగమే తిక్కన మహాభారతములో, హేమాద్రి చతుర్వర్గచింతామణిలోఁ బ్రతిఫలించినది. పూర్ణజీవితానుభవము నాశించిన యుగమది.

కాని తిక్కన నిర్యాణానంతరము కాలము మారిపోయినది. క్రీ॥ శ॥ 1296 సంవత్సరమున దేవగిరిలో చంద్రవంక బావుటా రెప రెప లాడినది. "మాలిక్ గర్షాస్ప్" సేనాని రామచంద్రునోడించి, దేవగిరి కొల్లగొట్టి, రాజకన్యకను పరిగ్రహించి ఢిల్లీ చేరి, జలాలుద్దీను సుల్తానును హత్యచేసి తానే అల్లావుద్దీను బిరుదులో సుల్తానయ్యెను. అల్లావుద్దీను కాకతీయ సామ్రాజ్యముపై చాల సారులు దండయాత్ర నడపెను. ప్రతాపరుద్రుని నాయకులలో నొకఁడగు పోతుగంటి మైలి

"ఉప్పరపల్లొద్ద నుద్ధతి పైఁబడి ఢిల్లీ తురుష్కుల త్రుళ్లడంచె" అని క్రీ॥ శ॥ 1304-5 నాటి శిలాశాసనమునఁ గలదు. వెలుగోటి వారి వంశావళిలో వెన్న ధరణీపుఁడు, రాణి రుద్రమదేవి మంత్రి రేచర్ల ప్రసాదాదిత్యుని కొడుకు "నన్నద్ధ ప్రసరత్తురుష్క పృతనాసందోహనిర్మూలనోత్పన్నానూనయశుండ" ని వర్ణితము.

ఇట్టి యుద్ధములు క్రీ॥ శ॥ 1323 సంవత్సరమందు ఓరుగల్లు పతనమువరకు సాగినవి.

ఎఱ్ఱాప్రెగ్గడ క్రీ॥ శ॥ 1325 నుండి 1353 సంవత్సరము వరకు రాజ్యము సల్పిన ప్రోలయవేమారెడ్డికి రామాయణము, హరివంశము కృతినిచ్చి యాస్థానకవియై యుండుటచే, నతఁడు క్రీ॥ శ॥ పదుమూడవశతాబ్ద్యంతమున జన్మించియుండునని యూహింపవచ్చును.

ఎఱ్ఱాప్రెగ్గడ బాల్యమునుండి దక్షిణాపథమున తురుష్క దండయాత్ర లారంభ మయ్యెను. అందుచే నెఱ్ఱన దక్షిణాపథమంతయు నట్టుడికి పోయిన దినములలోఁ బెరిగెను.

క్రీ॥ శ॥ 1323లో ఉలూఘఖాన్ (తరువాతి తుఘ్లకు చక్రవర్తి) ఓరుగల్లు జయించిన తరువాత క్రీ॥ శ॥ 1324 సం॥లో రాజమహేంద్రవరమునందలి మసీదు నిర్మించి శిలాశాసనము వేయించెను. అప్పటికి ఎఱ్ఱాప్రెగ్గడ పూర్ణయౌవనములో నుండి యుండును.

కాకతీయప్రతాపరుద్రుఁడు రాజ్యభ్రష్టుఁడై, తెలుఁగు దేశము స్వాతంత్ర్యము కోలుపోయి ప్రజలంద రష్టకష్టములు పడుచున్న దినములలో ఎఱ్ఱాప్రెగ్గడ భారతము రచించెను. ధర్మరాజు రాజ్యభ్రష్టత పాండవుల కష్టములు చిత్రించుటకు ఎఱ్ఱనకు భవ్యకవితావేశము కల్పించినది, సమకాలీనులైన తెలుగువారి దుఃస్థితియే. అంతకుముందు తెలుఁగు దేశము స్వాతంత్ర్యము కోలుపోలేదు. చరిత్రలోఁ దెలుఁగువారికిఁ దగిలిన మొట్టమొదటి దెబ్బ అదియే.

ఎఱ్ఱాప్రెగ్గడ తన భారతభాగమునం దాదిలో మార్కండేయుఁడు ధర్మరాజునకుఁజెప్పిన కలియుగ ధర్మములు కనులకుఁ గట్టినట్లు వర్ణించును.

వివిధవ్యాఘ్రమృగోరగాకులములై విస్తీర్ణశూన్యాటవీ
నివహాభీలములై యరాజకములై నిర్మూలధర్మంబులై
ద్రవిళాభీరతురుష్కబర్బరపుళిందవ్యాప్తిదుష్టంబులై
భువిలో నెల్లెడఁ బాడగున్ జనపదంబుల్
దద్యుగాంతబునన్.

సంస్కృతభారతమున "తురుష్కవ్యాప్తి లేదని వేరుగఁ జెప్పనక్కరలేదు." మూల భారతమున "ఆంధ్రులు" గూడ

బర్బరపుళిందాడులతో గలసియుండిరి. ఎఱ్ఱన, సహజాంధ్రాభిమానముతో "ఆంధ్రుల" ను విడదీసి "తురుష్కుల"ను గలిపెను. తురుష్కవ్యాప్తివలన భువిలో నెల్లెడ జనపదంబులు అరాజకములై పొడగుట ఎఱ్ఱన కనులార గాంచియుండెను.

"వేదనింద సేయుచు"
"అరులు గొని మిగులఁ భయ మొనర్తురు"
"అన్యోన్యపీడ" "ద్రవిడ విహీనులై దాత
యొక్కడు లేక, ఎఱిగెడు వారును నెంతయు
గ్రూరులై చేసిన పాపంబు చేసెదరు సూవె"

అను ప్రయోగము లర్థవంతములు.

అల్లావుద్దీను మొదలగు తురష్కరాజులు దక్షిణాపథమునందలి రాజుల ద్రవ్యము నపహరించుట, ప్రజల దోచుకొనుటయే ప్రధానాశయముగా గలవారు ఉలూఘ్‌ఖాను మున్నగు సేనానులు రాజులయొద్ద కప్పముగా నపారధనరాసులు గొని పోయిరి. సేనలు భాగ్యభోగములతో వెల్లివిరిసినమహానగరముల దోచుకొనిరి. దేవగిరి, ఓరుగల్లు నగరములు విధ్వంసములైనవో .... "పుడమి సమస్తంబు నరకభూయిష్ఠమగున్" అన్న మార్కండేయుని భవిష్యద్వాణి భూతార్థ మయినది. తెలుఁగుదేశము, తురుష్కాక్రాంతమైనప్పటి స్థితి చెప్పు విలసతామ్రశాసనమును జదివి ఎఱ్ఱన కలియుగవర్ణనమును జదివిన, రెంటికిఁ గల కుటుంబసాదృశ్యము తెల్లమగును.

"వనితాదుర్బలదీనబంధుజన సర్వస్వాపహారుల్ సుహృ
జ్జనమాతాపితృపుత్త్రహంతలు యదృచ్ఛాకర్మశీలుర్ ధరన్
జనసంపూజితులై చరింతురు వినష్టశ్రీకులై విప్రు లా
జనలంజేరి పరిగ్రహించెద రవజ్ఞాపూర్వదుర్వృత్తముల్.

ధరణీరక్షణ మాచరింపక నృపుల్ దర్పంబునం బశ్యతో
హరులై సాధులఁ ద్రోచి చేకుఱు తదీయస్త్రీధనక్షేత్రముల్
హరియింపం గలవారు దారుణతరంబై పెల్లు చెల్లుం బర
స్పరయుద్ధంబు ధరాతలేంద్రులకు విశ్వప్రాణి నాశంబుగన్

దేవతాయతనంబులున్ జగతీసురావసథంబులుం
బావనాశ్రమభూములుం బెడి పాడగున్ శుభవృక్షవ
ల్లీవనంబులు నాశ మొందుఁ గలిప్రచారమునందు దు
స్త్రీవిహారము మద్యపానముఁ జెల్లుఁ జెల్లుగ నెల్లెడన్

క్రుక్కిడి చోరులు ముట్టి నిశ్శేష
ముగ ధనావలిఁ గొని మొగి వధింపంగ
స్రుక్కి కాకులయట్లు శూన్యులై చెదరి
సొంపఱి యడవులు సొత్తురు జనులు

క్రమమున రాష్ట్రములును నగ
రములును నాశంబు నొందు రక్షాచ్యుతులై
భ్రమియింతురు బను లతిదు
ర్గమగిరిసరిదంతికములఁ గడు నాతురులై"

"సుహృజ్జనమాతాపితృ పుత్ర హంతలు
యదృచ్ఛా కర్మశీలురు" - ధరన్

జనసంపూజితులై చరించెరని ఎఱ్ఱన వ్రాయుచున్నప్పుడా మహా కవి మనస్సులో నల్లావుద్దీను తుఘ్లకు చక్రవర్తుల రాజ్యసంపాదన, శీలములే యాద్యప్రకృతులుగ భాసించినవి.

ఎఱ్ఱన, దేవతాయతనంబులు, జగతీసురావసథంబులు పొడగుట, అగ్రహారములు నశించుట, మద్యపానదుస్త్రీ విహారములు ప్రబలుట, అరాజకత్వమున రక్షాచ్యుతులై జను లాతురులై అతిదుర్గమగిరిసరిదంతికములఁ జొచ్చుట ప్రత్యక్షముగఁ గాంచి, చెమ్మగిల్లిన కన్నులతో, చెమరించిన దేహముతో, కదలిన గుండెతోఁ బై పద్యములు వ్రాసెను.

కాని, తెలుఁగుదేశము ముస్లిములక్రింద నెంతో కాలముండలేదు. కోలుపోయిన స్వాతంత్ర్యమును సంపాదించుట కొరకై కాకతీయసామ్రాజ్యమునందలి డెబ్బది యెనిదుగురు వీరనాయకులు కలిసి పునఃప్రయత్నము సల్పిరి. ఇదివరలో వీరెన్ని పర్యాయములో శత్రుభీకరులై విజయములు సాధించినవారే. రావెళ్ళవారి బిరుదావళిలోఁ బ్రత్యక్షముగ

"పులువఖానుని సప్తాంగచూఱకార
మలుకనేమాలుని మానమర్దన" అని యున్నది.

ఉలూవ్‌ఖానుని మూలిఖాపరును తెలుఁగు వీరు లనేక పర్యాయములు జయించి యుండిరని ఊహింపవచ్చును. తెలుఁగు వీరుల కత్తిసాము జగద్విఖ్యాతి చెందినది. పట్టుబడిన పోతుగంటి

మైలి, తెలుగు బిజ్జలులలో నెవరుత్తమవీరులోఁ ముస్లిములే పోల్చుకొనలేక పోయిరి. ఢిల్లీలో నాజగదేకమల్లుల ఎక్కటికయ్యము, కత్తిసాము సుల్తాను నింపకొలువు ముందు దాకోలు సందేర్పాటు చేసిరి. అల్లావుద్దీను సుల్తాను, మాలిక్ కాఫరులు తీర్పరులు.

ఢిల్లీలో సురథానుఁ డల్లావదీధరా
ధ్యక్షుండు ప్రత్యక్ష సాక్షి గాఁగ
మహనీయజయశాలి మలికి నేమారుండు
జగదేకశూరుండు సాక్షి గాఁగ
జగతిపై డెబ్బ దేడుగురు నాయంకులు
నక్షీణబలయుతుల్ సాక్షి గాఁగ
సహజసాహసయుద్ధసన్నద్ధవరభటా
శ్రయమైన దాకోలు సాక్షి గాఁగ
సూర్యవంశోదయఖ్యాతుఁ డార్య తెలుఁగు
బిజ్జలనృపాలు గెల్చెఁ దద్భీమబలుఁడు
వైరిగజభీముఁ డమితసత్యప్రియుండు
ఘనభుజాశాలియగు పోతుగంటి మైలి.

కాలకర్మవిపరిపాకమున స్వాతంత్ర్యము గోలుపోయిన తెలుఁగు వీరు లందరేకమైన ముస్లిముల జయించుట సుకరమే. ఇదివరలోఁ బ్రతాపరుద్రుని యెుద్దనున్న వృద్ధవీరులు కొలని ప్రతాపరుద్రదేవుఁడు, అన్నమంత్రి, ప్రోలయ నాయకుఁడు, ప్రోలయ వేమారెడ్డి యీ మహోద్యమమునకు దేశభక్తిపూరితులై ముందునకు వచ్చి నాయకత్వము వహించిరి.

పూర్వవైభవమును స్మరించి దేశమునుద్ధరించుటకై యువకులు, వీరులు నడుము కట్టుకొనిరి. ఆ మహోద్యమప్రవక్తయై ఎఱ్ఱాప్రెగ్గడగూడ నా మహానాయకులు కత్తితోఁ జేసిన ప్రబోధమునే తాను గంటము పట్టి సల్పెను. భారతవీరుల గాథలు, పాండవుల యరణ్యవాసము, వృత్రాసుర విజృంభణము, దేవతల సేనాధిపత్యము వహించిన కుమారస్వామి వృత్తాంతముల, నన్యాపదేశముగ ఈ స్వాతంత్ర్యప్రబోధమునే సలిపెను.

ముసునూరి ప్రోలయ నాయకుఁడు తెలుఁగువీరులకు నాయకుఁడయ్యెను. తెలుఁగుదేశమంతయు తుగ్లకు పరిపాలన కెదురు తిరిగెను. అరవీటి సోమరాజు నాయకత్వమున పశ్చిమాంధ్రమున విప్లవము చెలరేగినది. క్రీ॥ శ॥ **1328** ప్రాంతమున తెలుగుదేశము స్వాతంత్ర్యము వహించి ముస్లిముపరాధీనత నుండి విముక్తి బొందినది. తుఘ్లకు చక్రవర్తి చేయునది లేక ప్రతాపరుద్రుని దగ్గర కోశాధికారులుగ దండనాథులుగనున్న హరిహర బుక్కరాయలు ఢిల్లీలో ఇస్లాము మతము స్వీకరించి చెఱసాల నుండగ, వారిని విడిపించి పశ్చిమాంధ్రమునకు రాజ ప్రతినిధులు బంపెను. వారు స్వదేశము చేరి స్వాతంత్ర్య ప్రవక్త, వేదవ్యాఖ్యాతయైన విద్యారణ్యమహర్షివలన తిరిగి సనాతనమతమునందు చేరిపోయిరి.

దక్షిణాపథమంతయుఁ దిరిగి నవనవోన్మేషముగ పునరుజ్జీవింపఁ దొడగెను. వేదాంతియై షడ్దర్శనప్రవక్తయై, వేదవ్యాఖ్యాతయై పశ్చిమాంధ్రమున విద్యారణ్యమహర్షి సల్పిన కృషినే పంచమవేదము చేపట్టి పూర్వాంధ్రమున ఎఱ్ఱాప్రెగ్గడ మహాకవి అంతకు ముందే సల్పెను.

ప్రోలయ వేమారెడ్డి - అతని తమ్ముఁడు మల్లారెడ్డి ఈ స్వాతంత్ర్యోద్యమమున కత్తిబట్టి నిలిచిన మహావీరులు, ఆనాడు తురుష్కులవలన విధ్వంసములైన దేవాలయములు పునరుద్ధరించి, అగ్రహారములు నిలిపి ప్రాచీన సాహిత్యసంస్కృతి సంప్రదాయములు పునఃప్రతిష్ఠ సలిపిన దేశభక్తులు. పశ్చిమ గోదావరి భీమవరసమీపమున నున్న మోగల్లు గ్రామమున ప్రతాపరుద్రుని కాలమున నున్న కవి శ్రీగిరి దేవయ్యనిగారికి భూదానము పేర్కొని శిలాశాసనమును అనవేముడు వేయించెను. దీనినిబట్టి ముస్లిము దండయాత్రలో నష్టపడినవారికిఁ దిరిగి రెడ్డిరాజులు పట్టాల నిచ్చిరని ఊహింపవచ్చును.

తురుష్కులు దేవాలయములఁ బాడొనర్చి, విగ్రహములఁ బగులఁగొట్టి, బ్రాహ్మణుల హింసించి, అగ్రహారముల లాగుకొనిరి. ప్రోలయనాకుడు, రెడ్డి రాజులు దేవాలయములు అగ్రహారములు పునరుద్ధరించి, బ్రాహ్మణులఁ బోషించిరి. ఎఱ్ఱాప్రెగ్గడ భారతమున నీ పునరుద్ధరణమే

"ఆరామప్రజచైత్రపద్మవనదేవాగారసౌమ్యంబులై
భూరిబ్రహ్మతపస్విసంకులములై పుణ్యాధ్వరారంభసం
భారోదారములై నితాంతఫలితభ్రాజిష్ణుసస్యంబులై
యారూఢస్థితి నెల్లదేశములు నొప్పారున్ బ్రకాశంబుగన్"

అను పద్యమున ధ్వనించుచున్నది.

ముస్లిము దండయాత్రలకు మతప్రచారదృష్టి విశిష్ట మగుటచే వారి తీవ్రకోధమునకు బ్రాహ్మణులు దేవాలయములు గురియయ్యెను. ఆ కారణముచేతనే

దేవబ్రాహ్మణపునరుద్ధరణమునకు రెడ్డిరాజులు, నాయకులు బద్ధకంకణులైరి. తీవ్రహింసకు గురియైన వారియందు దేశమున సహజముగ సానుభూతి, జాలి కూడ నేర్పడినది. మార్కండేయుడు ధర్మరాజుతో

ధరణీసురులకుఁ నెప్పుడుఁ
గరము ప్రియము సేయుమయ్య కౌరవవం
శోత్తర విప్రుల సంతుష్టిం
బొరసినఁ జేకురు నశేషపుణ్యఫలంబున్'' అని పల్కను.

విద్యారణ్యునివంటి మహర్షులు స్వాతంత్ర్యోద్యమనాయకుల కుత్సాహప్రదాతలై సనాతన సంస్కృతికిఁ బట్టుకొమ్మలై నిలిచిరి.

క్రీస్తుశకము 1325 సంవత్సరమున మల్లవరము శాసనమున వేమారెడ్డి, అద్దంకి రాజధానిగ నేలుచున్నట్లు గలదు. ఒంగోలు మండలము మాణిక్యేశ్వరముననున్న శాసనమున క్రీ॥ శ॥ 1353న వేమారెడ్డి యువరాజు అనవోతారెడ్డి పేర్కొన బడినారు. ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశమున

వితతయువరాజవిభవో
న్నతవోతయసైన్యనాథనయమార్గసమీ
హితసంతత సేవావిల
సితపుత్రశ్రీసమృద్ధ శివగురుసిద్ధా.

అని వర్ణించెను. దీనిని బట్టి ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశమును క్రీ॥ శ॥ 1353 సంవత్సరమున కింముక ముందు ప్రోలయ వేమారెడ్డి కంకితమిచ్చెనని యూహింపవచ్చును.

ఎఱ్ఱాప్రెగడ ప్రోలయ వేమారెడ్డి యాస్థానకవియైన సంవిధాన మొక మనోజ్ఞకథ. వేమారెడ్డి తమ్ముఁడు మల్లారెడ్డి రెడ్డి రాజ్యమున సేనానియై గుడ్లూరు, చదలువాడ ప్రాంతములు రాజప్రతినిధియై పరిపాలించెను. తెలుఁగు దేశమును తురుష్కుల బారినుండి సంరక్షించిన మహావీరులలో మల్లారెడ్డి పేర్కొనఁ దగినవాఁడు.

మల్లారెడ్డి, ఎఱ్ఱన మహాకవిని "అతతశ్రీతోడ సముపేతుఁజేసి" అన్నగారగు మహారాజు వేమారెడ్డికి బహుమానముగ సమర్పించెనని హరివంశ పీఠికలోఁ గలదు.

"నాతమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండు నిన్నాతత
శ్రీ తోడన్ సముపేతుఁజేసి యెలమిం జేపట్టి మాకిచ్చుటం
జేతోమోద మొలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిన్ బొందితి నింక నేను దనియన్ గావ్యామృతాస్వాదనన్

అని వేమారెడ్డి పల్కెను.

ఎఱ్ఱన హరివంశమునకుముందే రామాయణము రచించెను. అందు పీఠికలో మల్లారెడ్డిని గూర్చి జెప్పియుండును. దురదృష్టవశమున ఎఱ్ఱాప్రెగడ రామాయణము మనకు లభించుటలేదు. అందుచేత ఆంధ్రవాఙ్మయమునకే గాక చరిత్రకుఁగూడ తీరనిలోటు ఏర్పడినది.

ఆంధ్రసాహిత్యచరిత్రలో మల్లారెడ్డి పేరు సువర్ణాక్షరములతో లిఖింపఁదగినది. రెడ్డిరాజులు చరిత్రలోఁ గృతికర్తలై కృతిభర్తలై సాహిత్యాభిరుచితోపాటు అభినివేశము మేళవించి విద్వాంసులై

చిరస్మరణీయకీర్తి సంపాదించుటకు రాచబాట వేసి మార్గదర్శకుఁడైనవాడు మల్లారెడ్డి. తెనుఁగు తల్లికి దాస్యవిమోచనము సల్పి, యెత్తిన కత్తి దింపని జగదేక వీరుఁడు మాత్రమే గాక, మహాకవికంటె మహారాజునకు సమర్పింపఁగల మంచి కానుక లేదని గ్రహించిన రసజ్ఞమూర్తి. మల్లారెడ్డి ఏ సుముహూర్తమున ఎఱ్ఱన మహాకవిని మహారాజునకు సమర్పించెనో యప్పటినుండి ఆదిలో అద్దంకి తరువాత కొండవీడు, రాజమహేంద్రవారవము రెడ్డి రాజ్యమునకు రాజధాని దక్షిణాపథమునకు రసరాజధానిగ ప్రఖ్యాతివహించినవి. రెడ్డి రాజ్యమున నొక శతాబ్ధిపాటు మల్లారెడ్డి పెట్టిన మేలుబంతివలన మంత్రులు, దండనాథులు, అవచితిప్పయసెట్టి వంటి వణిక్ప్రముఖులు రాజులతో పాటు కవులకు కర్పూరనీరాజనములు, కస్తూరిహేమపాత్రాన్నములు, ముత్యాలశాలల కనకవర్షములతో మన్నించిరి.

బాహాదర్పమునం బ్రతీపధరణీపాలావలిందోలి యు
త్సాహోదగ్రుఁడు మోటుపల్లిఁ గొని సప్తద్వపసద్వస్తు సం
దోహంబున్ దనకిచ్చు నెచ్చెలి సముద్రుం బ్రీతి గావించుచున్
మాహాత్మ్యంబు వహించె మల్లరథినీనాథుండు గాఢోద్ధతిన్

అని ఎఱ్ఱన మల్లారెడ్డిని హరివంశమున స్తుతించెను.

కృతిభర్త, మహారాజునకు వేమారెడ్డినిగూడ మల్లారెడ్డి సోదరునిగనే యెంచి వర్ణించెను.

ధీయుక్తమల్లరథినీ
నాయకమంత్రప్రయుక్త నయపూర్వక కా

ర్యాయత్త ఖడ్గవిభవ
స్ఫాయద్విభవాభిపోష భాసురవేషా !

వేమారెడ్డి క్రీ॥ శ॥ 1345 సంవత్సరములో అమరావతి లోని యమరేశ్వరునకు సోదరుఁడైన మల్లారెడ్డి పుణ్యముకొఱకైదు స్వర్ణశిఖరము లెత్తించెను. మల్లారెడ్డి అప్పటికి దివంగతుఁడై యుండును గావున, హరివంశమునాటికి సజీవుఁడుగ నున్నట్లు గన్పించుచున్నది గనుక, హరివంశము రామాయణము క్రీ॥ శ॥ 1345 సంవత్సరమునకుఁ బూర్వము 1325 సంవత్సరమునకుఁ దరువాత రచింపఁబడినవని చెప్పవచ్చును. క్రీ॥ శ॥ 1325 సం॥ వేమారెడ్డి తొలి మల్లవరశాసనము తరువాత క్రీ॥ శ॥ 1332 సం॥న కరికల్లు శాసనము మధ్య, శాసనములు గనుపించుటలేదు. ఈ యెనిమిదేండ్ల మధ్య వేమారెడ్డి, మల్లారెడ్డి రెడ్డి రాజ్యసంస్థాపనమునందు నిమగ్నులైయుండిరని విశ్వసింపవచ్చును. అట్లయిన రామాయణము, హరివంశము క్రీ॥ శ॥ 1332-45 సంవత్సరముల మధ్య, రచింపబడి యుండును.

మల్లారెడ్డి చేపట్టుటకుఁ బూర్వమే ఎఱ్ఱాప్రెగడ కవిగ ప్రఖ్యాతి వహించియుండవలెను. హరివంశమునందు రామాయణప్రశంస కలదు. హరివంశము భారతమునకు పరాంశము గనుక, కృతిపతి దానినిగూడ రచింపుమని కోరెను.

భారతపరాంశమని యిం
పారఁగఁ జెప్పుదురు బుధులు హరివంశము నీ
వా రమ్యకథఁ దెనుంగుగ
ధీరోత్తమ నిర్వహించి తెలుపుము మాకున్.

దీనిని బట్టి పరాంశమునకు ముందు, పూర్వాంశమగు భారతము నాతఁడు రచించినట్లే గదా.

మహాభారతము నందలి యరణ్యపర్వశేషము పూరించి "కవిత్రయము"లో స్థానము పొంది సుగృహీతనామధేయుఁడైన ఎఱ్ఱన కవిని మల్లారెడ్డి చేపట్టెను. భారతరామాయణములు భారత భూమిని పరమపవిత్రగ్రంథములు గనుక వేమారెడ్డి, రామాయణము రచింప ఎఱ్ఱనను గోరియుండును.

భారతరచన నాటికి ఎఱ్ఱన గుడ్లూరులో నుండెను. ఈ గుడ్లూరు మల్లారెడ్డి పాలనక్రిందనున్న చెదలువాడకు గురుములూరికి సమీపమున నున్నదే. గుడ్లూరు నందే ఎఱ్ఱన, మల్లారెడ్డి స్నేహ మేర్పడి, తరువాత చదలువాడ చేరి, మడి మాన్యములు సంపాదించి, రాజధాని అద్దంకి చేరి ఆస్థానకవియై జీవితమున సపరసంధ్యలో చెదలువాడఁ జేరియుండును.

అందుచే నీతని వంశస్థులు తరువాత చెదలువాడ మల్లయకవి, ఎఱ్ఱన వంశీయుడు.

ప్రతిభతో నారణ్యపర్వశేషముఁ జెప్పెఁ
గవులకుఁ జెవుల పండువులు గాఁగ
వల్మీకభవు వచోవైఖరి రామాయ
ణంబు నాంధ్రప్రబంధమ్ము చేసె
నారసింహుని పురాణ మొనర్చె హరి మెచ్చి
నన్ను నెన్నఁడు చూచినాఁడ వనఁగఁ
బ్రౌఢిమై హరివంశభాగముల్ రెండును

రచియించె సభలందుఁ బ్రాజ్ఞు లెన్న
దురతిహరు ప్రబంధపరమేశ్వరుని చెద
ల్వాడ నిలయు నాదు వంశకర్త
ధన్యమూర్తి శంభుదాసు నెఱ్ఱాప్రెగ్గ
డను నుతింప బ్రహ్మకునుఁ దరంబె!

తిక్కన నిర్యాణము, ఎఱ్ఱాప్రెగ్గడ జననము ఇంచుమించుగ నేక కాలమున జరిగియుండును. భారతము పూర్తిచేయు కారణజన్ముని యుదయము చూచియే మహానుభావుడు తిక్కన మహాకవి మరణించి యుండునని యనుకొనిన కథ రక్తిగట్టును.

పదునేనుపర్వములు తుదముట్ట తెమగున రచించిన తిక్కన మహాకవినిగూర్చి స్వయముగఁ జూచినవారివలన బాల్యమునుండి ఎఱ్ఱన విని నన్నయ తిక్కనల సరస శాశ్వతముగ పీట వేయించుకొను తహతహలాడి ముందుగ భారతము చేపట్టెను.

హరివంశమునందుఁ దిక్కనగూర్చి ఎఱ్ఱాప్రెగ్గడ మహాకవి

"తన కావించిన సృష్టి తక్కొరుల చేతంగాదునా నేముఖం
బునఁ దాఁ బల్కిన పల్కు లాగమములై పాల్పొందునా వాణిస
త్తను నీతండొకరుండు నాఁ జను మహత్త్వాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవి తిక్క యజ్వ నిఖిలోర్వీదేవతాభ్యర్చితున్"

అని ప్రశంసించెను.

ఎఱ్ఱన రచించిన భారతారణ్యపర్వశేషము రామాయణము, హరివంశము, నృసింహపురాణము. నే యానుపూర్విలో రచించెననునది యొక సమస్య. హరివంశమునం దతని రామాయణ

ప్రశంస గలదు. హరివంశము "భారత పరాంశ" మని యందే కలదు కావున పూర్వాంశమంతకు ముందే రచించినట్లు ధ్వని గలదు.

నృసింహపురాణమందు

"ఉన్నతసంస్కృతాంధ్రచతురోక్తిపథంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వ శే
షోన్నయ మంధ్రబాష నుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి త
న్నన్నయభట్టతిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్"

అని కలదు.

దీనినిఁబట్టి నృసింహపురాణము భారతము తరువాతిదని చెప్పక తప్పదు. ఎఱ్ఱన నృసింహపురాణము ఈశ్వరాంకితముగఁ జెప్పెను. అందుఁగూడ స్వప్న వృత్తాంతము గలదు. తిక్కనకు వలెనే ఎఱ్ఱనకుఁగూడఁ బితామహుఁడైన యెఱపోతసూరి స్వప్నమునఁ గన్పడును.

గురుభజనపరాయణుఁడవు,
సరసబహుపురాణధర్మశాస్త్రకథా వి
స్తరవేదివి నయోదిత
భరితుఁడ పతులానుభావభవ్యుఁడవుమహిన్.

"కావున, బ్రబంధరచనా
ప్రావీణ్యము నీకు సహజపరిణతసిద్ధం
బై వెలసినయది యొక్క కృతి
గావింప జగద్ధితంబుగా నేఁబనుతున్.

శ్రీమద యోబలేశ నరసింహుడు నా ప్రియ దైవతంబు మ
త్స్వామి తదీయతీర్థవిభవంబును దన్మహితావతారమున్
నీ మధురోక్తిగుంభన మనీషులు మెచ్చఁగఁ బ్రస్తుతింపు నీ
కేమియు సంభవించు నఖిలేప్సితపుణ్యఫలోదయోన్నతుల్''

పితామహుని వచనానుసారము నృసింహపురాణము అహోబలనరసింహున కంకితము గావున నీ కవి గూడఁ దొలుత నరాంకితముగఁ దరువాత నీశ్వరాంకితముఁ గృతి చెప్పెనని యొక వాదము, మరి కొందరు నృసింహపురాణము నాటికిఁ గవికే రాజాశ్రయము దొరక లేదని చెప్పుచున్నారు.

ఎఱ్ఱన నృసింహపురాణకృతికాలమునకే ''ప్రబంధరచనా ప్రావీణ్యము'', ''సహజపరిణతసిద్ధంబైన'' వాఁడు సరసబహుపురాణధర్మశాస్త్రవిస్తరవేది. కావున నప్పటికే భారతరామాయణ హరివంశముల రచించెనని చెప్పవచ్చును.

నృసింహపురాణరచనకాలమునకు ఎఱ్ఱాప్రెగ్గడ మహాకవి యాత్మీయతలో నేర్పడిన క్రమపరిణామవికాశము తిక్కన మహాకవి వినయసంయమము దలపింపఁ జేయును.

''అని యాక్రమంబునఁ బ్రధానదేవతాసంకీర్తనంబును మహాకవి జనప్రార్థనంబును సద్గురుచరణానుస్మరణీయకీర్తనంబును సమర్థించి కృతార్థతం బొంది కతిపయాక్షరపరిగ్రహ జనితంబైన నైసర్గికచాపలంబుకతంబున

మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు గూయఁ గ్రౌంచమును వావలఁగూయఁ గడంగుభంగి బ్రా

థాంచిత శబ్దసారులు మహాకవు లాఢ్యులు కావ్యశయ్య గీ
లించిన కీర్తి సంగసుఖలీలకు నేనును గాంక్షఁ జేసితిన్''.

అప్పటికే ఎఱ్ఱన భారతము పూర్తిచేసి కవిత్రయములోఁ జేరెను. నన్నయ తిక్కనలు కవిరాజహంసలై భారతము వ్రాసిరి. తానుఁ గూడ నట్టి కవియశస్సు నర్థించుట క్రౌంచవముకూయు నట్లే యని వినయముగఁ బల్కెను.

ఎఱ్ఱనకు మహాభారతముపై, వ్యాసునిపై, నన్నయ తిక్కనలపైఁ గల పూజ్యభావ మపారము.

భాసురభారతార్థముల భంగులు నిక్క మెరుంగ నేరమిన్
గాసట బీసటే చదివి గాథలు త్రవ్వు తెనుంగు వారికిన్
వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లఁగఁ జేసినట్టి య
బ్జాసనకల్పులం దలఁతు నాద్యులు నన్నయ తిక్కనార్యులన్

అని అతఁడు నన్నయ తిక్కనలఁ బ్రశంసించెను.

తిక్కన మహాకవి సాహిత్యజీవిత మాతనికి గల్పించిన యంతఃప్రబోధము సుస్పష్టము. శంకరస్వామి శిష్యత్వము గూడ నతనికి పరిణత వయస్సునకే సంక్రమించి యుండును.

యామము లెన్మిదింట నియతాకృతిఁ బ్రత్యహమున్ శివార్చనా
రామత యొప్ప నిత్యశివరాత్రి వ్రతంబుగఁ బూని భవ్యయో
గామృతతృప్తిమైఁ ద్రిజగదర్చితలీలఁ దనర్చు శంకర
స్వామి మునీంద్రు భక్తజనవత్సలు మద్గురు నాశ్రయించెదన్.

నృసింహపురాణమున శంభుదాసుడఁగు నెఱ్ఱన శంకరస్వామి గురుస్తుతి సల్పి

"విష్ణుధర్మ ప్రశంసాపవిత్రమైన
యస్మదీయప్రబంధసామగ్రి వలన"

తన పితామహుఁడగు నెఱపోతసూరి యతులానందజలధి నోలలాడునని యెంచెను. ఎఱ్ఱన గూడఁ దిక్కన వలెనే "విష్ణు రూపాయ నమశ్శివాయ" యను గలిగిన మనస్తత్త్వము గలవాఁడు

"గిరిశపదభక్తి రసత
త్పరభావము కలిమి శంభుదాసుం డనఁగో
బరఁగిన గోవిందగుణా
దరసంభృతసౌమనస్యధన్యుఁడ వెండున్"

అతని పితామహు డెఱపోతసూరి ప్రవచన మది.

ఎఱ్ఱన గుడ్లూరు నందున్నపుడు భారతమున నరణ్యపర్వశేషము రచించెను.

భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు
శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్త చిత్తుఁడు సూర
నార్యునకును బోలమాంబికకును
నందనుఁ డిలఁ బాకనాటిలో నీలకం
ఠేశ్వరస్థానమై యొసక మెసగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు

ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ముఁ
డెఱ్ఱనార్యుండు సకలలోకైకవిదితుఁ
డయిన నన్నయభట్టమహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ
జెందుటయి సాధుహర్షసిద్ధిఁ గోరి.
ధీరవిచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయకా
నారణ్యపర్వశేషము
పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్

ఎఱ్ఱన రచించిన రామాయణ ముపలభ్యమానముగాకున్నను లక్షణగ్రంథములలో నుదాహరింపఁబడిన పద్యములలో నీలకంఠ స్తవమున్నది.

నిను సేవించినఁ గల్గు మానవులకున్ వీటీవధూటీఘటీ
ఘనకోటీశకటీకటీతటీవటీ దంధేభకాపేటీపటీ
రనటీహారిపటీసువర్ణమకుటీప్రచ్ఛోటికాపేటికల్
కనదామ్నాయమహాతురంగ శివలింగా నీలకంఠేశ్వరా !

ఎఱ్ఱన "లోకైకవిదితుఁడైన నన్నయభట్ట మహాకవీంద్రు సరస సారస్వతాంశప్రశస్తి" దన్ను జెందినదని మురిసి పోయెను. తత్కవితారీతియు "కొంత" దోప అరణ్యపర్వశేషము పూరించెను. సవినయముగ నన్నయ రీతి "కొంత" దోపనని మాత్రమే చెప్పుకొనెను.

ఎఱ్ఱన అరణ్యపర్వశేషమున నన్నయ ననుకరించుటకుఁ బ్రయత్నించెను. నన్నయ వృత్తరచన సమానపదగుంఫనములు, పదలాలిత్యము, ప్రసన్న కథాకవితార్థయుక్తి "కొంత" వరకు నెఱ్ఱనకుఁ బట్టువడినవి. ఎఱ్ఱన భక్తితో నరణ్యపర్వశేషము నన్నయ పేరుమీదనే రాజరాజనరేంద్రునకే కృతి యిచ్చినట్లు వ్రాసెను. తిక్కన యే హేతువుచే నరణ్యపర్వశేషము పూరింపక విడిచెనో యా హేతువుచేతనే నెఱ్ఱన దానిని రాజరాజున కంకితముగ నన్నయభట్టు పేరుమీదనే వ్రాసెను. భారతము ప్రబంధమందలి ఒక్కొక్క పర్వమొక్కొక్క ప్రబంధము. అరణ్యపర్వ మిదివరకే రాజరాజార్పితము. నన్నయ, రాజరాజనరేంద్రుఁ డనిన నెఱ్ఱనకు విశేషభక్తియుండి యుభయుల, కృతిపతి కృతికర్తలుగా నిలిపి నిష్కామసేవగ నరణ్యపర్వశేషము రచించెను.

దీనివలన నన్నయ యరణ్యపర్వము పూర్తిగ రచించెననియు "మూఁడుకృతు" లతఁడు రచించినట్లు తిక్కన మారనల సాక్ష్యము నుదాహరించి యెఱ్ఱన శిథిలభాగముల మాత్రమే పూరించెనని యొక వాదము తలసూపినది. కాని, వ్రాత ప్రతులన్నిటియందు శారదరాత్రు లను నన్నయ పద్యము తరువాత ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్వారంభమని యున్నది.

"స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరిపోయి నిరస్త నీరదా
వరణములై దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనముల్ నెలంగఁగా
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్

అని నన్నయ కవితాగానమున ఆలపించిన శ్రుతి నందుకొన గల్గినాఁడు.

నన్నయ మధ్యాక్కరల యతిస్థానమునకును నెఱ్ఱన మధ్యాక్కరల యతిస్థానమునకును గల భేదము గమనింపదగినది. తత్కవితారీతి కొంత దోప మధ్యాక్కరాది వృత్తముల నెఱ్ఱన యెత్తినను స్వీయముద్ర వేయక వదలలేదు. నన్నయ యక్షర రమ్యతను గూడ నెఱ్ఱన చక్కగఁ బట్టుకొనెను.

అంబ నవాంబుజోజ్జ్వలకరాంబుజ శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తి ప్రకటస్ఫుటభూషణరత్నదీప్తికా
చుంబితదిగ్విభాగ శ్రుతిసూక్త వివిక్తనిజప్రభావభా
వాంబరవీథివిశ్రుతవిహారి ననుం గృపఁ జూఁడు భారతీ !

భారతమునందలి యీ పద్యము, రామాయణము నందలి నీలకంఠేశ్వరస్తవము నెఱ్ఱన యాయా గ్రంథములకు ముందే రచించి యుండును. ఈ పద్యములు నన్నయ పద్యములవలె, నినదించు చుండుటచే నతనికి "నన్నయభట్టకవీంద్రుసరససారస్వతాంశ ప్రశస్తి" సమకాలీనులవల్లనే లభించినది.

ఎఱ్ఱన యరణ్యపర్వశేషమునందు నన్నయ పద్యభాగములను పదగుంఫనలను విరివిగా వాడెను. దుర్యోధనుఁడు ఘోషయాత్రానంతరము ప్రాయోపవేశము మాని కరిపురంబునకుఁ బోవు నపుఁడు ఎఱ్ఱన పద్యము

"రయవిచలత్తురంగమతరంగములన్ మదనాగనక్రసం
చయములఁ జంచలచ్చటుల సైనికమత్స్యములన్ మహోన్నతం

బయి కురురాజచంద్రు నుదయంబునఁ దద్దయుఁబొంగెఁ బ్రస్ఫుర
ద్భయదమనోహరప్రకటభంగులఁ దద్భటవార్ధి యుద్ధతిన్''

నన్నయభట్టు శిశుపాలవధ ఘట్టమున రచించిన

''రయవిచలత్తురంగమతరంగములన్ మదనాగనక్రసం
చయములఁ జంచలచ్ఛటుల సైనిక మత్స్యములన్ భయంకరం
బయి యదువృష్ణిభోజకురాంధకవాహినియుం గలంగె ని
ర్దయతరరోష మారుతనితాంతసమీరితమై క్షణంబునన్''

అను పద్యమును స్మరణకుఁ దెచ్చును.

ఎఱ్ఱన, నన్నయ భాషాగతిని తిక్కన భావగతిని ననుసరించెను. తిక్కన సంజయుని నోట ధర్మరాజును ''మెత్తనిపులి'' యని వర్ణించును. ఎఱ్ఱన ధర్మరాజు తిక్కన చిత్రించిన మెత్తని పులియే.

గంధర్వులను జయించి అర్జునాదులు దుర్యోధనాదుల యజ్ఞదీక్షితుఁడగు ధర్మరాజు సమక్షమున నుంచిరి.

''యుధిష్ఠిరుండును దార్తరాష్ట్రునకు బంధమోక్షణంబు గావించి యాతని కిట్లనియె.

''ఎన్నడు నిట్టి సాహసము లింక నొనర్పకు మయ్య దుర్జనుం
డన్నన సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలఁ గాంతల గైకొని పొమ్ము వీటికిన్
సన్నుత దీని కొండొక విషాదము పొందకుమీ మనంబునన్''

గంధర్వుల బాణములు చేయలేని పని ధర్మరాజు మెత్తని మాటలు సల్పినవి. దుర్యోధనుఁడు ప్రాయోపవేశమునఁ బ్రాణత్యాగమునకుఁ బూనుకొనెను.

ఎఱ్ఱన, నన్నయ, తిక్కనల ననుకరించి తృప్తిపడిన వాఁడు మాత్రము కాడు. ఆంధ్రవాఙ్మయమున నన్నయ తిక్కనలతో పాటొక స్వతంత్ర కవితారీతి స్థాపించెను. నన్నయ ప్రసన్నకథా కవితార్థయుక్తికి తిక్కన పాత్రచిత్తవృత్తుల వర్ణనతోఁగూడిన నాటకీయశిల్పమునకు, మూలపురుషులైనట్లే ఎఱ్ఱాప్రెగ్గడ వర్ణనాత్మకశయ్యకు మార్గదర్శకుఁడై ప్రబంధపరమేశ్వరుఁడయ్యెను.

సంస్కృతభారతమున దుర్యోధనుఁడు ఘోషయాత్రకు వెడలినపుఁ డతడు ద్వైతవనంబునం దనేకగోసమూహముల గాంచినట్లు మాత్రమే గలదు.

దుర్యోధనుఁ డెఱ్ఱన తెలుగు భారతమున

నానాసహస్రసంఖ్యానంబులై నంత
తానందవిగతభయత్వలీల
నక్కాననమున నేదిక్కు సూచిన నతి
సంకులంబుగఁ గుందశంఖచంద్ర
హారనీహారడిండీరపటీరము
క్తాహారహీరసంకాశములును
గాదంబకాలేయకాదంబినీనీల
జాలతమాలికాసన్నిభములు
ప్రౌఢబంధూకపల్లవభాసితములు

వికచకాంచనచంపకవిస్ఫుటములు
నైన వర్ణంబు లొప్ప నేత్రాభిరామ
భంగి నలరారు గోకదంబములఁ గనియె

ఇట్లు ఆంధ్రమహాభారతమును జేపట్టుటచేత మాత్రమే గాక నన్నయ తిక్కన ఎఱ్ఱన మహాకవులు ముగ్గురు మూఁడు భిన్నస్వతంత్రకవితామార్గములకు మూలపురుషులగుటచేఁ గవిత్రయము వారి కాంధ్రసాహితీజగత్తునందుఁ బ్రథానపీఠములు లభించినవి.

సాహిత్యశిల్పము ప్రస్తరించిన మూఁడు భిన్నరీతుల లభివ్యక్తమగును. కథాకథనశిల్పము. కథ పౌరాణికమ్మైన రీవితో నైతిహాసికశోభతో ఉదాత్తరమణీయముగా చెప్పుట యొకటి. కథాకథనశయ్యకు నన్నయ మూలపురుషుడు.

మనోధర్మపరిజ్ఞానముతో శీలానుశీలనము సల్పుచు, సంభాషణమున కథను నడుపుచు, పాత్రల చిత్తవృత్తుల నిరూపించి యాంగికాభినయము ప్రస్ఫుటమగునట్లు రచించుట, నాటకీయ కవితాశిల్పము, దానికి తిక్కన మూలపురుషుడు.

కథతోపాటు వివిధసన్నివేశములలోని సౌందర్యస్ఫోరకత్వము ద్యోతకమగునట్లు వ్రాయుట వర్ణనాత్మకశైలి. ఇట్టి వర్ణనాత్మకశయ్యకు ఎఱ్ఱన మూలపురుషుడు.

సాహిత్యసృష్టిలో శాశ్వతముగా సాక్షాత్కరించు మూఁడు రీతులకుఁ గవిత్రయము వారాద్యులైరి. అందుచేఁ గూడ

కవిత్రయమునకు, భారతము చేపట్టుటచే యాదృచ్ఛికముగా మాత్రమే గాక, చిరంతశాశ్వతకీర్తి దక్కినది.

ఎఱ్ఱన రామాయణమునందలి పద్యమునందుఁగూడ నతని వర్ణనాప్రియత్వ మభివ్యక్తము కాఁగలదు.

చెఱకుం దోఁటల బెంచి శాలిమయసుక్షేత్రస్థలుల్ నించి య
క్కఱలే కుండఁగఁ బూగనాగలతికాకాంతారముల్ ప్రోచి యే
డ్తెఱ నంతం గుముదోత్పలాళి వనవాటీకోటిఁ బాటించి పె
న్తెఱువుల్ వాల్చెఁ బురంబు నల్దెసలఁ బ్రస్ఫీతాంబుపూర్ణస్థితిన్

ఎఱ్ఱనకు ప్రకృతిలోని సౌందర్యము, సృష్టిలోని విలాసవిభ్రమము తన్మయత్వము గల్పించును. సావిత్రీ సత్యవంతులు,

కమనీయకమలినీకల్లోలవీథులఁ
గదలు రాయంచల గతుల యొప్పు
బహుపుష్పపల్లవప్రకరచిత్రితములై
తనరారు తరులతాతతుల సొంపు
మకరందరసపానమదవిలోలంబులై
క్రాలెడి యెలదేటిగముల యులివుఁ
బరిపక్వమంజుల ఫలరసోద్ధతములై
పలుకు రా చిలుకల పటురవంబుఁ
బ్రియుఁడు వేఱు వేఱ ప్రీతిమైఁ జూపుచుఁ
జెప్పుచును జనంగఁ జిగురుఁబోఁడి
గనుచు వినుచు నిర్వికారసల్లాపమిం
పార నతని తెఱఁగు నరయుచుండె.

ఎఱ్ఱనకు నన్నయ తిక్కనలతోపాటు సరసనపీట వేయుట కాతని యాధ్యాత్మికోన్నతిగూడ హేతువే. నన్నయ "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని" యను సీసమున మహాభారత మందలి "విశ్వజనీనత" వివరించెను. తిక్కన దర్మాద్వైతమును వివరించెను. ఎఱ్ఱనగూడ వ్యాధగీత యని ప్రసిద్ధికెక్కిన ధర్మవ్యాధోపాఖ్యానమున భారతమునందలి వేదాంతపరమార్థము వివరించెను.

కౌశికుఁడను బ్రాహ్మణుఁడు సంతతవేదాధ్యయనతత్పరుఁడు, రెట్ట వేసిన కొక్కెర నలిగి చూచిన నది యప్పుడు నిశ్చేతనంబై నేలఁ గూలిన నతడు

"అక్కట నా హృదయము కడు
నక్కటికము లేనిదయ్యె ననిమిత్తమ యీ
కొక్కెర నిటు సేసితి నా
కెక్కడి శాంతి యని వికలహృదయుం డగుచున్"

కోమలహృదయుఁడగుటచేఁ బశ్చాత్తాపము చెందెను. కౌశికుని శీలము అద్భుతమిశ్రము. అతఁడు ప్రథమకోపియైనను జిజ్ఞాసువైన పవిత్రతపస్వి.

అతఁడు భిక్షాటనమున నొక పతివ్రత యింటిముందు నిలిచెను. ఆ సమయముననే యామె భర్త యాకటఁ దూలుచు వచ్చెను. ఆమె యాతని రుచిరాన్నరసంబులఁ బ్రీతుఁ జేసి నొడికపు సెజ్జ సేసి, తమ్ములం' బిడి చరణంబు లొత్తి, భిక్షార్థియైన మునీశ్వరు దలంచి భిక్ష గొనితెచ్చెను. కౌశికు డుగ్రుఁ డయ్యెను.

"అడిగిన యప్పుడ చెచ్చెరఁ
గడపినఁ బో నవ్వ యేను గడు దుర్మతిపై
పడఁతి నను నిలిపి భిక్షం
బిడక కడు నవజ్ఞ సేసి తేల మదమునన్"

అని, మఱియు

"నీ మగ డంత యెక్కుడె మనీషులు భూసురు లింత తక్కువే కోమలి యేల యిట్లు గడుఁ గ్రొవ్వునఁగానవు లోకవంద్యులన్" అని హుంకరించును. అంత నా పతివ్రత

"క్రోధమోహనామకులైన ఘోరశత్రు
లిరువు రెరియించు చుండుదు రెపుడు నంత
రంగ మయ్యుభయంబు నడంగకున్నఁ
గలదె యూరక బ్రాహ్మణ్యగౌరవంబు.

ధర్మంబు బహుమార్గదృష్టంబయి సూక్ష్మంబయి యుండు నీవు కేవలస్వాధ్యాయపరుండవు గాని ధర్మసూక్ష్మత యెరుంగవు" అని చెప్పి ధర్మవ్యాధుని కడఁకు బొమ్మనెను.

"నను దూఱం దగు నీ కత
మున నా చిత్తము ప్రశాంతిఁ బొరసెఁ బురంధ్రీ
జనవినుత పోయివచ్చెద
ననుపమశోభనసమృద్ధు లయ్యెడు నీకున్"

అని కౌశికుఁ డామెను వీడ్కొని మిథిలానగరమున మాంసోపజీవియైన ధర్మవ్యాధుని కడ కరిగెను.

అతఁ డనేక ధర్మముల నుపన్యసించిన తరువాత "ఏను భవదీయసమాగతిఁ జేసి ధర్మసుస్థిరమతి నైతి నన్ననుమతింపు గుణాకర పోయివచ్చెదన్" అని వీడ్కొనును.

ఇచ్చట, అధ్యయనముకంటె ఆచరణ ప్రధానమని క్రియా శూరతనే ఎఱ్ఱన ప్రబోధించెను. నన్నయ తిక్కనలవలె ఎఱ్ఱన గూడ మహాభారతతత్త్వము నాకళింపుఁ జేసికొనిన మహావేదాంతి.

కాలవిపర్యయంబున సుఖంబును దుఃఖము వచ్చుచుండు నె
క్కాలము నేరికిన్ ధ్రువము గాదు సుఖంబును దుఃఖమున్ మహీ
పాల బుధుండు తద్ద్వివిధభంగు లెఱింగి ప్రమోదఖేదసం
శీలుఁడు గాఁడు రెంటను ప్రసిద్ధపథంబున నప్రమత్తుఁడై"

అని అరణ్యావాసమునను్న ధర్మరాజునకు కృష్ణద్వైపాయనుని యుపదేశము. ఎఱ్ఱన మహాకవి కీ వాక్యములలోఁ దాదాత్మ్యసిద్ధి లభించినది. భగవద్గీతాప్రబోధము స్మరణకుఁ దెచ్చుచున్నది.

ఎఱ్ఱన భారతము పూరించి లబ్ధప్రతిష్ఠుఁడై, రామాయణము రచించి వేమారెడ్డి కంకిత మిచ్చెను. ఆ రామాయణము నందలి పద్యములు కూచిమంచి తిమ్మన, సర్వలక్షణసారసంగ్రహమున నుదాహరించెను. సుమారు రెండు శతాబ్దులవరకు నున్న ఎఱ్ఱన రామాయణము నేడుపలభ్యమానము గాక పోవుట మిక్కిలి శోచనీయము. "సర్వలక్షణసారసంగ్రహము నం"దుదాహరింపఁ బడిన పద్యములు:-

నూఱుతెఱంగుల నెఱసులు
మీఱఁగ నీ విభ్రమములు మెఱయించి మునిం

గాఱిగఁ జేయును మేనక
చూఱ కొనదె యతని తెలివి సొమ్ములు మున్నున్

తాఱం గ్రాఁగిన నేల తంపఱఁ బాతాళంబు దాఁకన్ జనం
దూరం జిమ్మిరి మిన్ను దాఁకి తరగల్ తోరంబులై నల్గడల్
పారం బెల్లుగ నేఱు లుబ్బరముగాఁ బైపైన నీ రెక్కి ధై
వారన్ జెర్వులు చెన్నుమీఱె నఖిలప్రాణుల్ ముదం బందఁగన్

కోరలు నుగ్గు నుగ్గయిన క్రూరఫణీంద్రు గతిన్ దరంగముల్
మాఱిన భూరి వారిధి క్రమంబున రాహుకరాళవక్త్రమున్
దూఱిన తీవ్రభానుక్రియ దుర్బలసైన్యతఁ బుత్రహీనతన్
గీఱి పరాభవాభిగతిఁ గీడ్పడి భూపతి నెమ్మనంబునన్

నూర్వురు నొక్కచందము మనోగతి సైరణ చేసి నన్ను నా
సర్వకులంబు నుత్తమయశంబున నుంచితి రమ్మలార! మీ
కుర్విని సాటి యే యబల లొండొరు దేవతలున్ బటుక్షమా
నిర్వహణం బొనర్చుటకు నేరదు మర్త్యులఁ జెప్ప నేటికిన్

సందడి యధ్వరక్రియ ఈసంగత మేని బలంబుతోడ బెగ్
గ్రం దది యేల యేన తగఁ గార్ముకస్తుఁడనై కడంగి మీ
ముందఱ నిల్చెదన్ గ్రతువు ముట్టకయుండఁ బ్రచండదైత్యరా
జిందగ దవ్వుదౌల వెసఁ జించెదఁ బెంచెద మీకు మోదమున్

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగా రొక సంకలిత గ్రంథమున నెత్తిన రామాయణములోని పద్యము లని వ్రాయఁబడినవని యీ క్రిందివానిని భారతిలోఁ బ్రచురించిరి.

అనిలజ రావణానుజులు హస్తములన్ గయిదండ గొంచుఁ గ్ర
క్కునఁ జనుదెంచి భానుజుఁడు గొల్వ సుఖంబున నున్న రామచం
ద్రునిఁ గని పాదముల్ శిరముతో నెఱయన్ బ్రణమిల్లి లేచి ని
ల్చిన యెడ నెమ్మొగము వికసిల్లి విభీషణుడుం బ్రియంబునన్.

తమ్ముఁడ! నేఁడు నాకుఁ బ్రమదంబు ఘటిల్లె దశాస్యసందనుం
డిమ్మెయిఁ గూలుటన్ మనకు నింత జయంబగునంచు సిగ్గులోఁ
గ్రమ్మఁగ నున్న లక్ష్మణుని గ్రక్కున నంకమునందు నుంచి వ
క్షమ్మునఁ జేర్చుచున్ శిరము సారెకు మూర్కొనుచుం బ్రేమంబునన్.

కరముల నవ్విభుం డతని గాయము లంటుచు నూర్పుపుచ్చుచున్
బురఁబురఁబొక్కుచుత శిరము మూర్కొని యెంతయు నూఱడించుచున్
దురమున లెస్సఁ గూల్చితివి దుర్దముఁ డైన విరోధిఁ బంక్తికం
ధరుఁడును నింకఁ గూలు నని నామది నిశ్చయబుద్ధి నొందెదన్.

మసలక రామరావణులు మార్కొని యుద్ధము సేయుచుండగా
నిశితశరంబు లొండొకటి నేర్పున ద్రుంచుచు నుగ్రశక్తిమై
దశశిరుమస్తకప్రతతి దాఁకినఁ జిత్రము డుల్లనూపుమై
నుసిరికప్రమానిమీఁద బిడుగూనినఁ గాయలు డుల్లు నాకృతిన్.

అక్కట ధూళిఁబ్రుంగు డయి యంగము నెత్తుటఁ దోగి వేదనన్
స్రుక్కుచు ధాత్రిమైఁ బొరలుచుం బడి లక్ష్మణుఁడిట్టులుండ నా
కెక్కడి యుద్ధకాంక్ష యిఁక నెక్కడి విక్రమగౌరవక్రమం
బెక్కడిప్రాణ మెక్కడి మహీసుత యెక్కడి రాజ్యసంపదల్.

కందక గాజువాలిక మొగంబు నివాసముఁ జెందెఁ జేతు లీ
యందము లైనకాళ్లు నరుణాంబురుహంబుల లీలఁజూడఁ బొ
న్నొందెడు జీవహీను లిటు లుండరు ప్రాణముతోడ నున్నవాఁ
డిందు సహోదరుండు ధరణీశ్వర, నీకు విషాద మేటికిన్.

మనమున నిశ్చయించి పవమానతనూజుఁడు మూఁడు మాఱులే
పునఁ గదలించి యంబుధరముం బలె నీలరుచిం జెలంగు త
ద్వనగిరిశృంగమున్ బిడిచి కైకొని పై కెగురంగవైచి యా
చి నిలువఁబట్టుచున్ వెస సుషేణునిఁ జేరగవచ్చి యచ్చటన్.

అతని రౌద్రరేఖఁ గని యబ్ధి గలంగెఁ జలించె శైలమౌ
త్పాతికవారిదంబు లతిదారుణరావములై జనించె ధా
త్రీతల మెల్ల బిట్టదరె దిక్కులు వ్రీలె సమస్తభూతముల్
భీతి వహించె డెంద మగలెన్ రజనీచరలోకభర్తకున్.

అనయము సర్వభూతములయందును గోద్విజులందు శైలకా
ననగగనాభిలాశల మనత్వము మించ సహస్రపాదలో
చనశతశీర్షమూర్తివయి సారగతిన్ వసియించి సాద్రికా
వనియు సమస్తభూతము లవారి వహింతువు నీవె రాఘవా!

తరుణాదిత్యనిభద్యుతిన్ మెఱసి రక్తశ్రీచ్ఛటాశాదికా
ధరయుం దప్తసువర్ణభూషణము నుద్యన్నీలధూమాభ్రబం
ధురధమ్మిల్లయు నౌ విదేహతనయన్ దోల్దోల్త పెన్మంటలోఁ
జొర నేతెంచిన రూపుతోన జగముల్ సోద్యంబునన్ జూచినన్.

అవనిజనంబు లెల్లను దశాసను నంతిపురంబునందుఁ బె
క్కువుదివసంబు లున్న జనకాత్మజ శోధితఁ జేయకే యనా
ర్యవిహితవృత్తిఁ దెచ్చె రఘురాముఁడు బాలిశుఁ డంచు నెంచరా
భువనములెల్ల నమ్మటకు బో ఇటు సేసితి హవ్యవాహనా!

ప్రకటతరాత్మతేజమున రక్షితయౌ మిథిలాధిరాజక
న్యకను బయోధివేలఁ బలె నాశరుఁ డెందు నతిక్రమింపఁ డె
న్నికకును నిప్పువంటి మహనీయ చరిత్రము గల్గు నిట్టి జా
నకిని దరంబె వానికి మనంబున నేనియుఁ జుల్కఁ జూడఁగాన్.

వైరిజయంబు గాంచి బలవంతుల మిత్రులఁ గూడి తేజమున్
సారయశంబునన్ గనిన నాదు సమాగమనంబు నీవు నిం
పారఁగఁ జెప్పుచో నతని యాననవర్ణవిలోకనేంగితా
కారవచోవిశేషములకైవడి నేర్పునఁ జూడు మేర్పడన్.

అతులంబై వశవర్తియై రథతురంగానేకపాకీర్ణమై
పితృపైతామహ మైన రాజ్యము మదిన్ భేదింపఁగాఁ జేయు సం
తత మెవ్వానికి నైన రాజఫల మాత్మత గోరినన్ గైకయీ
సుతుఁడే యేలుచుండుఁగాక విపులక్షోణీతలం బంతయున్.

అతఁ డడరించు శస్త్రముల యారవముల్ శరపుంఖజాతమా
రుతములు గ్రమ్మినన్ గులగిరుల్ గదలెన్ గలఁగెన్ బయోనిధుల్
క్షితి వడఁకెన్ మనంబునఁ జలించిరి పన్నగలోకవాసులు
న్నతరుచిఁ బాసె మాసె దిననాథుఁడు మందటిలెన్ సమీరుఁడున్

వడి నమరేంద్రముక్త మగు వజ్రములీల యుగాంతకాలు కై
పడిఁ బర తెంచి రావణునివక్షము గాఁడి ధరిత్రిఁ దూరెఁ బ
ల్విడి దశకంఠుఁ ద్రుంచె రఘువీరుఁడు నేఁ డని మేలువార్త యే
ర్పడ ఫణిలోకవాసు లలరన్ వివరింపఁగ నేఁగెనో యనన్

ఆ పుణ్యవ్రతఁ బట్టినప్పుడా తదీయంబై యనిర్వార్యమౌ
కోపాగ్నిన్ మసిగాక నీవునికి రక్షోనాథ; లోకంబునన్
బాపాత్ముం డగువాఁడు పాపఫలమున్ బ్రాప్తవ్యకాలంబునన్
బ్రాపించెఁ నిజపాపకర్మఫల మిబ్భంగిన్ నినుం జెందుటన్.

సవిత్రుఁడు చంద్రుడున్ దిశలు సంధ్యలు రేలుఁ బగళ్ళు గాలియుఁ
భువియును నాదిగా సకలమున్ గను సాక్షులు వీరెఱుఁగ నేఁ
బ్రవిమలసద్గుణేతరధురాపరిభూషిత నేని హ
వ్యవహుఁడు నన్ను నిప్పుడె దయాయతచిత్తతఁ బ్రోచుఁగావునన్

ఆ రీతిఁ భువనత్రయిన్ గలుగువా రత్యంత శోకార్తులై
ధీరత్వంబు పరిత్యజించి యల ధాత్రీనందనం జెందు దు
ర్వారాపన్నత యెంచుచున్ బలుకఁ దద్వాక్యంబు లాలించుచున్
ధారాళాశ్రులతో మనం బెరియఁ జింతన్ రాముఁ డున్నత్తుటిన్.

ఖలునిఁ గబందునిన్ నిశితకాండములత దునుమాడి వాని ప
ల్కులు విని ఋశ్యమూకమునకుం జని భానుజఁ గూడి వాలి ను
జ్వలబలుఁ గూచలి యర్కసుతు వానరరాజ్యమునందు నుంచి య
య్యలముఁడు పంపె భూమితనయన్ వెదకం గపివీరకోటులన్.

నిరుపమమూర్తి రామధరణీపతి శోభనవేళ నాఁడి ర
చ్చరపువుబోండ్లు కిన్నరులు సారెకుఁ బాడిరి దేవదుందుభుల్
మొరసెను ధాత్రి సస్యములు మోహనలీల వహించె వృక్షముల్
వరసురభిప్రసూనఫలవర్గములన్ విలసిల్లె నెంతయున్.

అని కొనియాడుచున్ జలరుహాక్షులు సేసలు మీదఁ జల్లఁగా
ననీఘచరిత్ర! రామ! సుగుణాకర! వర్ధిలుమంచుఁ బౌరు లె
ల్లను దనచుట్టుఁ గొల్వఁగ నలంకృత మైన రథంబుపై ముదం
బున భరతాగ్రజాండు రఘుపుంగవుఁ డీగతి వైభవంబులన్.

జలనిధి గట్టి మించు కపిసైన్యముతో వనరాసి దాఁటి దో
ర్బలమున లంకపై విడిసి రావణముఖ్యనిశాటకోటులన్
కలన జయించి భూతనయఁ గ్రమ్మఱ గైకొని నిత్యకీర్తులన్
వెలసినవాఁడు రాముఁ డిటు వింటిమె కంటిమె యిట్టి చిత్రముల్.

భేరీకాహళశంకతూర్యములు గంభీరంబులై మ్రోయగన్
దారామార్గమునందు దేవఋషిగంధర్వస్తుతుల్ మీఱ సే
వారూఢిం దగ వందిమాగధులు కైవారంబు గావించుచున్
సారోదారవిచిత్రవైఖరుల నానందంబు గల్పింపఁగన్

రావణుఁ గూల్చి క్రమ్మఱ ధరాసుతఁ జేకొని వచ్చుచున్నవాఁ
డావసుధాకళత్రుఁ డిదె యావులతోడ మహేంద్రుతో శచీ
దేవియుఁ బోలె సీత జగతీతలనాథునిఁగూడి సంతత
శ్రీ విలసిల్ల నున్నయది చేరినవాఁడు సుమిత్ర పట్టియున్.

అలికుల వేణులన్ జలరుహాక్షులఁ జంద్రనిభాస్యలన్ విని
ర్మలమణిహేమభూషణసమగ్రల భార్యలఁగా వరింపు గ
న్యల గుణజాతియుక్తలఁ బదార్గుర గ్రామశతంబుఁజూడఁ జె
న్నలరెడు లక్షగోవులఁ బ్రియం బెటిగించిన నీకు నిచ్చెదన్.

కొంచక కోటపై నిలిచి కొందఱు భీమబలాఢ్యులైన న
క్తంచరు లుగ్రతోమరగదాపటుశక్తుల వానరాలి నొ
ప్పించిరి వానరేంద్రులును బేర్చి రణంబునఁ గోటపైకి లం
ఘించి నిశాటులన్ ధరణికిం బడ నీడిచి నొంచి రుద్ధతిన్.

ఎఱ్ఱన, భారతములోఁగూడ రామాయణగాథ వివరించి యుండెను. ఆ సంక్షిప్తగాథగాక ఈ పద్యములఁబట్టి యథావాల్మీకముగ విస్తరించియే ఎఱ్ఱన రామాయణము వ్రాసినట్లూహింప వచ్చును.

ఎఱ్ఱన, హరివంశపీఠికఁబట్టి వేమారెడ్డి, మల్లారెడ్డిని గూర్చిన చారిత్రకవిశేషములు తెలియుచున్నవి. ఏకశిలానగర పతనాంతరము, తెలుఁగునాట వెల్లివిరిసిన పునర్వికాసప్రవర్తకులలో వేమారెడ్డి యొకడు.

తనకు నద్దంకి తగు రాజధానిగాఁ బ
రాక్రమంబున బహుభూము లాక్రమించి
యనుజతనుజబాంధవమిత్రజనుల కిచ్చె
నెదురె యెవ్వారు వేమభూవిభున కెందు.

అగ్రహారములు విద్యాతపోవృద్ధవి
ప్రుల కిచ్చి యజ్ఞకర్తలుగ నునిచెఁ
గోమరారఁ జెఱువులు గుళ్లు ప్రతిష్ఠించి

లోక సంభావ్యంబులుగ నొనర్చె
నిధులు నల్లిండ్లును నిలిపెఁ దోటలు సత్ర
ములు చలి పందిళ్లు వెలయఁ బెట్టె
హేమాద్రిపరికీర్తితామితవ్రతదాన
నివహంబు లన్నియు నిర్వహించెఁ
జేసెఁ జేయుచున్నాఁడు సేయనున్న
వాఁడు పునరుక్తకృతిశుభావళుల నెల్ల
ననఁగ శ్రీ వేమవిభున కయ్యలరు పేర్మి
వశమె వర్ణింపఁ దద్భాగ్యవైభవంబు.

తురుష్కాక్రాంతమై "అరాజకమై" అష్టకష్టములకు గురియైన తెలుఁగు దేశమును బంధమోక్షము గావించిన మహావీరుఁడు మాత్రమేగాదు వేమారెడ్డి. అతఁడు మహాదాత. హేమాద్రి రచించిన చతుర్వర్గ చింతామణి ననుసరించి, దర్మార్థకామమోక్షములకు సామరస్యము ఘటించి జీవితము నొక లలితకళగాతీర్చి దిద్దుకొనిన ఆదర్శప్రభువు.

ఇట్టి ఆదర్శప్రేరితజీవితమును గడిపి భారతీయులు లోకోత్తరపురుషులై ధర్మవీరులై వీరధర్మము, ధర్మరాజ్యము పునః ప్రతిష్ఠితము సలుపవలెనని దక్షిణాపథమున విద్యారణ్యామహర్షి యోగిగా సల్పిన కృషి ఎఱ్ఱాప్రెగ్గడ, మహాకవిగా ముందే సల్పెను. విద్యారణ్యామహర్షి వేదశంఖనినాదములకు హరిహర బుక్కరాయలు, ఎఱ్ఱాప్రెగ్గడ పంచమవేద కవితాగానమునకు, వేమారెడ్డి, మల్లారెడ్డి కత్తితో భాష్యము సల్పి జీవదుదాహరణాలై నిచలినారు. ఉత్తరాపథమున తుఘ్లకు పరిపాలనలో రాజధాని ఢిల్లీనుండి దేవగిరికి, దేవగిరినుండి

ఢిల్లీకి మారి పరిపాలనక్రమ మవ్యవస్థితముగా నున్న సమయమున దక్షిణాపథమున జాతీయసంస్కృతి పునర్వికాసమునకు మహాసామ్రాజ్యనిర్మాణమునకు స్థిరమైన పునాదులు వేయఁబడినవి. సనాతనభారతీయసంస్కృతి ఆనాడే దక్షిణాపథమునకు వలసవచ్చి సుమారు రెండు శతాబ్దులు స్థిరనివాస మేర్పరచుకొని విద్యానగరసామ్రాజ్యమున పరాకాష్ఠ నొందినది. కాలక్రమమున రెడ్డిరాజ్యము విద్యానగరసామ్రాజ్యములో గలసిపోయినను భారతీయసాంస్కృతికసామ్రాజ్యమునకు పునాదులు వేసి ఉత్తమసారస్వతసంప్రదాయములు నెలకొల్పిన ప్రతిష్ఠ మునుముందు రెడ్డిరాజ్యమునకు దక్కవలెను.

ఎఱ్ఱాప్రెగ్గడవలె హరివంశము నితివృత్తముగా స్వీకరించి రచించినకవి నాచనసోముఁడు. అతఁడు బుక్కరాయలవలన, కడపజిల్లాలోని పెన్నాతీరమందలి పెంచుకలదిన్న నగ్రహారముగాఁ బడసెను. నాచనసోముని ఉత్తరహరివంశపీఠికలోఁ గవి కాలమును చర్చించి యా శాసనకాలము శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులు గారు 1344 క్రీ॥ శ॥ 1344 సంవత్సరమని నిర్ణయించిరి.

నాచన సోముఁ డప్పటికే అష్టభాషాకవిత్వ శ్రీవిరాజితుఁడు. శ్రీమన్నాచనసోమాఖ్యమహాకవి. అందుచే నతడంతకుమునుపే ఉత్తరహరివంశమును వ్రాసినట్లెంచిన, నించుమించుగా నెఱ్ఱన, నాచనసోము లేకకాలముననే హరివంశము వ్రాసి రని చెప్పవచ్చును. ఎఱ్ఱన హరివంశము సంపూర్తిగ యథామూలముగ రచించెను. నాచనసోముని ఉత్తరహరివంశము మాత్రమే నేడుపలభ్యమానము.

ఎఱ్ఱన భారతము వ్రాసి కవియశస్సు సంపాదించి కవిత్రయమునఁ జేరెను. అతఁడు నన్నయభట్టుమహాకవీంద్రు సరస సారస్వతాంశప్రశస్తి తన్నుఁ జెందె నని చెప్పుకొనెను. కావున నాచన సోముఁడు తాను "సకలభాషాభూషణ సాహిత్యరసపోషణ సంవిధానచక్రవర్తి సంపూర్ణకీర్తి నవీనగుణసనాథుఁడ" నని గద్యలో వ్రాసికొనెను.

అప్పటికి ప్రసిద్ధపూర్వకవులు నన్నయ, తిక్కనలు. నన్నయ, సరససారస్వతాంశప్రశక్తి ఎఱ్ఱనకు దక్కిన, నాచనసోముఁడు. తిక్కన కవితాశిల్పసంపూర్ణకీర్తి తనకుఁ దక్కవలెనని తలపోసెను. అందుచే ఇది శ్రీ మధుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధానవిరాజ తిక్కన సోమయాజి ప్రణీతంబైన "శ్రీ మహాభారతకథానంతరమున" నని తన హరివంశము నారంభించెను. తిక్కనసోమయాజివలె తనకావ్యము హరినాథునకే యంకితమిచ్చెను. కమ్మని తేటతెనుఁగు నుడికారము లేర్చి కూర్చుకొనుటలో సంభాషణచారిమలో పాత్రల చిత్తవృత్తుల నిరూపించి యాంగికాభినయపూర్వకముగా వర్ణించుటలో నాచన సోముఁడు తిక్కన ననుసరించెను. తానుగూడ భారతపరాంశమగు హరివంశము వ్రాసి తిక్కనతోపాటు కవియశస్సు నార్జింపఁదలపోసెను.

అలికంబున యక్షిని డాచిన సర్వజ్ఞుఁడని నాచనసోముఁడు ప్రస్తుతి నందెను. ఇతని కవిత్రయముతోపాటు కొందరు, తిక్కన తరువాత కొందరు గణించి మహాకవి పీఠము నర్పించుచున్నారు. కొందరు ఎఱ్ఱనకంటె నధికుఁడని, ఉత్తర హరివంశము ఎఱ్ఱన హరివంశముకంటె నుత్కృష్టకావ్యమని యభిప్రాయము

వెలివుచ్చుచున్నారు. నాచనసోమునుడు గూడ, నెఱ్ఱనవలెనే యుగధర్మము ననుసరించి పంచమవేదమైన భారతమునకుఁ బరాంశమైన హరివంశము ననువదించి భారతీయసంస్కృతిని తెలుఁగునేల సుప్రతిష్ఠిత మొనర్చు మహోద్యమప్రవర్తకుఁడయ్యెను. అతనికి బుక్కరాయల ఆదరాభిమానములు లభించినవి. తిక్కన పోకడలు పుణికి పుచ్చుకొని, సజీవపాత్రల చిత్రింపఁ గలిగిన నాచనసోమునుడు కొందఱి రసజ్ఞహృదయములలో నేకచ్ఛత్రాధిపత్యము వహించుట వింతగాదు.

ఎఱ్ఱాప్రెగ్గడ మహాకవి హృదయమున నన్నయ తిక్కనల కవితారీతులు గంగాయమునలవలె సంగమించుటయే గాక స్వతంత్రవర్ణనాత్మకశయ్యారీతిగూడ కలిసి పవిత్రసాహిత్య ప్రయాగ ఏర్పడినది. ఆంధ్రవాఙ్మయమున వాగర్థముల జోడు గుఱ్ఱపు పందెపుపరుగులో నూపుతూగు లేకుండ కవితారథమును నడిపిన ప్రజ్ఞ కవిత్రయమునకే దక్కినది. ఎఱ్ఱన మహాకవి సమాధి, భావోద్రేకము నణచిపెట్టిన శాంతనిర్భరనిశ్చలచిత్తవృత్తి యాధ్యాత్మికోన్నతి శృంగారఘట్టములలోఁగూడ ప్రదర్శింపఁ గలిగిన 'నిర్వికారసల్లాపమింపారు' సంయమ మతని నన్నయ తిక్కనలతోపాటు ఋషితుల్యునిఁ జేసి యాతని వాక్కు ఋగుజ్జ్వలము సల్పినది.

ఆంధ్రవాఙ్మయమున మహాభారతము రచించిన కవిత్రయము మహేతిహాసము వినిర్మించిన మహాకవులు మాత్రమేగాక సమకాలీనజగత్తులో మహోద్యమప్రవక్తలై మహోదారజీవితము నెరపిన మహాపురుషులు. మును మార్గకవిత లోకంబున వెలయగ దేశికవిత

పుట్టించి ఆంధ్రవిషయమునఁ దెనుఁగును నిలిపిన చాళుక్యుల కాలములో నన్నయ తెనుగునకు రాజపూజ్యతతోపాటు సభాగౌరవము గల్పించిన మహానుభావుఁడు. తిక్కన మహాకవి ధర్మాద్వైతవేదాంతప్రవక్త. దక్షిణాపథమున కాకతీయ సామ్రాజ్యమునకు సమకాలికుఁడై తెలుగు వీరులు భారతయోధులవలె వీరము ధర్మము నుచ్ఛ్వాసనిశ్వాసములు చేసి క్రియా శూరులు గా వలె నని యుద్బోధించిన మహానుభావుఁడు.

ఎఱ్ఱన మహాకవి కాలమున దక్షిణాపథమునఁ దత్కాలికముగ ధర్మగ్లాని యేర్పడినది. పాండవుల యరణ్యావాసము దలపింపఁ జేయు దైన్యదుఃఖములు తెలుఁగునేల తాండవించినవి. ఎఱ్ఱన నన్నయ తిక్కన లందించిన పంచమవేదప్రబోధమును తిరిగి తెలుఁగు జాతికి వినిపించెను. మహర్షి ప్రభుసమ్మితముగ వినిపించిన యాప్రబోధమునే యెఱ్ఱన కాంతాసమ్మితముగ వినిపించెను. అందుచే మహాకవి ప్రవక్తలైన కవిత్రయము ఆంధ్రవాఙ్మయమున ప్రాతఃస్మరణీయులైన త్రిమూర్తులై నిలిచిరి.

"ఆదిని శబ్దశాసన మహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపఁ గాఁ బడియె నెందును దానినె కాని సూత్రసం
పాదన లేమిచేఁ దెనుఁగు పల్కు మఱొక్కటిఁ గూర్చి చెప్పఁగా
రా దని ద్రాక్షపాటి కవిరాక్షసుఁడీ నియమంబు చేసినన్

ఆ మూఁడు పర్వములలో
సామాన్యుఁడు నుడువు తెనుఁగు లరసికొని కృతుల్
దాము రచించిరి తిక్క సు
ధీమణి మొదలైదన తొంటి తెనుఁగు కవీంద్రుల్"

అని అప్పకవి ప్రవచనము. నన్నయ, తిక్కన, ఎఱ్ఱనల ప్రభావము సోకని తెలుఁగు కవియే యీ తెలుగునేల సహస్రసంవత్సరాల సాహిత్యజీవితములో లేఁడు. కవిత్రయము వారి పద్యములకు నీడలు క్రీనీడలు ననఁదగు పద్యము లర్వాచీనకావ్యములలో అసంఖ్యాకములు. కాని, వారి యొరవడి యంతమాత్రమే గాదు. ఆంధ్రమహాభారతము తెలుఁగులో సాహిత్యవేదము, నన్నయభట్టు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని
అధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని
కవివృషభులు మహా కావ్య మనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని
యైతిహాసికు లితిహాస మనియుఁ
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యంబని మహిఁ గొనియాడు చుండ
వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతమ్ము.

అని సంస్కృతభారతప్రశంస సల్పెను. ఈ ప్రశంస సంస్కృత భారతముకంటెను యథాక్షరముగఁ దెలుఁగు భారతమునకే యన్వయించుచున్నది.

నండూరి రామ కృష్ణమాచార్య

ఇతర రచనలు

		వెల : రూ॥
1.	తారాతోరణము – కవితలు	50/-
2.	ఆలోచనము 600 పుటల కవితలు	200/-
3.	కవితా సంహిత – కవితలు	75/-
4.	ముత్యాల గొడుగు	100/-
5.	శ్రీకృష్ణదేవరాయలు భువనవిజయం	40/-
6.	వాసవి కన్యక – నృత్య నాటిక	30/-
7.	తెలుగు పద్య శిల్పం	80/-

ప్రతులకు

డా॥ నండూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం
420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు – 500 003,
ఫోను : 7817397.